

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 24-11-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 219 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: నవమి రా. 10.20 తదుపరి దశమి; నక్షత్రం: పుబ్బ రా. 10.16 తదుపరి ఉత్తర; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: సా.4.05-4.50, అమృతఘడియలు: మ.3.06-4.54; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.28, సూర్యాస్తమయం: 5.34 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బీజేపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విజయోత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ



మహా కమలం

మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ భారీ విజయం.. మహాయుతికి 80% పైగా సీట్లు

వందేళ్ల కాంగ్రెస్ పార్టీ.. మరాఠా యోధుడు శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ.. ఉద్ధవ్ థాక్రే సారథ్యంలోని శివసేన కలిసి పోటీ చేస్తే.. ఆ కూటమికి వచ్చిన సీట్లు చీలిక నేత ఏక్‌నాథ్ శిందే ఆధ్వర్యంలోని శివసేనకు వచ్చిన సీట్ల కంటే తక్కువ! ఎన్సీపీ చీలిక నేత అజిత్ పవార్ పార్టీకి వచ్చిన సీట్ల కంటే కాస్త ఎక్కువ!!

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చరిత్రలోనే అతి ఎక్కువ సీట్ల (132)ను ఆ పార్టీ సాధిస్తే.. అతి తక్కువ సీట్ల (16)తో కాంగ్రెస్ సరిపెట్టుకోవాల్సి వచ్చింది! అంతేనా.. ఎన్నికల్లో ఆరు ప్రధాన పార్టీలు పోటీ పడితే.. కాంగ్రెస్ ఐదో స్థానంలో నిలిచింది! ఇంకా చెప్పాలంటే.. గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన సీట్లతో పోల్చినా మూడో వంతుకు పడిపోయింది! ప్రతిపక్ష హోదాను కూడా దక్కించుకోలేకపోయింది!

గెలుపును కూడా ఓటమిగా మలచుకోగలిగిన సామర్థ్యం కాంగ్రెస్ సొంతమనే భావన ఇప్పుడు బలంగా ప్రబలింది! ఇటీవలి హరియాణా ఎన్నికలతోపాటు ఇప్పుడు మహారాష్ట్ర ఫలితాలు ఇందుకు నిదర్శనం! వెరసి, విజయాన్ని చిరునామాగా మార్చుకున్న బీజేపీ ఇప్పటికే దేశంలో 13 రాష్ట్రాల్లో అధికారం దక్కించుకుని మహా కమలంగా ఆవిర్భవిస్తే.. కాంగ్రెస్ మూడు రాష్ట్రాలకే పరిమితమైంది!

- మరాఠా గడ్డపై 90% స్ట్రైక్‌రేట్‌తో బీజేపీ సునామీ
- మహాయుతిని గట్టెక్కించిన ఎన్నికల ముందు పథకాలు
- మహిళలు, రైతులు, మరాఠాలు, యువత ఓటు దానికే
- దేవేంద్ర ఫడణవీసే సీఎం.. డిప్యూటీగా శిందే?
- రేపు బీజేపీఎల్పీ భేటీ.. 26న కొత్త సీఎం ప్రమాణం
- కాంగ్రెస్ నేతృత్వంలోని ఎంవీఏకు ఘోర పరాభవం
- శాసనసభలో ప్రతిపక్ష పార్టీ హోదాకూ దూరమే
- ప్రధాన పార్టీలుగా శివసేన, ఎన్సీపీ చీలిక పక్షాలు
- ముగిసిన శరద్ పవార్ శకం.. ఉద్ధవ్ థాక్రే దారెటు!?
- మజ్లిస్ ఒక చోట గెలుపు.. 4 చోట్ల ద్వితీయ స్థానం

... మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహా యుతి కూటమి అఖండ విజయం సాధించింది. 288 సీట్ల అసెంబ్లీలో నాలు గింట మూడొంతులకుపైగా స్థానాల్లో ఘన విజయం దక్కించుకుంది. కూటమిలోని బీజేపీ 149 స్థానాల్లో బరిలోకి దిగి ఏకంగా 132 స్థానాల్లో గెలిచింది. అంటే.. దాదాపు 90 శాతం విజయాన్ని (స్ట్రైక్ రేట్) సాధించింది. ఇక, కూటమిలోని ఏక్‌నాథ్ శిందే శివసేన పార్టీ 81 స్థానాల్లో పోటీ చేసి 57 సీట్లను దక్కించుకుంటే.. అజిత్ పవార్ ఎన్సీపీ 59 స్థానాల్లో పోటీ చేసి 41 సీట్లలో విజయం సాధించింది! ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది! కూటమిలోని మూడు పార్టీలకు వచ్చిన సీట్లను కలిపినా అర్ధ సెంచరీ దాటలేదంటే కాషాయ సునామీని అర్థం చేసుకోవచ్చు! ఇక, ఈసారి ఫలితాల్లో కాంగ్రెస్‌కూ కొంత ఊరట దక్కింది. ఝార్ఖండ్‌లో ఆ పార్టీ భాగస్వామిగా ఉన్న కూటమి మరోసారి అధికార పీఠాన్ని చేజిక్కించుకోవడమే కాకుండా వయనాడ్ ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ ఘన విజయం సాధించారు! ఝార్ఖండ్‌లో వరుసగా రెండోసారి కాంగ్రెస్-జేఎంఎం కూటమి ఘన విజయం సాధించింది. 81 సీట్ల అసెంబ్లీలో

మిగతా 13వ పేజీలో...

మహారాష్ట్ర అన్ని రికార్డులను బ్రేక్ చేసింది. ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారు. అబద్ధాలు, వంచనకు పాల్పడిన కాంగ్రెస్, దాని మిత్రపక్షాలను ఓడించారు. అధికారం కోసం కాంగ్రెస్ కులతత్వమనే విషాన్ని వ్యాపింపజేస్తోంది. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌లో ఆ పార్టీ ఇచ్చిన తప్పుడు హామీలను మహా ప్రజలు గమనించారు. అందుకే మట్టి కరిపించారు. 'దేశమే ముందు' అనే వారితో తప్ప 'కుర్చీయే ముందు' అనే వారిని ఓటర్లు నమ్మరని తేలింది.

- ప్రధాని నరేంద్ర మోదీ

ఎవరు సీఎం? ఎవరు డిప్యూటీ?



ఎన్నికల ఫలితాల అనంతరం పరస్పరం మిఠాయి తినిపించుకుంటున్న ఫడణవీస్, శిందే



ఝార్ఖండ్‌లో హేమంతం

14

- రెండోసారీ సోరెన్.. 24 ఏళ్ల సంప్రదాయానికి తెర
- 'ఇండియా' కూటమి హవా.. 81 సీట్లలో 56 కైవసం
- ఎన్డీయేకు మళ్లీ నిరాశ.. 24 సీట్లకే పరిమితం



లోక్‌సభలో ప్రియాంకం

- వయనాడ్‌లో 4.10 లక్షల ఓట్ల మెజారిటీ
- అన్న రాహుల్ కంటే 45 వేల ఆధిక్యం
- ఉప ఎన్నికల్లో అధికార పార్టీలదే పైచేయి
- 48 అసెంబ్లీ సీట్లలో ఎన్డీయేకే అధికం
- కర్ణాటక, కేరళలో కాంగ్రెస్ జయభేరి 13

మహారాష్ట్ర (288)	గెలిచిన సీట్లు	ఓటింగ్%
మహాయుతి కూటమి	235	49.6
బీజేపీ	132	26.77
శివసేన (శిందే)	57	12.38
ఎన్సీపీ (అజిత్ పవార్)	41	9.1
మహావికాస్ అఘాడీ	49	35.3
శివసేన (యూబీటీ)	20	9.96
కాంగ్రెస్	16	12.42
ఎన్సీపీ (ఎస్పీ)	10	11.28

ఝార్ఖండ్ (81)	గెలిచిన సీట్లు	ఓటింగ్%
ఇండియా కూటమి	56	44.33
జేఎంఎం	34	23.44
కాంగ్రెస్	16	15.56
ఆర్జేడీ	4	3.44
సీపీఐ (ఎంఎల్)	2	1.89
ఎన్డీయే కూటమి	24	38.14
బీజేపీ	21	33.18
బీజేపీ మిత్రులు	3	4.96

కొడంగల్‌లో ఫార్మాసిటీ కాదు..
పారిశ్రామిక కారిడార్

- నా ప్రజలను నేనెందుకు ఇబ్బంది పెడతా..?
- వామపక్ష పార్టీల నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి
- డిసెంబరు 1 నుంచి 9 వరకు ఏడాది సంబరాలు
- 4న పెద్దపల్లిలో నిరుద్యోగ యువతతో భారీ సభ
- పలువురికి ఉద్యోగ నియామక పత్రాల అందజేత
- 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ
- 30న పాలమూరులో రైతుల అవగాహన సదస్సు
- హైదరాబాద్‌కు 20 టీఎంసీల గోదావరి జలాలు
- 1న టెండర్లకు వెళ్లాలి.. అధికారులతో భేటీల్లో సీఎం
- రాష్ట్రంలో 23 లక్షల మంది రైతులకు రుణమాఫీ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వెల్లడించిన అధికారులు



వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం రేవంత్, మంత్రి తుమ్మల తదితరులు

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టతనిచ్చారు. అక్కడ ఏర్పాటు చేసేది పారిశ్రామిక కారిడారేనని, ఫార్మాసిటీ కాదని తేల్చిచెప్పారు. కాలుష్య రహిత పరిశ్రమలనే ఏర్పాటు చేస్తామన్నారు. కొడంగల్ ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధి తన బాధ్యత అని, అక్కడి యువత, మహిళలకు ఉపాధి కల్పించడమే తన ఉద్దేశమని తెలిపారు. "నా సొంత నియోజకవర్గ ప్రజలను నేనెందుకు ఇబ్బంది పెడతాను?" అని ప్రశ్నించారు. శనివారం సచివాలయంలో తనను కలిసిన వామపక్ష పార్టీల నేతలతో సీఎం రేవంత్ పై విధంగా వ్యాఖ్యానించారు. సేకరిస్తున్న

మిగతా 2వ పేజీలో...

చంద్రబాబు చేతికి జగన్ జుత్తు!



కొత్త పలుకు

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు ఇప్పుడు మహర్దశ నడుస్తున్నట్టుగా ఉంది. సీఎంగా ఉన్నప్పుడు తనను ముప్పుతిప్పలు పెట్టడమే కాకుండా చివరకు జైలుకు కూడా పంపిన జగన్ రెడ్డి జుత్తు మాత్రమే కాదు- ఏకంగా పీక ఇప్పుడు చంద్రబాబు చేతికి చిక్కింది. మొదటి నుంచీ డబ్బు పిచ్చి ఉన్న జగన్ రెడ్డి.. ప్రపంచ కుబేరుడు కావాలన్న దురాశను నింపుకొన్న గౌతమ్ అదానీతో చేతులు కలిపారు. ఫలితంగా ఏపీ ప్రజలపై 25 ఏళ్లలో దాదాపు 2 లక్షల కోట్ల రూపాయల అదనపు భారం పడేలా అదానీ కంపెనీతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం తెరమీదకు వచ్చింది. 2 రోజుల క్రితం వరకు గుట్టుగా ఉన్న ఈ భారీ స్కాం అమెరికా చట్టాల పుణ్యమా అని వెలుగులోకి వచ్చింది. దీంతో బాబు చేతికి పాశుపతాస్త్రం దొరికినట్టయింది.

ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ముందున్న కర్తవ్యం ఏమిటి? సెకీ ద్వారా అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేసుకొని తీరాల్సిన పరిస్థితి ఏర్పడలేదా? ప్రజలపై రూ.2 లక్షల కోట్లపైగా అదనపు భారం పడే విధంగా కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేసుకోకపోతే ప్రభుత్వం కూడా పాపం చేసినట్టే అవుతుంది. అదానీ కంపెనీ నుంచి జగన్ రెడ్డికి రూ.1750 కోట్ల ముడుపులు ముట్టాయని రుజువవుతుందో లేదో తెలియదుగానీ మంత్రివర్గం ఆమోదం కూడా లేకుండా ట్రాన్స్‌మిషన్ చార్జీలు, ట్రాన్స్‌మిషన్ నష్టాల రూపంలో 2 లక్షల కోట్ల రూపాయలు అదనంగా చెల్లించడానికి పీపీఏ కుదుర్చుకున్న పాపానికి జగన్ రెడ్డి విచారణను ఎదుర్కోక తప్పదు.

4

గత వారం నేను విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నట్టు విజయసాయి రెడ్డి ప్రకటించారు. కాకపోతే ముఖాముఖి కాకుండా 'మేధావులు, విశ్రాంత న్యాయమూర్తులు, మీడియా సంస్థలు, ఇంకా ఎవరెవరి సమక్షంలోనో చర్చ జరగాలి. తగ్గేదేల్యా?' అని సినిమా డైలాగులు పలికారు. ఇంకా నయం- ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో చర్చ జరగాలని కోరలేదు. దొంగ లెక్కలకు మారుపేరైన నువ్వు కూడా సవాళ్లు విసరడం గొప్పగా ఉంది. ఎంతైనా నీ బరితెగింపును అభినందించాలోయ్ విజయసాయీ! ఎందుకైనా మంచిది జగన్ అనుమతి తీసుకొని చర్చకు సిద్ధపడు. జగన్ ముందు కూర్చోడానికి కూడా ధైర్యం లేని నీకు తేడా వస్తే వీపు పగిలిపోయే ప్రమాదం ఉంది. టేక్ కేర్!



'నాగాహిల్స్'పై సర్కారుకు నివేదిక!

- విలువైన సొసైటీ భూముల చెరపై సర్వత్రా చర్చ
- స్థలంలో పనులు నిలిపివేసిన ఆక్రమణదారులు
- 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపిన ప్లాట్ల యజమానులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)



హైదరాబాద్ నడిబొడ్డున రాయదుర్గంలోని నాగాహిల్స్ సొసైటీని చెరబట్టి, అత్యంత విలువైన భూములను దౌర్జన్యంగా అధీనంలోకి తీసుకున్న బడా బాబుల బాగోతంపై 'ఆంధ్రజ్యోతి' శనివారం ప్రచురించిన కథనం తీవ్ర కలకలం రేపింది. ప్లాట్ల యజమానులు మూడు దశాబ్దాలకు పైగా న్యాయపోరాటం చేసి గెలిచి, చివరకు ఇళ్లు కట్టుకునే సమయంలో గద్దల్లా వాలిన భూ మాఫియా దౌర్జన్యంపై 'నాగాహిల్స్‌లో కబ్జానాగులు' శీర్షికతో కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. దాదాపు రూ.2 వేల కోట్ల విలువైన భూముల్లో బడా వ్యక్తులు పాగా వేసి, ప్లాట్ల యజమానులను వారి స్థలాల్లోకి రాకుండా బౌన్సర్లతో అడ్డుకుంటున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో ఈ వ్యవహారం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టులో కేసు గెలిచిన ప్లాట్ల యజమానులను భూ మాఫియా అడుగడుగునా బెదిరిస్తూ సదరు భూమిని తమకు తక్కువ నిష్పత్తిలో 'అభివృద్ధి'కి ఇవ్వాలని ఒత్తిడి చేస్తోంది. బెదిరింపులకు పాల్పడుతున్న వారికి అధికార వ్యవస్థలు దాసోహం కావడాన్ని ఆధారాలతో సహా 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. మరోవైపు అక్కడ అక్రమంగా నిర్మాణ పనులు చేపడుతున్న ఆక్రమణదారులు తాత్కాలికంగా పనులు నిలిపివేశారు. ఈ కథనం ప్రచురితమవడంతో ఇప్పటి వరకు ప్లాట్ల విషయంలో ఏం జరుగుతుందో తెలియని విదేశాల్లో ఉన్న కొందరు ప్లాట్ల యజమానులు సహచరులకు ఫోన్ చేసి ఆరా తీశారు. కొందరు ప్లాట్ల యజమానులు శనివారం రాత్రి రాయదుర్గంలో సమావేశమై, భూ మాఫియాపై పోరాడాలని నిర్ణయించారు. తమ పోరాటానికి మద్దతుగా నిలిచిన 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

90% పూర్తయిన కుటుంబ సర్వే

- కంప్యూటరీకరణ ప్రారంభం

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే 90 శాతం పూర్తయింది. సర్వేలో మొత్తం 1,16,93,698 నివాసాలు గుర్తించగా శనివారం వరకు 1,05,03,257 (90శాతం) నివాసాలలో సర్వే పూర్తి చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. సర్వే పూర్తయిన కుటుంబాలకు సంబంధించిన వివరాల కంప్యూటరీకరణ ప్రక్రియ ప్రారంభమైందని వెల్లడించింది. 2,61,384 నివాసాలకు సంబంధించిన సర్వే వివరాలు కంప్యూటరీకరణ పూర్తయిందని ప్రభుత్వం తెలిపింది. కాగా, సర్వే డేటా నమోదులో తప్పులు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. డేటా ఎంట్రీ వివరాల నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. సర్వే పత్రాల భద్రత విషయంలో తాగు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు.

లోకం తీరు





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి, చిత్రంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

సాయిరెడ్డి ఆత్మహత్యతో సీఎం సోదరులకు సంబంధం లేదు

- ఎంపీ మల్లు రవి

వంగూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూలు జిల్లా కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్యతో సీఎం రేవంత్‌రెడ్డికి గానీ, ఆయన సోదరులకు గానీ ఎలాంటి సంబంధం లేదని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేశ్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన కొండారెడ్డిపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఎం సోదరులు కక్ష కట్టడం వల్లే సాయిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారని, అందుకు సీఎం బాధ్యత వహించాలని కేటీఆర్, హరీశ్‌రావులు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మాజీ సర్పంచ్ ఇంటికి దారి ఇవ్వకుండా అడ్డంగా గోడ కట్టారని మాట్లాడటం సరికాదన్నారు. సాయిరెడ్డి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో త్వరలో బయటకు వస్తుందన్నారు. గోడ కట్టినట్లు ఇక్కడికి వచ్చి నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని కేటీఆర్, హరీశ్‌రావులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ సవాల్ విసిరారు. పుట్టిన ఊరి రుణం తీర్చుకోవాలన్న తపనతో సీఎం రేవంత్ పలు అభివృద్ధి పనులు చేపడుతుంటే వాటిని రాజకీయం చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ చేస్తున్న చౌకబారు విమర్శలు, శవరాజకీయాలను ప్రజలు క్షమించరని విమర్శించారు.

కేటీఆర్‌పై సృజన్‌రెడ్డి క్రిమినల్ పిటిషన్

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నాంపల్లి ఎక్సైజ్ కోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలైంది. తన పరువుకు నష్టం కలిగిస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి బావమరిది, వ్యాపారవేత్త సూదిని సృజన్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. శోధ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు తాను ప్రమోటర్ లేదా డైరెక్టర్ కాదని తెలిసినప్పటికీ కేటీఆర్ తనపై నిరాధార ఆరోపణలు చేశారని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం తనపై అసత్య ఆరోపణలు చేస్తూ అమృత్ టెండర్ల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారని తెలిపారు. ఈ వ్యవహారంలో తాము లీగల్ నోటీసులు ఇచ్చినా కేటీఆర్ అసత్య ఆరోపణలు కొనసాగిస్తుండటంతో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

సింగరేణి మాజీ కార్మికులకు 27న బోనస్

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో పదవీ విరమణ చేసిన కార్మికులకు ఈ నెల 27న దీపావళి బోనస్‌ను జమచేయాలని సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు శనివారం సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 ఏప్రిల్ 1 నుంచి అక్టోబరు 24కు వరకు పదవీ విరమణ చేసిన వారికి ఈ సొమ్మును విడుదల చేస్తున్నామని తెలిపారు. బుధవారం వారి ఖాతాల్లో బోనస్ సొమ్ము జమవుతుందని చెప్పారు. 2,754 మంది కార్మికులకు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ. 93,750 చొప్పున రూ.18.27 కోట్లను విడుదల చేయనున్నామని బలరామ్ వెల్లడించారు.

8 నుంచి హైదరాబాద్‌లో అగ్నివీర్‌ల ఎంపిక

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో వచ్చే నెల 8 నుంచి 16 వరకు అగ్నివీర్‌ల నియామక ర్యాలీ ఉందని ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో అగ్నివీర్‌ల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నారు. పదో తరగతి అర్హతగా ఉన్నవారు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ట్రేడ్స్‌మెన్ పోస్టుకు ఎనిమిదవ తరగతి అర్హత సరిపోతుందన్నారు. వారం రోజుల పాటు రిక్రూట్‌మెంట్ జరుగుతుందని తెలిపారు. అలాగే గతంలో ఎంపికలు నిర్వహించిన మిలటరీ పోలీసు అభ్యర్థులు ఈ ఏడాది ఫిబ్రవరి 12నాటి నోటిఫికేషన్ ప్రకారం విద్యార్హత, స్థానికత, కుల ధ్రువీకరణ, ఈబీసీ తదితర డాక్యుమెంట్లు తీసుకురావాలన్నారు. మిలటరీ పోలీసు అభ్యర్థులు తమిళనాడు, తెలంగాణ, ఏపీ, పుదుచ్చేరి నుంచి రానున్నారని తెలిపారు.

గవర్నర్ ప్రతిభా పురస్కారాల దరఖాస్తు గడువు 30 వరకు పొడిగింపు

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024కు దరఖాస్తు చేసుకునేందుకు గడువును పొడిగించినట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. గతంలో ప్రకటించిన గడువు శనివారంతో ముగిసింది. అయితే, ఆయా వర్గాల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు నవంబరు 30 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు గడువు పెంచినట్లు అధికారులు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో గత ఐదేళ్లుగా విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

నిలోఫర్ వద్ద శిశువు కిడ్నాప్

మంగళ్‌హాట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చికిత్స కోసం నిలోఫర్ ఆస్పత్రికి తీసుకొచ్చిన నెలరోజుల శిశువును గుర్తు తెలియని వ్యక్తి కిడ్నాప్ చేశాడు. జహీరాబాద్‌కు చెందిన హసీనా బేగం- గఫార్ దంపతులకు నెల క్రితం బాబు జన్మించాడు. ఆ చిన్నారికి కామెర్లు అవ్వడంతో చికిత్స కోసం నిలోఫర్‌లో చేర్చారు. బాబు ఆరోగ్యం మెరుగుపడడంతో వైద్యులు శనివారం డిశ్చార్జ్ చేశారు. దాంతో అమ్మ, అమ్మమ్మ చిన్నారిని తీసుకుని మెయిన్ గేటు వద్దకు వచ్చారు. అప్పుడు గుర్తు తెలియని వ్యక్తి వారితో మాటలు కలిపి వారి దృష్టి మరల్చి చిన్నారిని తీసుకుని పారిపోయాడు. దాంతో బాబు అమ్మ, అమ్మమ్మ నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చలి పులి.. మరో 3 రోజులు యెల్లో అలెర్ట్

హైదరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతూనే ఉంది. రాగల మూడు రోజుల పాటు వాతావరణ శాఖ యెల్లో అలెర్ట్ జారీ చేసింది. వచ్చే మూడు రోజులు రాత్రి పూట ఉష్ణోగ్రతలు ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో 9.5 డిగ్రీలలోపు, మిగిలిన జిల్లాల్లో 10-14 డిగ్రీల మధ్య నమోదు అయ్యే అవకాశం ఉందని పేర్కొంది. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో శనివారం 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు అయినట్లు తెలిపింది. కాగా, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు కాస్త పెరిగాయి. నాలుగు రోజుల కిందట అక్కడ ఉష్ణోగ్రత 9 డిగ్రీలకు పడిపోగా తాజాగా 10.3 డిగ్రీలకు పెరిగింది. మిగిలిన అన్ని జిల్లాల్లో శనివారం ఉష్ణోగ్రతలు 10-15 డిగ్రీల మధ్య నమోదయ్యాయి



ప్రజాపాలన విజయోత్సవాలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్; చిత్రంలో మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు కేకే, సీఎస్ శాంతికుమారి తదితరులు

కొడంగల్‌లో ఫార్మాసిటీ కాదు.. పారిశ్రామిక కారిడార్

(మొదటిపేజీ తరువాయి)

భూములకు అందించే పరిహారాన్ని పెంచే అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. లగచర్ల ఘటనలో కుట్ర చేసిన వారిని వదిలిపెట్టబోమన్న సీఎం.. ఈ ఘటనలో రైతులపై నమోదైన కేసుల విషయాన్ని పరిశీలిస్తామన్నారు. కాగా లగచర్ల ఘటన, అనంతర పరిణామాలపై సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు సహా పలువురు వామపక్ష నేతలు సీఎంకు వినతిపత్రం అందించారు. ఇదిలా ఉండగా.. తెలంగాణలో అధికారం చేపట్టి డిసెంబరు 7నాటికి ఏడాది అవుతున్న సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు డిసెంబరు 1 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రమంతటా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై శనివారం సాయంత్రం సచివాలయంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయోత్సవాల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు ఈ ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలన్నారు.

4న పెద్దపల్లిలో సభ..

తొలి ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలతో పాటు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల ప్రణాళికను ప్రజలకు వివరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. డిసెంబరు 4న పెద్దపల్లి జిల్లాల్లో యువతతో విజయోత్సవ సభ జరపాలని నిర్ణయించారు. అదే వేదికగా గ్రూప్-4తోపాటు వివిధ పోస్టులకు ఎంపికైన 9వేల మందికి నియామక పత్రాలు అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇక డిసెంబరు 7, 8, 9 తేదీల్లో రాష్ట్రమంతటా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. డిసెంబరు 9న సచివాలయం ముఖద్వారం ఎదుట ఏర్పాటు చేస్తున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలని సీఎం నిర్ణయించారు. ఆరోజు సాయంత్రం జరిగే ఈ వేడుకలకు తెలంగాణ ఉద్యమకారులను, మేధావులను, విద్యావంతులను, వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన వారందరినీ ఆహ్వానించాలని సూచించారు.

శాఖలవారీగా ప్రగతి నివేదికలు..

డిసెంబరు 1 నుంచి శాఖల వారీగా నిర్దేశించిన కార్యక్రమాలు చేపట్టాలని అన్ని శాఖల అధికారులకు సీఎం సూచించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలన్నీ ఈ వారం రోజుల్లో జరిగేలా ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. తమ శాఖల వారీగా రోజుకో మంత్రి తొలి ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాల ప్రగతి నివేదికతోపాటు భవిష్యత్తు ప్రణాళికను మీడియా ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. డిసెంబరు 7 నుంచి మూడు రోజులపాటు సచివాలయ పరిసరాలు, ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ ప్రాంతమంతా తెలంగాణ వైభవం వెల్లివిరిసేలా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మూడురోజులపాటు తెలంగాణ సంస్కృతి, కళారూపాలు ఉట్టిపడే కార్యక్రమాలతో పాటు మ్యూజికల్ షోలు, ఎయిర్ షో, డ్రోన్ షోలను నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజీల్లోనూ ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ నెల 30న మహబూబ్‌నగర్‌లో నిర్వహించ తలపెట్టిన రైతు సదస్సును 28 నుంచి మూడు రోజులపాటు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని రైతులందరూ పాల్గొనేలా చూడాలన్నారు. దీనిని బహిరంగ సభలా కాకుండా వ్యవసాయ రంగంలో రైతులకు అవగాహన కలిగించేలా అవగాహన సదస్సుగా నిర్వహించాలని సూచించారు. ఈ అంశంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో అధికారులతో రేవంత్ సమావేశమయ్యారు.

హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీలు

హైదరాబాద్ నగరం తాగునీటి అవసరాల కోసం కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల నుంచి 20 టీఎంసీల గోదావరి నీటి తరలింపునకు సంబంధించి సమగ్ర నివేదిక తయారు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఏ ప్రాజెక్టు నుంచి నీటి తరలింపునకు ఎంత వ్యయం అవుతుందనే వివరాలతో పాటు నీటి లభ్యతపై అధ్యయనం చేయాలన్నారు. డిసెంబరు 1న టెండర్లకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ మేరకు శనివారం తన నివాసంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.

తెలంగాణ తల్లి విగ్రహ పనులను పరిశీలించిన సీఎం

సచివాలయంలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే తెలంగాణ తల్లి విగ్రహ పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం మరోమారు పరిశీలించారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలపై అన్ని శాఖల అధికారులతో సమావేశం ముగిసిన అనంతరం విగ్రహ పనుల వద్దకు వెళ్లారు.

23 లక్షల మందికి రుణమాఫీ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ పథకం కింద ఇప్పటివరకు 23 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ జరిగిందని అధికారులు సీఎం రేవంత్‌రెడ్డికి తెలిపారు. ఆధార్ నంబర్లు, బ్యాంకు ఖాతాల పేర్లలో తప్పులు, కుటుంబాల నిర్ధారణ కారణాలతో కొన్నిచోట్ల కొంత మందికి రుణమాఫీ జరగలేదని పేర్కొన్నారు. రుణమాఫీ జరగలేదంటూ ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో.. పథకం కింద ఇప్పటివరకు జరిగిన మాఫీ వివరాల నివేదికను అధికారులు ముఖ్యమంత్రికి అందజేశారు.



రోటిబండ తండాలో విచారణ జరుపుతున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు

ఇష్టముంటేనే భూములివ్వండి!

- లేదంటే కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోండి
- లగచర్ల బాధితులతో ఎన్‌హెచ్‌ఆర్‌సీ

బొంరాస్‌పేట్/కొడంగల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీల కోసం రైతులు ఇష్టముంటేనే భూములు ఇవ్వాలని జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సూచించింది. లేదంటే కోర్టుకు వెళ్లి భూసేకరణపై స్టే తెచ్చుకోవాలని పేర్కొంది. బలవంతంగా ఎవరూ భూములు లాక్కోరని తెలిపింది. శనివారం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, రోటిబండ తండాలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు పర్యటించారు. ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన అధికారులపై దాడి చేసిన ఘటనలో అరెస్టయిన వారి కుటుంబ సభ్యులతో కమిషన్ రిజిస్ట్రార్ ఆఫ్ లా ముఖేశ్, ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌సింగ్, ప్రకాశ్‌శర్మ మాట్లాడారు. ఒక్కొక్కరి నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. ఆ రోజు లగచర్లలో ఏం జరిగింది? ఘటన తర్వాత పోలీసులు వచ్చి ఏం చేశారు? అని బాధిత కుటుంబాల సభ్యులను అడిగారు. దీంతో ఘటన తీరును మహిళలు వివరించారు. రోటిబండ తండాకు చెందిన సోనీబాయి మాట్లాడుతూ.. నవంబరు 11న అర్ధరాత్రి కరెంటు నిలిపేసి తండాలో 500 మందికిపైగా పోలీసులు వచ్చారని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులకు తెలిపారు. ఆ సంఘటనలో తన కొడుకు లేకపోయినా బలవంతంగా తీసుకెళ్లారని చెప్పారు. కాగా, తాను పోలీసుల భయంతో అనారోగ్యానికి గురయ్యానని ప్రమీల అనే మహిళ తెలిపారు. అధికారులు పంచాయతీ కార్యదర్శిని పిలిపించి ఆమెను ఆస్పత్రికి పంపించారు. అలాగే సక్రియా నాయక్ అనే రైతు మాట్లాడుతూ.. తన కుమారుడు ఎక్కడున్నాడో, ఏ జైలులో పెట్టారో తెలియడం లేదని చెప్పడంతో కమిషన్ అధికారులు స్పందిస్తూ ఆచూకీ తెలియనివారి కోసం పోలీస్‌స్టేషన్‌లో తప్పిపోయినట్లు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా.. ఇప్పుడున్న ధర కంటే రెట్టింపు ధర ఇస్తే భూములు ఇస్తారా? అని కమిషన్ సభ్యులు ప్రశ్నించారు. అయితే.. ఎంత ధర ఇచ్చినా భూములు ఇవ్వం అని వారు తేల్చి చెప్పారు.

పొలం పనులకు ఇబ్బందిగా మారింది..

పోలీసుల చర్య కారణంగా తండాలో మగవారంతా భయంతో వేరే చోట్లకు వెళ్లారని రోటి బండతండాకు చెందిన శాంతిబాయి చెప్పారు. వరి కోతకొచ్చిందని, అందరూ జైలులో, బయట ఉండటంతో పొలం పనులకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. దీంతో కోర్టులో జమానత్ పిటిషన్ వేసి లొంగిపోతే బెయిల్ వస్తుందని కమిషన్ సభ్యులు చెప్పారు. పోలీసులకు లొంగిపోని వారుంటే యాంటిసిపేటరీ బెయిల్‌కు పిటిషన్ వేయాలన్నారు. విచారణలో భాగంగా సంగారెడ్డి జైలుకు సైతం వెళ్తున్నట్టు కమిషన్ సభ్యులు చెప్పారు. నివేదికను ఎన్‌హెచ్‌ఆర్‌సీకి అందజేస్తామన్నారు. కాగా, వాంగ్మూలంపై సంతకాలు చేయాలని అధికారులు కోరగా తండావాసులు అంగీకరించలేదు.

రాష్ట్రంలో నియంత పాలన: కేటీఆర్



కుషాయిగూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నియంత పాలన నడుస్తోందని, త్వరలోనే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్తారని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో ఆయన ములాఖత్ అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్షపూరిత వైఖరి కారణంగానే పేద, గిరిజన, బలహీన వర్గాల రైతుల తరపున పోరాటం చేసిన నరేందర్ రెడ్డి జైల్లో ఉన్నారని అన్నారు. నరేందర్ రెడ్డి కోరిక మేరకు జైలుపాలైన 30మంది రైతులకు అండగా ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. సొంతూరు కొండారెడ్డి పల్లిలో మాజీ సర్పంచ్ 85 ఏళ్ల సాయిరెడ్డి అనే వ్యక్తిపై రేవంత్ రెడ్డి పగబట్టి, అవమానించి ఆయన ఉసురు తీశారని విమర్శించారు. గత పదేళ్ల తమ పాలనలో ఇలాంటి ఘటనలు ఎక్కడైనా జరిగాయా అని ఆయన ప్రశ్నించారు. 'రేవంత్ ఇది నీ సొంత సామ్రాజ్యమా...? నువ్వు చక్రవర్తివా? వెయ్యేళ్లు బతకడానికి వచ్చావా?' అని నిలదీశారు. ప్రజలు అన్ని తప్పులను గమనిస్తున్నారని, శిశుపాలుడికి పట్టిన గతే కాంగ్రెస్‌కు పట్టనుందని కేటీఆర్ ఆక్షేపించారు.

లగచర్ల ఘటన ప్రభుత్వ కుట్ర

- సేవాలాల్‌సేన, పౌరహక్కుల సంఘం గిరిజన సంఘాల ఆరోపణ

పంజాగుట్ట, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా లగచర్లలో జరిగిన ఘటన ప్రభుత్వ కుట్రేనని.. కలెక్టర్, అధికారులపై దాడి కాదని, అది ధర్మాగ్రహమేనని, దాన్ని సాకుగా తీసుకుని గ్రామాలను వల్లకాడు చేస్తున్నారని సేవాలాల్‌సేన, పౌరహక్కుల సంఘం, గిరిజన సంఘాలు ఆరోపించాయి. రాష్ట్రంలో రాక్షస పాలన, పోలీసు రాజ్యం సాగుతోందని, రాష్ట్రాన్ని నడుపుతోంది రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి అని ఆరోపించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భూక్య సంజీవ్ నాయక్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్, ఓయూ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు నెహ్రూ నాయక్, తదితరులు మాట్లాడారు.గిరిజనులు, రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, కలెక్టర్, పోలీసులపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. భూసేకరణ ఫార్మా కంపెనీల కోసం కాదని అంటున్న ప్రభుత్వం గవర్నర్ విడుదల చేసిన గెజిట్ లో ఫార్మా కంపెనీల కోసం భూసేకరణ అని చెప్పిందని గుర్తుచేశారు. భూసేకరణను నిలిపివేయాలని, గిరిజనులతో సీఎం చర్చలు జరిపి పరిష్కార మార్గం కనుగొనాలని డిమాండ్ చేశారు.

నక్సల్స్‌కు వ్యతిరేకంగా ఆదివాసీల ర్యాలీ

ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దర్ని చంపారని ఏటూరు నాగారంలో నిరసన



ఏటూరునాగారం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తమ సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారంటూ ఇద్దర్ని చంపిన మావోయిస్టుల దుశ్చర్యను వ్యతిరేకిస్తూ ఏటూరు నాగారంలో ఆదివాసీలు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారన్న నెపంతో ములుగు జిల్లా వాజేడు మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేష్, అతడి పెదనాన్న కుమారుడు ఉయిక అర్జున్‌ను మావోయిస్టులు గురువారం అర్ధరాత్రి నరికి చంపిన సంగతి తెలిసిందే. ఇందుకు నిరసగా ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీలు, గొత్తికోయలు.. సుమారు 2 వేల మంది ప్లకార్డులు చేతపట్టి ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయం నుంచి వై-జంక్షన్ మీదుగా బస్టాండ్ వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. బస్టాండ్‌లో రాస్తారోకో చేశారు.ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. మావోయిస్టుల పోరాటం అంటే అమాయక ఆదివాసీలను చంపడమేనా? అని ప్రశ్నించారు. మావోయిస్టులు తమ ఉనికిని కాపాడుకోవడం కోసం రమేష్, అర్జున్‌లను చంపడం అమానుషమన్నారు. ఈ హత్యలపై ప్రజా సంఘాల నాయకులు స్పందించాలని కోరారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



ఆదివాసీ అమ్మాయిలను విడుదల చేయాలి

» తెలంగాణ పౌరహక్కుల సంఘం డిమాండ్

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీల హననం జరుగుతోందని తెలంగాణ పౌరహక్కుల సంఘం ఆరోపించింది. నవంబరు 7న సుక్మా జిల్లా కొండపల్లిలో సాయుధ క్యాంప్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆదివాసీలు ఆందోళనలు చేయగా ఇద్దరు అమ్మాయిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వారిని విడుదల చేయాలని సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా కమిషన్, మానవహక్కుల కమిషన్, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు.

యువతిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన దుండగుడు

» పూర్తిగా కాలిపోయిన బాధితురాలి ముఖం

కల్హేర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఉన్న యువతిపై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేసి, ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం వాసర్‌లో జరిగింది. స్నేహలత(19) అనే యువతి.. తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా శుక్రవారం ఒక్కతే ఇంట్లో ఉంది. ముఖానికి ముసుగు ధరించిన ఓ గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఇంట్లో చొరబడి యువతి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటల్లో కాలిపోతున్న ఆమె కేకలు వేయడంతో దుండగుడు పారిపోయాడు. వెళ్తూ ఇంటి తలుపులకు గడియపెట్టాడు. బాధితురాలి అరుపులు విన్న చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు తీయగా, అప్పటికే యువతి ముఖం పూర్తిగా కాలిపోయి ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను నారాయణఖేడ్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌స్టాలో 56 లక్షల ఫాలోవర్లు.. వచ్చిన ఓట్లు 155



అజాజ్‌ఖాన్

న్యూఢిల్లీ, నవంబరు 23: బాలీవుడ్ నటుడు, బిగ్ బాస్ మాజీ కంటెస్టెంట్ అజాజ్ ఖాన్ మహారాష్ట్ర ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని చవిచూశారు. వర్సోవా నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయనకు 155 ఓట్లు మాత్రమే పడ్డాయి. అక్కడ 'నోటా'కు 1298 ఓట్లు రాగా ఆయనకు అంతకంటే తక్కువ వచ్చాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో 56 లక్షల ఫాలోవర్లు, పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నా కూడా అజాజ్‌కు ఎవరూ ఓటేయకపోవడం గమనార్హం. కాగా, ప్రజల తరఫున గళమెత్తడమే నా పని అని, దాన్ని కొనసాగిస్తానని ఆయన పోస్టు చేశారు. అజాజ్.. తెలుగులో దూకుడు, బాద్‌షా తదితర చిత్రాల్లో నటించారు.

నోటాను పట్టించుకోని ఓటర్లు

న్యూఢిల్లీ, నవంబరు 23: మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో 'నోటా' ఏమాత్రం ప్రభావం చూపలేదు. మహారాష్ట్రలో నోటాకు కేవలం 0.75% ఓట్లు దక్కగా, ఝార్ఖండ్‌లో 1.32% ఓట్లు మాత్రమే పడ్డాయి. ఇటీవల జరిగిన హరియాణా, జమ్మూకశ్మీర్ ఎన్నికల్లోనూ నోటాను ఓటర్లు పట్టించుకోలేదు. హరియాణా ఎన్నికల్లో 67.9%పోలింగ్ నమోదవ్వగా కేవలం 0.38%మంది నోటాను ఎంచు కున్నారు. కాగా, మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో నోటాకు అత్యధికంగా 2లక్షలకు పైగా ఓట్లు వచ్చాయి. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో వైదొలగడంతో ఆ పార్టీ నోటాకు ఓటేయ్యాలని కోరింది. 2013లో కేంద్ర ఎన్నికల సంఘం నోటాను ప్రవేశపెట్టింది.

GHMC హైదరాబాద్ మహానగర పాలక సంస్థ :: L.B. నగర్ సర్కిల్-4
సంక్షిప్త టెండరు ప్రకటన

NIT No.20/EEC-4/LBNR/GHMC/2024-25 తేది: 23.11.2024

పని పేరు: నిర్వహణ పనులు - 4 నం.లు. అంచనా మొత్తం: రూ.56.00 లక్షలు. బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేదీ/చివరి తేది & సమయం: 24.11.2024 ఉ.11.00 గం.లకు; 02.12.2024 ఉ.11.00 గం.లకు. అధికారి పేరు మరియు చిరునామా: శ్రీ వి.కార్తిక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, L.B. నగర్ సర్కిల్-4, GHMC, సెల్ నం: 9701365519. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in లో చూడవచ్చును. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, L.B. నగర్, సర్కిల్-4, GHMC
DIPR RO.No 7003-PP/CL/ADVT/1/2024-25 తేది. 23.11.2024

అమీన్‌పూర్ పురపాలక సంఘం:: సంగారెడ్డి జిల్లా

టెండరు ప్రకటన నం.Engg-MCA/E1/NIT/21/2024-25 తేది:22.11.2024
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన

పనుల సంఖ్య: 03 నం.లు. అంచనా కాంట్రాక్టు విలువ: రూ.220.00 లక్షలు. డాక్యుమెంట్లు మరియు తేదీలు & సమయం:- బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం: 25.11.2024 ఉ.10.30 గం.లకు బిడ్ల స్వీకరణకు చివరి తేది & సమయం: 03.12.2024 ఉ.10.30 గం.లకు ధర బిడ్ తెరుచుట: 03.12.2024 ఉ.11.00 గం.లకు సంబంధిత అధికారి చిరునామా: కమిషనర్, అమీన్‌పూర్ మునిసిపాలిటీ. తదుపరి వివరాలను www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- మునిసిపల్ కమిషనర్, అమీన్‌పూర్ పురపాలక సంఘం
DIPR RO No.6966-PP/CL/ADVT/1/2024-25, తేది: 23.11.2024

ఈ-సమన్లు.. ఈ-వారెంట్లు!

» నేర న్యాయ ప్రక్రియలో 'ఎన్‌స్టెప్' ఆన్‌లైన్ వ్యవస్థ
» తెలంగాణలో ప్రారంభించిన సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ గవాయ్
» నిందితులు/కోర్టు కానిస్టేబుళ్లకు నేరుగా సమన్లు
» నేర న్యాయ ప్రక్రియ సులభతరం, పారదర్శకమని వ్యాఖ్య



ఎన్‌స్టెప్ ఆన్‌లైన్ వ్యవస్థను ప్రారంభిస్తున్న జస్టిస్ బీఆర్ గవాయ్; చిత్రంలో హైకోర్టు సీజే అరాధే, డీజీపీ జితేందర్

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేర న్యాయ వ్యవస్థలో 'నేషనల్ సర్వీస్ అండ్ ట్రాకింగ్ ఆఫ్ ఎలక్ట్రానిక్ ప్రాసెసెస్ (ఎన్‌స్టెప్)' అమలుతో పారదర్శకత మరింత పెరుగుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. ఎన్‌స్టెప్‌తో నేర న్యాయ వ్యవస్థ మరింత సామర్థ్యం, పారదర్శకతతో పనిచేస్తుందని చెప్పారు. సివిల్ విభాగంలో ఎన్‌స్టెప్ అమలు చేసిన తొలి రాష్ట్రంగా నిలిచిన తెలంగాణ.. ఇప్పుడు క్రిమినల్ కేసుల విభాగంలో ఈ వ్యవస్థను అమలు చేసిన మూడో రాష్ట్రంగా నిలిచిందని తెలిపారు. శనివారం సికింద్రాబాద్‌లోని జ్యుడీషియల్ అకాడమీలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, డీజీపీ జితేందర్‌తో కలిసి జస్టిస్ గవాయ్ 'ఎన్‌స్టెప్'ను ప్రారంభించారు. ఈ ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా నేర న్యాయ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందన్నారు. ఎన్‌స్టెప్ ద్వారా నిందితులకు/కోర్టు కానిస్టేబుళ్లకు నేరుగా సమన్లు, వారెంట్లు అందుతాయని తెలిపారు. 'మనందరి ఉమ్మడి కృషితో తెలంగాణ హైకోర్టు ఆధ్వర్యంలో ఎన్‌స్టెప్‌ను ప్రారంభించుకుంటున్నాం. దీనివల్ల జ్యుడీషియల్ ప్రక్రియలో మరింత సామర్థ్యం, పారదర్శకత పెరుగుతుంది. నేరన్యాయ వ్యవస్థలో విపరీతమైన ఆలస్యం వల్ల నిందితులు అనవసరంగా జైళ్లలో మగ్గాల్సి వస్తుంది. ఇది వారి ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుంది. పీఎంఎల్‌ఏ చట్టం కింద అయినా సరే నిందితులను సుదీర్ఘంగా ఎలాంటి విచారణ లేకుండా జైల్లో ఉంచడం చెల్లదని, ఆర్టికల్ 21 కింద పౌరులకు ఉన్న హక్కులే అత్యున్నతమని ఇటీవలే నేను తీర్పు ఇచ్చా. న్యాయం చేయడంలో ఆలస్యం చేస్తే అన్యాయం చేసినట్లేనని మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ చెప్పారు. స్వేచ్ఛాయుతమైన, పారదర్శకమైన విచారణతోపాటు తగిన సమయానికి న్యాయం చేయ డం కూడా ముఖ్యమే. ఎలక్ట్రానిక్ పద్ధతిలో మొబైల్ యాప్, కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ ద్వారా పని చేసే ఎన్‌స్టెప్ వల్ల రియల్ టైంలో సమన్లు అందజేయవచ్చు. న్యాయవ్యవస్థను టెక్నాలజీతో అనుసంధానం చేయడం, డిజిటల్ సొల్యూషన్స్, డిజిటలైజేషన్ చేయాలన్న సుప్రీంకోర్టు లక్ష్యాల్లో భాగంగా ఈ ఆన్‌లైన్ వ్యవస్థ రూపుదిద్దుకుంది' అని చెప్పారు.

తెలంగాణ హైకోర్టులో అత్యధిక మహిళా జడ్జిలు..

తెలంగాణ హైకోర్టులో అత్యధిక మహిళా జడ్జిల ప్రాతినిధ్యం ఉండడం అభినందనీయమని జస్టిస్ గవాయ్ అన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ చట్టం చేయకముందే తెలంగాణ హైకోర్టు 33 శాతం మహిళా ప్రాతినిధ్యం అనే లక్ష్యాన్ని సాధించిందని పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన జ్యుడీషియల్ అధికారుల్లోనూ అత్యధికంగా మహిళలే కనిపిస్తున్నారన్నారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ.. సివిల్ విభాగంలో ఎన్‌స్టెప్ ప్రారంభించిన తొలి రాష్ట్రంగా.. క్రిమినల్ విభాగంలో మూడో రాష్ట్రంగా నిలవడం గర్వకారణమని తెలిపారు.

ఇందిరమ్మ కమిటీల జీవో సబబే: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేయడంలో భాగంగా గ్రామపంచాయతీ, మునిసిపల్ వార్డు స్థాయిలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 33 చట్టవిరుద్ధం కాదని హైకోర్టు పేర్కొంది. అక్టోబరు 11న ఆర్‌అండ్‌బీ శాఖ జారీ చేసిన ఇందిరమ్మ కమిటీల జీవోను కొట్టేయాలంటూ బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ భీమపాక నగేశ్ ధర్మాసనం కొట్టేసింది. సంక్షేమ పథకాలను అమలు చేయడమనేది ప్రభుత్వ విచక్షణ అని.. ప్రభుత్వం తీసుకునే విధాన నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని పేర్కొంది. అయితే పథకం ఉద్దేశానికి భిన్నంగా అమలు చేస్తున్నట్లయితే పిటిషనర్లు మళ్లీ కోర్టుకు రావచ్చని తెలిపింది.

జాబ్ ఉన్నోళ్లే మళ్లీ రాశారు!

» కఠినంగా నర్సింగ్ పరీక్ష.. 95.69 శాతం హాజరు
» మళ్లీ రాసిన 1500 మంది రెగ్యులర్ నర్సులు
» వారిని పక్కన పెట్టాలి నిరుద్యోగ అభ్యర్థుల డిమాండ్

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ రిక్రూట్‌మెంట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 13 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు 95.69 శాతం మంది హాజరైనట్లు మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది. మొత్తం 2322 స్టాఫ్ నర్సు పోస్టులకు గాను 42244 మంది దరఖాస్తు చేయగా..అందులో 40423 మంది పరీక్షకు హాజరైనట్లు బోర్డు కార్యదర్శి గోపీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష కీ పేపరు సోమ, మంగళవారాల్లో విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. కాగా, రెండు సెషన్లలో జరిగిన ఈ పరీక్ష పేపర్స్ చాలా కఠినంగా వచ్చినట్లు నర్సింగ్ అభ్యర్థులు చెబుతున్నారు. కాగా, ఒకటి రెండు కేంద్రాలో సాంకేతిక సమస్య కారణంగా పది నిమిషాలు ఆలస్యంగా పరీక్ష ప్రారంభమైనట్లు వైద్యవర్గాలు తెలిపాయి.



కాగా, ఈసారి స్టాఫ్‌నర్సు పోస్టులకు గట్టి పోటీ నెలకొంది. ఒక్కో పోస్టుకు సగటున 17 మంది పోటీ పడ్డారు. దీంతో ఈసారి జాబ్ చేస్తున్న స్టాఫ్‌నర్సులు కూడా ఈ పరీక్షకు హాజరైనట్లు నిరుద్యోగ అభ్యర్థులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1500 మంది వరకు రెగ్యులర్ నర్సులు శనివారం జరిగిన పరీక్షకు హాజరైనట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువగా గురుకులాల్లో పనిచేస్తున్న వారు ఉన్నట్లు సమాచారం. అంతేకాక జీవో నం. 317 కింద సొంత జిల్లాలకు కాకుండా, ఇతర జిల్లాలకు బదిలీ అయిన స్టాఫ్‌నర్సులు కూడా కొందరు ఈ పరీక్ష రాసినవారిలో ఉన్నారని అంటున్నారు. అలాగే తమకు నచ్చని చోట పోస్టింగులు పొందిన మరికొందరు నర్సులు కూడా ఈ పరీక్షకు హాజరయ్యారు. అంతేకాకుండా దరఖాస్తుల్లో వెయిటేజ్ అభ్యర్థులుగా నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఇది నిబంధనలకు విరుద్ధమని, ఈ విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ సెలక్షన్ జాబితా విడుదల సమయంలో స్క్రూట్నీ చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇక రెగ్యులర్ నర్సులలో మెజార్టీ అభ్యర్థులు తమ విభాగాధిపతుల నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకోకుండానే పరీక్ష రాసినట్లు తెలుస్తోంది. ఇది కూడా నిబంధనలకు పూర్తి విరుద్ధం. ఎన్‌వోసీ లేనివారు ఒక వేళ ఉద్యోగానికి ఎంపికైతే వారి నియామకాన్ని పక్కనపెట్టాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.



తెలంగాణ శిక్షణ మరియు ఉపాధి ప్రోత్సాహక సంస్థ (TSSTEP)
యువజన సర్వీసుల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

ప్రకటన నం.343/2018 తేది.22.11.2024

TSSTEP ద్వారా చేపట్టే అన్ని ఇంజనీరింగ్ పనులకు సంబంధించిన టెండరు ప్రకటనలు సంస్థ వెబ్‌సైట్ అనగా www.tsstep.in లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయబడతాయని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
ప్రతి పని కొరకు వార్తాపత్రికలలో ప్రత్యేక ప్రకటన ప్రచురించబడదు. ఆసక్తి గల ఏజెన్సీలు పై వెబ్‌సైట్‌ను క్రమంగా పరిశీలించవచ్చును మరియు టెండర్లలో పాల్గొనవచ్చు.
సం/- చైర్మన్, TGSTEP
DIPR RO No.6975-PP/CL/ADVT/1/2024-25, Dt.23.11.2024

శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానము, కొమురవెల్లి (గ్రా) & (మం), సిద్ధిపేట జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Rc.No.SMDK/200/2024, తేది: 23.11.2024

శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానము, కొమురవెల్లి (గ్రా&మం), సిద్దిపేట (జిల్లా)లో 1) మహామండపం కుడివైపున స్టెయిన్‌లెస్ స్టీల్ క్యూ లైన్ మరియు ఇనుప మెట్లు సరఫరా చేయుట మరియు అమర్చుట 2) స్వామివారి విగ్రహం మరియు గర్భగుడితో పాటు ఇతర విగ్రహాలకు పెయింటింగ్ మరియు కలరింగ్ 3) అన్నదానం భవనంగల పాత పోలీసు భవనానికి పెయింటింగ్ మరియు కలరింగ్ 4) బార్బ్‌డ్ వైర్‌తో ఫెన్సింగ్ పోల్స్ సరఫరా చేయుట మరియు అమర్చుట మరియు సబ్‌స్టేషన్ సమీపాన ప్రహరీగోడ నిర్మాణం 5) నం.1 అతిథిగృహానికి పెయింటింగ్ మరియు కలరింగ్ 6) తోటబావి సమీపాన పార్కింగ్ ఏరియాకు ప్రహరీగోడ నిర్మాణం 7) వేములవాడ అతిథిగృహం వద్ద ఏసీల సరఫరా స్థాపన 8) జాతర-2025 కొరకు తాత్కాలిక సౌండ్ సిస్టం ఏర్పాటు చేయడానికి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. అవి ఇ-వెబ్‌సైట్ https://tender.telangana.gov.in లో లభిస్తాయి. తదుపరి వివరాలకు సంప్రదించండి ఫోన్ నం: 9491000652 సం/- ఎ.బాలాజి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ & డిప్యూటీ కమిషనర్ (F.A.C)
DIPR RO.No.6980-PP/CL/ADVT/1/2024-25, Dt: 23.11.2024

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ

No.PR1/9(16)2024-25-PRD **టెండరు ప్రకటన** తేది: 23.11.2024

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలోని ఈ క్రింద పేర్కొన్న వాటికి కాంట్రాక్టర్ల నియామకానికి ఆసక్తిగల బిడ్డర్ల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది.

1) No.SAP/807(13)2024-TH తేది: 23.11.2024.
హైదరాబాద్‌లోని టి జి ఎస్ ఆర్ టి సి హాస్పిటల్ ప్రాంగణంలో కార్డియాక్ కేర్ యూనిట్ మరియు క్యాథ్‌ల్యాబ్‌ను స్థాపించడానికి, అమర్చడానికి, ఇన్‌స్టాల్ చేయడానికి మరియు నిర్వహణకు సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి. (1) టెండర్ ఫారములు తార్నాకలోని పర్సనల్ అధికారి కార్యాలయంలో 25-11-2024 నుండి 09-12-2024 వరకు 09.30 నుండి 16.00 గం.ల వరకు అందుబాటులో ఉంటాయి. (2) టెండర్ ఫారమ్ (పూరించబడి) 10-12-2024న 14.00 గం.ల వరకు తార్నాకలోని టి జి ఎస్ ఆర్ టి సి హాస్పిటల్ 2వ అంతస్తులోని PO ఆఫీస్‌లో ఉంచబడిన టెండర్ బాక్స్‌లో వేయవలెను. (3) వివరాల కోసం మా వెబ్‌సైట్ http://tgsrtc.telangana.gov.in (టెండర్లు) సందర్శించండి. (4) టి జి ఎస్ ఆర్ టి సి టెండర్లలో ఏదైనా లేదా అన్నింటిని ఎటువంటి కారణాలను తెలపకుండా రద్దు చేయడానికి లేదా తిరస్కరించడానికి అన్ని హక్కులను కలిగి ఉంది.
సం/- సూపరింటెండెంట్ & చీఫ్ మెడికల్ ఆఫీసర్

2) No.Dy.S(P)/122(1)2024-25:TA&ZSTC,HPT తేది: 23.11.2024.
టి .జి .ఎస్ .ఆర్ .టి సి. హకీంపేట్ ట్రాన్స్‌పోర్ట్ అకాడమీ ప్రాంగణం, హాస్టల్ భవనం మరియు దాని పరిసరాలు, & జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రాంగణం, హాస్టల్ భవనం మరియు దాని టాయిలెట్ల స్వీపింగ్, క్లీనింగ్ మరియు మెయింటెనెన్స్ కోసం టెండర్లలో పాల్గొనడానికి ఆసక్తిగల పార్టీల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి.08 మంది నైపుణ్యం లేని కార్మికులు మరియు 02 మంది నైపుణ్యం కలిగిన కార్మికులను (ఎలక్ట్రీషియన్ E-1)& (ప్లంబర్E-1) అవుట్ సోర్సింగ్ పద్ధతిపై ట్రాన్స్ పోర్ట్ అకాడమీ& జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ, TGSRTC హకీంపేట్, కాల వ్యవధి రెండు సంవత్సరాలకు వినియోగించుటకు. టెండర్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు www.tgsrtc.telangana.gov.inలో లాగిన్ అవ్వండి.
DIPR RO No.7012-PP/CL/ADVT/1/2024-25, తేది: 23.11.2024 సం/- డైరెక్టర్/TA&ZSTC

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ 60y / రెండవ పెళ్లి / విడో / ఫెయిర్ /GOVT. ఫ్యామిలీ పెన్షనర్ / సొంత ఇల్లు రెంట్స్ /సొంత ప్రాపర్టీ / పిల్లలు లేరు / సెటిల్డ్ ఏలాంటి బాధ్యతలులేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 9030858258 AJH-002961

★ 55y / రెండవ పెళ్లి /విడో /ఫెయిర్/ Govt. Job. / పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ /సొంత ప్రాపర్టీ / ఏలాంటి బాధ్యతలులేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 7995376608 AJH-002961

★ అగ్రవైశ్య /21y & 23y & 25y & 27y & 29y & 31y & 33y & 35y & 37y & 39y & 40y & 42y & 44y & 45y & 46y & 48y & 50y & 52y & 55y & 57y & 59y & 60y & 62y & 63y / ఓ. వధువు గుప్త "మా సేవా" (Since 1998) PH/WA:9291503949 AJH-002961

★ కుల ఆస్తి పట్టింపు లేదు /కమ్మ /డైవర్సీ / 43y/5'6" / డాక్టరు / రేడియాలజిస్ట్ / మంచి ఆస్తి గల వధువుకు 1వ 2వ వరుడు కావలెను. వాట్సాప్ : 9603837618 AJH-002735

★ కమ్మ / కుల ఆస్తి పట్టింపు లేదు /31y/5'5" / ఫెయిర్ / M.Com / ఓన్ కార్ ట్రావెల్స్ బిజినెస్ / మంచి పొలం సొంత హౌస్ ఉన్న వధువుకి 1వ 2వ వరుడు కావలెను. అర్జెంట్ మ్యారే. వాట్సాప్: 8367359402 AJH-002735

★ రాజులు,(సూర్యవంశం, చంద్ర వంశం), బలిజరాజులు : 26 సంగిరాలు,10th to డిగ్రీ, 5.4, సొంత ఇల్లు, ఫాదర్ వ్యవసాయం ఉన్న అమ్మాయికి ఏదైన జాబ్ లేదా బిజినెస్ వరుడు కావలెను. సెల్: 7013228021 AJL_202958

★ కుల పట్టింపు లేదు / చౌదరి /2nd మ్యారేజ్ / 43y/5'5" / ఫెయిర్ / డాక్టర్ (కార్డియాలజీ) మంచి ఆస్తి గల వధువుకు 1వ లేదా 2వ వరుడు కావలెను. వాట్సాప్: 9160437267 AJH-002735

★ కుల పట్టింపు లేదు / విడో / 60 Y / Rtd. HM / ఓన్ బిజినెస్ / రెంట్స్, లాండ్స్, మంచి ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను. సంప్ర. 83413 13561 AJB-658

★ రజక /ఏకైక కుమార్తె /B.Tech / C.Govt. ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీసర్ / మంచి జీతము / 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8897389698 AJH-16488

★ హిందూ మాదిగ / M.Tech / Govt. Asst. Jr. TSSPDCL / మంచి జీతము / 5'4" ఎత్తు / 24 సం.ల అందమైన వధువుకు అందమైన వరుడు కావలెను. ఫోన్ : 7032058965 AJH-16488

★ వయస్సు: 37, OC, 4 సంగిల బాబు కలిగి ఉన్న వధువుకి గవర్నమెంట్ ఉద్యోగం / ఆర్థికంగా స్థిరపడిన వరుడు కావలెను. నోబ్రోకర్స్, డైరెక్ట్ పార్టీ సంప్ర॥ 7287018838 AJG-1860

★ వడ్డెర / ఏకైక కుమార్తె / C.Govt. Group-B గెజిటెడ్‌ఆఫీసర్ / మంచి జీతము / 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు అందమైన వరుడు కావలెను. ఫోన్ :9618579861 AJH-16488

★ పద్మశాలి, దేవాంగ : 1st మ్యారేజ్, 5.4, డిగ్రీ ప్రైవేట్ జాబ్, మంచి జీతం, సొంత ఇల్లు ఉన్న అమ్మాయికి ఆంధ్ర, తెలంగాణా సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. సెల్ : 7013228021 AJL_202958

★ రెడ్డి విడో / కుల, ఆస్తి ప్రసక్తి లేదు / డిగ్రీ / 34y/ సొంత బిజినెస్ / అందమైన వధువుకి వరుడు కావలెను. 1st/2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. ఫోన్ :9515673252 AJH-16487

★ బలిజ (కాపు, శెట్టిబలిజ) : 1st మ్యారేజ్, 26 సంగిరాలు, డిగ్రీ, ఫాదర్ వ్యవసాయం ,బ్రదర్ & సిస్టర్ మ్యారీడ్, సొంత ఇల్లు ఉన్న అమ్మాయికి సంప్రదాయ వరుడు కావలెను. సెల్:7013228021 AJL_202958

★ రెడ్డి విడో / కుల, ఆస్తి ప్రసక్తి లేదు / AGE:36 / B.COM / PVT. JOB / అందమైన వధువుకి వరుడు కావలెను. All Caste Marriages Available. Ph: 7207510801 AJH-16487

★ మున్నూరు కాపు : డిగ్రీ, 5.4, 1st మ్యారేజ్, సొంత ఇల్లు, ఫాదర్ బిజినెస్, స్థిరాస్తి ఉన్న అమ్మాయికి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. సెల్:7013228021 AJL_202958

★ బ్రాహ్మణ/ 30Y / 5'3" / డిగ్రీ / ప్రైవేట్ జాబ్ / అందమైన వధువుకి తగిన జాబ్ / బిజినెస్ / పురోహితం వరుడు కావలెను. Ph: 9701743336 AJH-16487

★ యాదవ్స్ (పూజగొల్ల, ఎర్ర గొల్ల, అల్ల గొల్ల) : 1st మ్యారేజ్, 26 సంగిరాలు, 10th to డిగ్రీ, సొంత ఇల్లు ఉన్న అమ్మాయికి వరుడు కావలెను. సెల్ : 7013228021 AJL_202958

★ కుల పట్టింపు లేదు / రెడ్డి / 26Y / B.TECH/ 5'4"/ స్థిరాస్తికలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. Ph: 9133640971 AJH-16487

★ రెడ్డి / 2ND మ్యారేజ్ (కుల, ఆస్తి) పట్టింపు లేదు. 33YRS, B.COM (PVT JOB - LAND - RENTS) వధువుకి వరుడు కావలెను. అన్ని వయస్సుల వారికి 1ST-2ND సంబంధాలు కలవు. Ph: 9573002847 AJH-16487

★ పద్మశాలి / B.TECH / GOVT. ASST. ఇంజినీర్/ ట్రాన్స్‌కో / మంచి జీతం / 5'5" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 8297439565 AJH-16487

★ కుల పట్టింపు లేదు: 42Y / WIDOW / TELANGANA / WARANGAL / HYDERABAD / GOVT. EMPLOYEE / OWN HOUSE / LANDS / పిల్లలులేని అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8374476725 AJH-002888

★ కుల ఆస్తి ప్రసక్తి లేదు /WIDOW / ANDHRA / 48Y / FEMILY PENSIONER / OWN BUSINESS / ONE GIRL SETTLED / OWN HOUSE / AGRICULTURE LANDS / అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7286976721 AJH-002888

★ కుల పట్టింపు లేదు / 40-60Y/ WIDOW / ANDHRA / పిల్లలు లేరు / GVT JOB / GOOD SALARY / సొంత ఇల్లు / ఆస్తి ప్రసక్తి లేదు / అందమైన వధువులకు వరులు కావలెను. HYD OK. Ph: 9989350417 AJH-002888

★ కుల పట్టింపు లేదు / 55Y/ WIDOW / ANDHRA /VRS/ ఫ్యామిలీ పెన్షనర్ / మంచి జీతం / సొంత అపార్ట్‌మెంట్ / చదువు ప్రసక్తి లేదు / విజయవాడ, గుంటూరు, ఒంగోలు ప్రాధాన్యత . Ph: 7075948409 AJH-002888

★ 30, 5.2, MD Radiology చదివిన అందమైన వధువుకు ANY PG DOCTOR (OR) WELL SETTLED బిజినెస్ చేయుచున్న అందమైన కమ్మ వరుడు మాత్రమే కావలెను. హైదరాబాదు, విజయవాడ ANY PLACE కమ్మ వరుడు కావలెను. (NO BROKERS) DIRECT Cell : 95428 15829 AJB-0269

★ చౌదరి (కమ్మ) : మొదటి సంబంధం, 26 సంగిరాలు, డిగ్రీ, సొంత ఇల్లు, బ్రదర్ సెటిల్డ్, ఫాదర్ ఫార్మర్ ఉన్న అమ్మాయికి మంచి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను.సెల్: 7013228021 AJL_202958

★ రెడ్డి : 1st మ్యారేజ్, 27 సంగిరాలు, డిగ్రీ, ఫాదర్ వ్యవసాయం, సొంత ఇల్లు, స్థిరాస్తి, బ్రదర్ జాబ్, అలాగే రెండవ పెళ్లి, 34 సంగిరాలు, సొంత ఇల్లు ఉన్న వారికి వరుడు కావలెను. సెల్ 7013228021 AJL_202958

★ యాదవ / ఎర్రగొల్ల / అప్పర్ మిడిల్ క్లాస్ / 37y / 5'4" ఎత్తు / M. ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగిన మంచి జీతం, ఆపై ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ నెంబర్ : 9989597799 AJH-14945

★ ఆచారుల (విశ్వబ్రాహ్మిన్స్), గౌడ్స్, నాయి బ్రాహ్మిన్స్,1st మ్యారేజ్, (25_32) 10th to డిగ్రీ సొంత ఇల్లు, ఉన్న అమ్మాయికి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. సెల్ :7013228021 AJL_202958

వధువు కావలెను



★ గౌడ / 30y / 5'9" / టాటా కంపెనీలో మేనేజర్ / Hyd వరునికి BC / OC కులాలకు చెందిన హైదరాబాద్ & సికింద్రాబాద్ ఏరియా వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్ - 9133892932 AJH-002891

★ 37 సం. గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు. నో డౌరి. Ph.: 9866724586 6301943220 AJH-602

★ రెడ్డి / 45y / 5'5" / గవర్నమెంట్ టీచర్ / M.Sc : M.Ed./విదురుడు/2nd మ్యారేజ్ / స్థిరాస్తులు కలిగిన / అందమైన వరుడికి వధువు కావలెను. డైరెక్ట్ నో బ్రోకర్స్. Ph.: 8919295915 AJH-002734

★ కుల ప్రసక్తి లేదు / 50y / 6' / లేట్ మ్యారేజ్ / ఒక ఎకరం పొలం / ఇల్లు కలిగిన వరుడికి 40-45 లోపు ఏ బాదర బంధీలేని వధువు కావలెను. అర్జంట్ నో బ్రోకర్స్ సంప్ర: 7816078811 AJH-002734

★ గౌడ్ / 42y / 5'4" / 2nd వరునికి వధువు కావలెను. కుల పట్టింపు లేదు / పిల్లలు ఉన్నా ఒకే. నో బ్రోకర్స్. డైరెక్ట్ : 9391270328 AJH-002735

★ కమ్మ / 2వ పెళ్ళి / కుల ప్రసక్తి లేదు / MBA / GOVT. ఇండియన్ ఎయిర్‌పోర్ట్ / మంచి జీతం / 5'9" ఎత్తు / 36 సం.ల పిల్లలు లేని వరుడికి వధువు కావలెను. ఫోన్ : 9963757612 AJH-16488

★ ముదిరాజ్ / M.TECH / C. GOVT. SR. సెక్షన్ ఇంజినీర్ / మంచి జీతము / 6' ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. ఫోన్ : 9618579861 AJH-16488

★ గౌడ / C.A/ చార్టర్ అకౌంటెంట్ / Asst. మేనేజర్ / అకౌంట్స్ Dept./ మంచి జీతము / 5'10" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్ : 7032058965 AJH-16488

★ కమ్మ / B.TECH / C.GOVT. జాబ్ / మంచి జీతము / 5'11" ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. ఫోన్ : 8790689274 AJH-16488

★ SC మాల / కట్నం ప్రసక్తి లేదు / B.Tech/ C. Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్ / రైల్వే / మంచి జీతము / 5'10" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 8341650195 AJH-16488

★ 2వ పెళ్ళి / కుల ప్రసక్తి లేదు / MDS / Govt. డాక్టర్ / మంచి జీతం / 5'10" ఎత్తు / 35 సం.ల పిల్లలు లేని వరుడికి వధువు కావలెను. ఫోన్ : 8297439565 AJH-16487

★ బలిజ / 35YRS/ డిగ్రీ, జాబ్ - కంప్యూటర్ ఆపరేటర్ @ మెడికల్ ఏజెన్సీ, కరీంనగర్లో స్వంత గృహం వున్న అబ్బాయికి తగిన వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్: 9440378427 AJH-002889

★ కుల పట్టింపు లేదు / 65Y / 5'5"/ బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయి/ పెన్షనర్ వరునికి 50 సం.లోపు వధువు కావలెను. డైరెక్ట్, నో బ్రోకర్స్. ఫోన్ : 9502552104 AJH-002889

కళ్యాణ వేదిక

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే / అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 9885144375 AJH-002961

★ గంగపుత్రుల (అగ్నికుల క్షత్రియ, బెస్త, గూండ్ల, వాడబలిజ, జాలరి, వడ్డీలు, నెయ్యాల, పల్లెకార్లు, వన్నెరెడ్డి) పెళ్లి సంబంధాలకై సంప్రదించండి. వాట్సాప్ నెంబర్: 9000541008 (A) AJH-002734

★ మాదిగ ప్రత్యేకత (Since-15y) మొదటి & రెండవ పెళ్ళి సంబంధాలకు సంప్ర: స్వప్న వివాహ వేదిక, మెట్రో పిల్లర్ నం.1115, మెట్టుగూడ, సికింద్రాబాద్. ఫోన్ : 9347046175 AJH-002734

★ కేవలం కమ్మ వారికి మాత్రమే. దేశ విదేశ, డాక్టర్, సాఫ్ట్‌వేర్ & హై. రిచ్ 1వ, 2వ లేటు వధువు, వరుల కోసం సంప్ర: గడ్డిపాటి ప్రభాకర రావు. BE, వాట్సాప్ : 7893841849 AJH-16487

★ రజక / డాక్టర్స్ / ఇంజనీర్స్ / Govt. Jobs / Abroads / పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి. కొట్ల శ్రీనివాస్. ఫోన్ : 8106303155 / 9391265304 AJH-002889

★ కాపు వధూవరుల స్వయంవరం /Free Register 15/DEC/2024 న కమలానగర్ వెల్ఫేర్ ఆఫీస్, ECIL, Hyderabad నందు. ఫోన్ : 9704656103, 9533608887 - వాట్సాప్ AJH-002889

★ కమ్మ, కాపు, వెలమ, దేవాంగ కులాల సాఫ్ట్‌వేర్ ఎంప్లాయీస్, డాక్టర్స్ ... Second Marriage సంబంధములు ... 9912711669. AJN 228060

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు. ఫోన్ : 9182731506/9705588313 AJH-002862

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు.
కావున పాఠకులు ఈ విషయాన్ని, గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380,
9703618806,
9985921386

శారద వివాహ వేదిక
Mail: saradamatrimony1@gmail.com, website: www.saradaram.com
EXCLUSIVE CHOWDARY COMMUNITY
Hyderabad. Phone: 9849413031
కమ్మ ప్రత్యేకం

వధువు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 15 Cr B.Tech 40 India / 15 Cr B.Tech MS USA Citizen / 30 Cr B.Tech MS 38 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :(USAరెండో పెళ్ళి): 50 Cr USA Doctor 35 / 15 Cr USA Green Card 40 / B.Tech MS 40 Cr / 15 Cr Doctor Canada / 36 B.Tech MS / 45 B.Tech MS USA / 48 B.Tech MS / 38 B.Tech MS / 32 B.Tech MS వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 40 B.Tech 15 Cr / 43 MSc 50 Cr / 10 Cr B.Tech 24L PA 39 / 15 Cr B.Tech MS 35 / 20 Cr B.Tech MS 33 / 50 Cr B.Tech 30 / 5 Cr B.Tech 29 / 20 Cr B.Tech MBA 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30 Cr B.Tech 28 / 20 Cr B.Tech IIT 29 / 10 Cr B.Tech 35 / 50 Cr Business 32 / 40 Cr B.Tech MS 31 / 20 Cr B.Tech 25 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr B.Tech MS 26 / 70 Cr MBA 27 / 75 Cr. B.Tech MS USA Citizen వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం :(రెండో పెళ్ళి): 31 B.Tech IT MS Business Hyderabad 20 Cr / 37 B.Tech 30 Cr Hyd / 40 B.Tech 15 Cr 38L PA Hyderabad / 50 Cr Business 40 Hyderabad / 15 Cr B.Tech 40 Hyderabad రెండో పెళ్ళి వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 70 Cr MBA 29 Business / 50 Cr B.Tech 30 Business / 100 Cr B.Tech MS 29 Business / 50 Cr B.Tech 27 / 20 Cr B.Tech Business వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 500 Cr. MBBS MD 34 / 100 Cr MBBS MD 25 / 50 Cr MBBS MD Pediatrics / 20 Cr MBBS MD 30 / 15 Cr MBBS MD GS 31 / 20 Cr MBBS MD Pediatrics 29 / 10 Cr MBBS MD GM 35 / 20 Cr MBBS MD Ortho 34 / వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం Australia: 20 Cr B.Tech MS 29 PR / 5 Cr B.Tech MS 28 / 2 Cr B.Tech MS 32 / 3 Cr B.Tech MS 30 వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 1 Cr to 500 Cr 24 to 45 B.Tech / M.Tech / MS / CA / PG Doctors India / USA /ఆస్ట్రేలియా U.K. వరులకు వధువు కావలెను. సంప్ర: శారద 9849413031

వరుడు కావలెను

★ కమ్మ ప్రత్యేకం : 50 Cr B Tech MS 29/30Cr B.Tech MS 27/100Cr B.Tech MS 29/20Cr B.Tech MS 28/40 Cr B.Tech MS 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 15Cr B.Tech 26 / 70Cr Architecture 30 / 50Cr B.Tech MS 25 / 20 Cr B.Tech 25 వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : డాక్టర్స్ India 20Cr MS General 31/15Cr Dermatology 35 / 10Cr Radiology & Gynic & Skin Doctor and ENT Dental డాక్టర్స్ వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండవ పెళ్ళి, 40 B.Tech MS Business in India / 20 Cr. 35 B.Tech Hyderabad / 25 Cr. 35 PG Doctor వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 25 B.Tech MS / 27 B.Tech MS / 29 B.Tech MS / 31 B.Tech MS / 33 B.Tech MS / 35 B.Tech MS వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 10 Cr 25. B.arch, MS. UK. US/10Cr. BBA 28/ 29.BTech / MS / Amazon, 300k USA. అందమైన యూఎస్. UK. India. Well settled వధువులకి వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 100 Cr. 37 / 70 Cr. 35 / 50 Cr. 39 / 20 Cr. 35 & 37 Doctors. రెండవ పెళ్లి వధువులకు సెటిల్డ్ వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : రెండో పెళ్ళి 29 B.Tech MS USA / 42 B.Tech MS / 35 B.Tech MS India / 32 B.Tech MS USA వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : USA డాక్టర్స్ 33 Cardiologist / 29 Neurology / 28 Internal Medicine వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

★ కమ్మ ప్రత్యేకం : 30Cr B.Tech 28 / 20Cr B.Tech MBA 32 / 20Cr B.Tech 25 / 50Cr MBBS PG Doctor Hyderabad వధువులకు తగిన వరులు కావలెను. సంప్ర: శారద 9849413031

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

చంద్రబాబు చేతికి జగన్ జుత్తు!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇప్పుడు మహర్దశ నడుస్తున్నట్టుగా ఉంది. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తనను ముప్పుతిప్పలు పెట్టడమే కాకుండా చివరకు జైలుకు కూడా పంపిన జగన్మోహన్‌రెడ్డి జుత్తు మాత్రమే కాదు– ఏకంగా పీక ఇప్పుడు చంద్రబాబు చేతికి చిక్కింది. మొదటి నుంచీ డబ్బు పిచ్చి ఉన్న జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత రెచ్చిపోయారు. ఈ క్రమంలో ప్రపంచ కుబేరుడు కావాలన్న దురాశను అణువణువునా నింపుకొన్న గౌతమ్ అదానీతో చేతులు కలిపారు. ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలపై 25 ఏళ్లలో దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయల అదనపు భారం పడేలా అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం తెర మీదకు వచ్చింది. రెండు రోజుల క్రితం వరకు గుట్టుగా ఉన్న ఈ అతి భారీ కుంభకోణం అమెరికా చట్టాల పుణ్యమా అని వెలుగులోకి వచ్చింది. దీంతో చంద్రబాబు చేతికి పాశుపతాస్త్రం దొరికినట్టయింది. ఒకవైపు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యతతో పాటు రాజకీయ ప్రత్యర్థి జగన్‌రెడ్డిని రాజకీయంగా దెబ్బతీసే

> **గత ఐదేళ్లలో ఇటు తెలంగాణలో, అటు ఏపీలో అధికారంలో ఉన్న కేసీఆర్, జగన్‌రెడ్డికీ నాకూ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందని ఉభయ రాష్ట్రాల ప్రజలందరికీ తెలిసిందే. అయినా మద్యం, మైనింగ్ వ్యవహారాల్లో నేను ఏదో డీల్ చేశానని చెబుతున్నావు కదా? అదే నిజమైతే మద్యం, మైనింగ్ వ్యవహారాల్లో జగన్‌రెడ్డి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందని అంగీకరిస్తున్నావా ఓ మాయా మశ్చీంద్రా? మీడియా అధిపతిగా నన్ను మంచి చేసుకోవాలని మీరు భావించారనే అనుకుందాం! అప్పుడు కూడా మీరు వెధవ పనులు చేసినట్టు ఒప్పుకున్నట్టే కదా! ఆ వెధవ పనులను కప్పిపుచ్చడానికి నాతో డీల్స్ కుదుర్చుకున్నానని అంగీకరిస్తున్నావా? ఒక ఆడిటర్‌గా అనైతిక చర్యలకు పాల్పడినందుకు నీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని మీ చార్టెడ్ అకౌంటెంట్స్ సంస్థ నోటీసు ఇచ్చింది కదా? విజయసాయీ! దానిపై కూడా స్టే తెచ్చుకొని తప్పించుకుంటున్నావు. తప్పుడు పనులు చేసి ఉండకపోతే స్టే తెచ్చుకోవడం ఎందుకో?**

గొప్ప అవకాశం ఈ కేసు వెలుగులోకి రావడంతో చంద్రబాబుకు లభించింది. తండ్రి అధికారంలో ఉన్నప్పుడు అక్రమ సంపాదనకు అలవాటుపడిన జగన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా 'నాకేంటి?' అన్న ధోరణిలోనే వ్యవహరించారు. ఫలితంగానే ఈ కేసు జగన్ మెడకు చుట్టుకుంది. 'గతంలో నేను అధికారంలో ఉన్నానా? ఎప్పుడైనా నేను సెక్రటేరియట్‌కు వెళ్లానా?' అని ఫీంకరించిన జగన్‌రెడ్డి ఇప్పుడు కూడా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) అనే కేంద్ర ప్రభుత్వ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటే అవినీతికి పాల్పడ్డానని ఎలా చెప్పగలరని బుకాయించే ప్రయత్నం చేస్తున్నారు. సెకీని అడ్డుపెట్టుకొని అదానీ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నందుకు జగన్‌రెడ్డికి 1750 కోట్ల రూపాయలు లంచంగా వచ్చినట్టు అమెరికా దర్యాప్తు సంస్థలు న్యాయస్థానానికి సమర్పించిన చార్జిషీటులో పేర్కొన్నాయి. తనకు ఏ పాపం తెలియదని జగన్‌రెడ్డి బుకాయించే అవకాశం లేకుండా అమెరికా దర్యాప్తు సంస్థలు ఈ వ్యవహారంలో ఆధారాలు సేకరించాయి. అమెరికాలో ఉంటున్న గౌతమ్ అదానీ ప్రతినిధి సాగర్ అదానీ ఫోన్‌ను అమెరికా దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకొని విశ్లేషించినప్పుడు ఈ ముడుపుల బాగోతం బయట పడింది. అమెరికాలోని పెట్టుబడిదారుల నుంచి అదానీ గ్రూపు సేకరించిన వేల కోట్ల నిధుల నుంచి దాదాపు 2200 కోట్లను ముడుపుల కోసం మళ్లించారు. భారతదేశంలో ఏయే రాష్ట్రాలలో ఎవరెవరికి ఎంత మొత్తంలో లంచాలు ఇచ్చారనే వివరాలు కూడా సాగర్ అదానీ ఫోన్‌లో లభించాయి. దీంతో ఈ కేసులో తిరుగులేని ఆధారాలు లభించినట్టయింది. ఇప్పుడు ఈ సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం ఎప్పుడు ఎలా జరిగిందో చూద్దాం!

'పవర్'ఫుల్ డీల్...

భవిష్యత్ అవసరాల కోసం పది వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు జగన్‌రెడ్డి ప్రభుత్వం 2021లో టెండర్లు పిలిచింది. అంతకు కొద్దిగా ముందు కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ 12000 మెగావాట్ల సోలార్ విద్యుత్ సరఫరాకు టెండర్లు పిలవగా... యూనిట్ 2.92 రూపాయల వంతున సరఫరా చేయడానికి అదానీ గ్రీన్ ఎనర్జీ, అజూర్ పవర్ ఎనర్జీ లిమిటెడ్ టెండర్లు దాఖలు చేసి దక్కించుకున్నాయి. తాము ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలు సరఫరా చేసే విద్యుత్‌ను ఆయా రాష్ట్రాలకు సరఫరా చేసి ఏడు శాతం కమీషన్లు తీసుకోవడం వరకే సెకీ పాత్ర పరిమితం. అంటే, ప్రైవేటు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య కేంద్ర సంస్థ అనుసంధానకర్తగా వ్యవహరిస్తుందన్న మాట! అదానీ, అజూర్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్న సెకీద్వారా యూనిట్ 2.92 రూపాయల వంతున విద్యుత్ కొనుగోలు చేయడానికి ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు రాలేదు. ఇదే సమయంలో రాజస్థాన్‌లో ఉత్పత్తి అయిన సోలార్ పవర్‌ను యూనిట్‌కు 1.99 పైసలకే గుజరాత్‌కు విక్రయించారు. దీంతో భవిష్యత్తులో సోలార్ విద్యుత్ ధరలు పడిపోతాయని భావించిన గౌతమ్ అదానీ రంగప్రవేశం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని కలిశారు. ఆ వెంటనే సెకీ సంస్థ రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాసింది. అదానీ, అజూర్ కంపెనీలతో 2.92 రూపాయలకు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ యూనిట్ 2 రూపాయల 49 పైసలకే సరఫరా చేస్తామని సెకీ ఆఫర్ ఇచ్చింది. అంతకు ముందే అప్పటి ముఖ్యమంత్రితో అదానీ సమావేశం జరగడంతో రాష్ట్ర ప్రభుత్వం పది వేల మెగావాట్ల విద్యుత్ కోసం పిలిచిన టెండర్లను రద్దు చేసుకుంది. ఇదంతా రహస్యంగా జరిగిపోయింది. ఇప్పుడు సెకీతో ఒప్పందం కుదుర్చుకుంటే కుంభకోణం జరిగిందని ఎలా చెబుతారు? అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. గతంలో నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్(ఎన్బీసీసీ) అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ ఉండేది. పోటీ లేకుండా పనులు దక్కించుకోవాలనే కంపెనీలు ఎన్బీసీసీని కవచంగా వాడుకునేవి. పనులను ముందుగా ఎన్బీసీసీకి నామినేషన్‌పై కట్టబెట్టేవారు. ఆ తర్వాత ఎన్బీసీసీ నుంచి బ్యాక్ టు బ్యాక్ ఒప్పందం కింద డీల్ కుదుర్చుకున్న కంపెనీలు పనులు పొందేవి. చివరికి ఇదొక ప్రహసనంగా మారడంతో ఎన్బీసీసీ ఉనికిలో లేకుండా పోయింది. ఇప్పుడు సోలార్ విద్యుత్ ప్రమోషన్ పేరిట ఏర్పాటైన సెకీ కూడా ఎన్బీసీసీ బాపతే. ఇదొక కమీషన్ ఏజెంట్ పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు అదానీతో కుదుర్చుకున్న ఒప్పందంలో నిబంధనల ఉల్లంఘన ఎలా జరిగిందో, రాష్ట్ర ప్రజలపై రెండు మూడు లక్షల కోట్ల రూపాయల వరకు అదనపు భారం ఎలా పడబోతున్నదో చూద్దాం!

ధరల షాకు ప్రజలకే!

అదానీతో రహస్య అవగాహన కుదిరిన తర్వాత అప్పటికే పిలిచిన పదివేల మెగావాట్ల టెండర్లను రద్దు చేసుకున్న జగన్‌రెడ్డి ప్రభుత్వం సెకీ ద్వారా అదానీ నుంచి 12000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అదానీ కంపెనీతో యూనిట్‌కు 2.92 రూపాయలు చెల్లించడానికి ఒప్పందం కుదుర్చుకున్న సెకీ రాష్ట్ర ప్రభుత్వానికి యూనిట్ 2.49 రూపాయలకే సరఫరా చేయడానికి ఆఫర్ ఇవ్వడం గమనార్హం. మొత్తానికి యూనిట్‌కు 2.49 రూపాయల వంతున చెల్లించే విధంగా రూపొందించిన ప్రతిపాదనలను జగన్ మంత్రి మండలి ఆమోదించింది. ఆ సమయంలోనే కేంద్రంతోపాటు వివిధ రాష్ట్రాలు కుదుర్చుకున్న సౌర, పవన విద్యుత్ ఒప్పందాల ధర రెండు రూపాయల 30 పైసల నుంచి రెండు రూపాయల 40 పైసల వరకు ఉండింది. అయినా పెద్ద తేడా లేదు కదా అని సరిపెట్టుకుందాం! మంత్రివర్గం ఆమోదించిన ధర ఒకటి కాగా సెకీ ద్వారా అదానీ కంపెనీకి చెల్లించాల్సిన ధర మరో విధంగా పీపీఏ కుదుర్చుకున్నారు. ఇందుకు మంత్రిమండలి ఆమోదం లేదు. మంత్రి మండలి ఆమోదించిన దానికి భిన్నంగా అంతర్ రాష్ట్ర పంపిణీ చార్జీలు, అంతర్ రాష్ట్ర నష్టాల రూపంలో అదనపు చార్జీలు చెల్లించడానికి పీపీఏలు కుదుర్చుకున్నారు. ముందుగా 7000 మెగావాట్లకు అదానీతో పీపీఏ కుదుర్చుకున్నారు. అంతర్ రాష్ట్ర పంపిణీ చార్జీల రూపంలో ఒక యూనిట్‌కు రెండు రూపాయల 21 పైసలు చెల్లించడానికి పీపీఏ కుదుర్చుకున్నారు. దీంతో యూనిట్‌కు ధర 4 రూపాయల 70 పైసలు అయింది. ఈ కారణంగా రాష్ట్ర ప్రజలపై సాలీనా రూ.3750 కోట్ల అదనపు భారం పడుతుంది. 25 ఏళ్లకు గాను ఈ భారం రూ.లక్షా 56 వేల 151 కోట్లకు చేరుతుంది. ఇది కాకుండా అంతర్ రాష్ట్ర పంపిణీ నష్టాలు, జీఎస్టీ పెరుగుదల, సోలార్ ప్యానల్స్ ధర పెంపు రూపంలో ఒక్క యూనిట్‌కు 43 పైసలు అదనంగా చెల్లించడానికి ఒప్పందం చేసుకున్నారు. ఈ కారణంగా సాలీనా మరో 870 కోట్ల రూపాయలు అదనంగా చెల్లించవలసి వస్తుంది. ఫలితంగా అదానీ కంపెనీ నుంచి కొనుగోలు చేసే ధర ఒక్క యూనిట్‌కు 5 రూపాయల 13 పైసలకు చేరుతుంది. ఇంతకంటే ద్రోహం, దారుణం ఉంటుందా? 'అబ్బే... కుంభకోణమే జరగలేదు' అని ఎలా చెప్పగలరు? రాష్ట్రంలోనే సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసే కంపెనీల నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకొని ఉంటే అంతర్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ చార్జీలు, నష్టాల రూపంలో చెల్లించాల్సిన చార్జీల భారం తప్పేది కదా? రాష్ట్ర ప్రభుత్వం ముందుగా పిలిచిన పదివేల మెగావాట్ల విద్యుత్ టెండర్లను ఎందుకు రద్దు చేశారు? ఈ టెండర్లలో పాల్గొన్న సంస్థలు ఒక యూనిట్ 2 రూపాయల 49 పైసలకే సరఫరా చేయడానికి ముందుకు వచ్చాయి. అయినా వాటిని కాదని టెండర్లను రద్దు చేసి మరీ సెకీని ముందు పెట్టి అదానీ కంపెనీ నుంచి కొనుగోలు చేయడానికి జగన్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధపడింది. ఫలితంగా రాష్ట్ర ప్రజలపై 2 లక్షల కోట్ల రూపాయలకు పైగా అదనపు భారం పడబోతోందని స్పష్టం అవుతుంది. తనను అర్ధరాత్రి నిద్రలేపి మరీ సంబంధిత ఫైలుపై సంతకం పెట్టమన్నారని అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి చెప్పడం గమనార్హం.



> **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన ధర ఒకటి కాగా సెకీ ద్వారా అదానీ కంపెనీకి చెల్లించాల్సిన ధర మరో విధంగా పీపీఏ కుదుర్చుకున్నారు. ఇందుకు మంత్రిమండలి ఆమోదం లేదు. అంతర్ రాష్ట్ర పంపిణీ చార్జీల రూపంలో ఒక యూనిట్‌కు రెండు రూపాయల 21 పైసలు చెల్లించడానికి పీపీఏ కుదుర్చుకున్నారు. దీంతో యూనిట్‌కు ధర 4 రూపాయల 70 పైసలు అయింది. ఈ కారణంగా రాష్ట్ర ప్రజలపై సాలీనా రూ.3750 కోట్ల అదనపు భారం పడుతుంది. 25 ఏళ్లకు గాను ఈ భారం రూ.లక్షా 56 వేల 151 కోట్లకు చేరుతుంది. ఇది కాకుండా అంతర్ రాష్ట్ర పంపిణీ నష్టాలు, జీఎస్టీ పెరుగుదల, సోలార్ ప్యానల్స్ ధర పెంపు రూపంలో ఒక్క యూనిట్‌కు 43 పైసలు అదనంగా చెల్లించడానికి ఒప్పందం చేసుకున్నారు. ఈ కారణంగా సాలీనా మరో 870 కోట్ల రూపాయలు అదనంగా చెల్లించవలసి వస్తుంది. ఫలితంగా అదానీ కంపెనీ నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధర ఒక్క యూనిట్‌కు 5 రూపాయల 13 పైసలకు చేరుతుంది. ఇంతకంటే ద్రోహం, దారుణం ఉంటుందా? 'అబ్బే... కుంభకోణమే జరగలేదు' అని ఎలా చెప్పగలరు? తనను అర్ధరాత్రి నిద్రలేపి మరీ సంబంధిత ఫైలుపై సంతకం పెట్టమన్నారని అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి చెప్పడం గమనార్హం.**

ఇదీ జగన్ నైజం...

తప్పు చేసి కూడా ఎదురుదాడికి తెగబడటం జగన్‌రెడ్డి నైజం. ఇప్పుడు ఈ భారీ కుంభకోణం విషయంలో కూడా ఎదురుదాడినే ఎంచుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటే అదానీతో ఏమి సంబంధం ఉందని అమాయకత్వం నటించే ప్రయత్నం చేస్తున్నారు. జగన్‌రెడ్డి తన రోత మీడియా ద్వారా ఈ మేరకు ప్రచారం చేసుకుంటున్నారు. అదానీ, అజూర్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్న సెకీ.. ఇతర రాష్ట్ర ప్రభుత్వాలతో ఎందుకు కుదుర్చుకోలేకపోయింది? జగన్‌రెడ్డి ప్రభుత్వం అప్పటికే పిలిచిన టెండర్లను రద్దు చేసి మరీ సెకీతో ఒప్పందం ఎందుకు కుదుర్చుకుంది? ట్రాన్స్‌మిషన్ నష్టాలు, ట్రాన్స్‌మిషన్ చార్జీలను అదనంగా చెల్లించడానికి మంత్రి మండలి ఆమోద ముద్ర లభించిందా? రాష్ట్ర ప్రభుత్వం పిలిచిన టెండర్లలో పాల్గొన్నవారు యూనిట్ 2 రూపాయల 49 పైసలకు ఇవ్వడానికి ముందుకు రావడంతో... అదానీ కూడా సెకీతో అంతకు ముందు 2.92 రూపాయలకు ఒప్పందం కుదుర్చుకొని కూడా 2.49 రూపాయలకే సరఫరా చేయడానికి సంప్రదింపులు జరపడం నిజం కాదా? పీపీఏ కుదిరిన నాటికి అదానీ కంపెనీ అసలు విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించకపోవడం నిజం కాదా? సెకీతో ఒప్పందం కుదుర్చుకున్న అజూర్ కంపెనీ మధ్యలో ఎందుకు మాయమైంది? మొత్తం 7000 మెగావాట్లకు గాను 2024 సెప్టెంబరు నుంచి 3 వేలు, 2025 సెప్టెంబరు నుంచి మరో 3000, మిగిలిన వెయ్యి యూనిట్లను 2026 సెప్టెంబరు నుంచి సరఫరా చేస్తామని సెకీ పేర్కొనడం నిజం కాదా? ఇంతా చేసి ఈ ఏడాది సెప్టెంబరు నుంచి మూడు వేల మెగావాట్లు సరఫరా చేయాల్సిన అదానీ కంపెనీ ఇంకా ఉత్పత్తి కూడా ప్రారంభించకపోవడం నిజం కాదా? వేరే రాష్ట్రాలలో ఉత్పత్తి చేయబోతున్న విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నాక.. అదే అదానీ కంపెనీకి రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి అనుమతులు ఇవ్వడం ఏమిటి? దేశంలో ఎక్కడా లేని విధంగా 25 ఏళ్ల పాటు రైతులకు చౌకగా యూనిట్ 2.49 రూపాయలకే సరఫరా చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నామని అప్పట్లో గొప్పలు చెప్పుకొని... తెర వెనుక 5 రూపాయలకు పైగా చెల్లించడానికి పీపీఏ ఎలా కుదుర్చుకున్నారు? కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సెకీ ద్వారా అదానీ విద్యుత్ కొనుగోలు చేయడానికి ఇతర రాష్ట్రాలు ఎందుకు నిరాకరించాయి? ఈ అంశాలను లోతుగా పరిశీలిస్తే ఏ స్థాయిలో కుంభకోణం జరిగిందో స్పష్టమవుతుంది. సెకీతో ఒప్పందం కుదుర్చుకున్న అజూర్ కంపెనీకి మొండి చేయి చూపించింది ఎవరు? అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ కూడా అయిన అజూర్ కంపెనీని వేల కోట్ల రూపాయల నిధులు సేకరించడానికి వాడుకున్న అదానీ చివరికి ఆ కంపెనీకి ఏమీ దక్కకుండా చేయడం వల్లనే ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. జగన్ పేరాశ, అదానీ దురాశవల్ల ఈ భారీ కుంభకోణం బద్దలైంది. సాగర్ అదానీ ఫోన్ లభించి ఉండకపోతే అమెరికా ఏజెన్సీలు కూడా ఈ పాపాల పుట్టను ఛేదించి ఉండేవి కావు. ఇండియాలో జగన్‌తో సహా ఎవరికి ఎంత మొత్తం బదలాయించాలో ఫోన్లో వివరంగా నిక్షిప్తం చేశారు. ప్రాథమిక ఆధారాలను సరిపోల్చుకున్న తర్వాతే గ్రాండ్ జ్యూరీ ఈ కేసు దాఖలుకు అనుమతి ఇవ్వడం గమనార్హం.

> **అదానీ కంపెనీ నుంచి 7000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నష్టపోతున్నది. ప్రజలపై రెండు లక్షల కోట్లకు పైగా అదనపు భారం పడుతోంది. ఈ పాపానికి ఒడిగట్టింది జగన్‌రెడ్డి కాదా?**

చంద్రబాబు ఏం చేస్తారు?

ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి అప్రస్తుతం. అదానీ కంపెనీ నుంచి 7000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నష్టపోతున్నది. ప్రజలపై రెండు లక్షల కోట్లకు పైగా అదనపు భారం పడుతోంది. ఈ పాపానికి ఒడిగట్టింది జగన్‌రెడ్డి కాదా? ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముందున్న కర్తవ్యం ఏమిటి? సెకీ ద్వారా అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసుకొని తీరాల్సిన పరిస్థితి ఏర్పడలేదా? ప్రజలపై రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా అదనపు భారం పడే విధంగా కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేసుకోకపోతే చంద్రబాబు ప్రభుత్వం కూడా పాపం చేసినట్టే అవుతుంది. ఈ ఒప్పందం రద్దు చేసుకోవాలని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. అమెరికా న్యాయస్థానం తీర్పు ఎలా ఉండబోతున్నది? దాని పర్యవసానం అదానీ కంపెనీపై ఏ మేరకు ఉంటుందన్నది అప్రస్తుతం. అమెరికా ఏజెన్సీల రంగ ప్రవేశంతో అదానీ గ్రూపు కంపెనీలకు రుణం ఇవ్వడానికి అంతర్జాతీయ బ్యాంకింగ్ సంస్థలు ముఖం చాటేస్తాయి. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొన్న విధంగా సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసి సరఫరా చేసే స్థితి కూడా అదానీకి ఉండకపోవచ్చు. ఈ మొత్తం వ్యవహారంలో ఏం జరిగింది, ఎవరెవరికి ఏ రూపంలో లంచాలు ఇచ్చింది అజూర్ కంపెనీ పూసగుచ్చినట్టు అమెరికా ఏజెన్సీలకు వివరించినందున అదానీ గ్రూపు ఇందులో నుంచి బయటపడలేకపోవచ్చు. ఇక జగన్‌రెడ్డి విషయానికి వస్తే.. ఆయన ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం చేతికి చిక్కారు. గతంలో తనపై సీబీఐ, ఈడీ సంస్థలు అవినీతి కేసులు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేసినా అవి విచారణకు నోచుకోకుండా టక్కు టమార గజకర్ణ గోకర్ణ విద్యలతో అడ్డుకుంటూ వస్తున్న జగన్ అండ్ కో ఇప్పుడు కూడా తప్పించుకోగలరా? తన చేతికి చిక్కిన జగన్‌రెడ్డిని చంద్రబాబు విడిచిపెడతారా? అదానీ కంపెనీ నుంచి జగన్‌రెడ్డికి 1750 కోట్ల రూపాయల ముడుపులు ముట్టాయని రుజువవుతుందో లేదో తెలియదుగానీ మంత్రివర్గం ఆమోదం కూడా లేకుండా ట్రాన్స్‌మిషన్ చార్జీలు, ట్రాన్స్‌మిషన్ నష్టాల రూపంలో రెండు లక్షల కోట్ల రూపాయలు అదనంగా చెల్లించడానికి పీపీఏ కుదుర్చుకున్న పాపానికి జగన్‌రెడ్డి విచారణను ఎదుర్కోక తప్పదు. తనకు అందివచ్చిన ఈ మహదావకాశాన్ని చంద్రబాబు వదులుకోకపోవచ్చు. వదులుకుంటే ఆయన రాజకీయంగా ఘోర తప్పిదం చేసినవారవుతారు. ఇదే చంద్రబాబు చేసి ఉంటే జగన్‌రెడ్డి ఇప్పటికీ ఆయనపై కేసు నమోదు చేయించి జైలుకు పంపి ఉండేవారు. సీబీఐ కేసులలో తప్పించుకు తిరుగుతున్న జగన్‌రెడ్డిని ఈ కేసులో పకడ్బందీగా ఇరికించే అవకాశం చంద్రబాబు ప్రభుత్వానికి అందివచ్చింది. ఇంత పెద్ద కుంభకోణం నుంచి తప్పించుకోవడానికి జగన్‌రెడ్డికి దారులు మూసుకుపోయాయి. ఇప్పటి దాకా ఆయనను కాపాడుతూ వచ్చినవాళ్లు ఈ వ్యవహారంలో ఆయనను ఆదుకోకపోవచ్చు. సీబీఐ, ఈడీ కేసులలో అదానీ సహకారాన్ని కూడా జగన్‌రెడ్డి పొందుతూ వచ్చారు. ఇప్పుడు అదానీనే అమెరికాలో విచారణను ఎదుర్కోబోతున్నందున ఆయన వైపు నుంచి కూడా సహకారం లభించదు. వేయి గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలి వానకు కొట్టుకుపోయినట్టు ఇప్పుడు జగన్‌రెడ్డి చంద్రబాబు ప్రభుత్వానికి చిక్కారు. చంద్రబాబు ఆడబోయే గేమ్ ఎలా ఉండబోతున్నదో వేచి చూద్దాం!

సాయిరెడ్డీ... టైమ్ అండ్ ప్లేస్ చెప్పు!

ఈ విషయం అలా ఉంచితే గత వారం నేను విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నట్టు విజయసాయిరెడ్డి ప్రకటించారు. కాకపోతే ముఖాముఖి కాకుండా 'మేధావులు, విశ్రాంత న్యాయమూర్తులు, మీడియా సంస్థలు, ఇంకా ఎవరెవరి సమక్షంలోనో చర్చ జరగాలి. తగ్గేదేల్యా' అని సినిమా డైలాగులు పలికారు. ఇంకా నయం- ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో చర్చ జరగాలని కోరలేదు. అయినా ఆయన అంతగా ముచ్చటపడుతున్నందున ఎందుకు కాదనాలి? టైం, ప్లేస్ నువ్వే డిసైడ్ చెయ్. పిలవాల్సిన వారందరినీ పిలుచుకో. కొంచెం ముందుగా నాకు తెలియజేస్తే చాలు వచ్చేస్తాను. నిన్ను నలుగురిలో నిలబెట్టి కడిగేయాలని నాకు కూడా ఉత్సాహంగా ఉంది. ఇంతవరకూ నాకు ఈ అవకాశం లభించలేదు. ఇప్పుడు నువ్వే ముచ్చటపడుతున్నావు కనుక నీ నిజ స్వరూపాన్ని ప్రజలందరికీ చూపించే అవకాశం దక్కుతుంది. గత ఐదేళ్లలో ఇటు తెలంగాణలో, అటు ఏపీలో అధికారంలో ఉన్న కేసీఆర్, జగన్‌రెడ్డికీ నాకూ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందని ఉభయ రాష్ట్రాల ప్రజలందరికీ తెలిసిందే. అయినా మద్యం, మైనింగ్ వ్యవహారాల్లో నేను ఏదో డీల్ చేశానని చెబుతున్నావు కదా? అదే నిజమైతే మద్యం, మైనింగ్ వ్యవహారాల్లో జగన్‌రెడ్డి

> **అదానీ, అజూర్ కంపెనీలతో యూనిట్ 2.92 రూపాయలకు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ 2 రూపాయల 49 పైసలకే సరఫరా చేస్తామని సెకీ ఆఫర్ ఇచ్చింది. అంతకుముందే అప్పటి ముఖ్యమంత్రితో అదానీ సమావేశం జరగడంతో రాష్ట్ర ప్రభుత్వం పది వేల మెగావాట్ల విద్యుత్ కోసం పిలిచిన టెండర్లను రద్దు చేసుకుంది. ఇదంతా రహస్యంగా జరిగిపోయింది. ఇప్పుడు సెకీతో ఒప్పందం కుదుర్చుకుంటే కుంభకోణం జరిగిందని ఎలా చెబుతారు? అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. గతంలో నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్బీసీసీ) అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ ఉండేది. పోటీ లేకుండా పనులను దక్కించుకోవాలనే కంపెనీలు ఎన్బీసీసీని కవచంగా వాడుకునేవి. పనులను ముందుగా ఎన్బీసీసీకి నామినేషన్‌పై కట్టబెట్టేవారు. ఆ తర్వాత ఎన్బీసీసీ నుంచి బ్యాక్ టు బ్యాక్ ఒప్పందం కింద డీల్ కుదుర్చుకున్న కంపెనీలు పనులు పొందేవి. చివరికి ఇదొక ప్రహసనంగా మారడంతో ఎన్బీసీసీ ఉనికిలో లేకుండా పోయింది. ఇప్పుడు సోలార్ విద్యుత్ ప్రమోషన్ పేరిట ఏర్పాటైన సెకీ కూడా ఎన్బీసీసీ బాపతే.**

ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందని అంగీకరిస్తున్నావా ఓ మాయామశ్చీంద్రా? మీడియా అధిపతిగా నన్ను మంచి చేసుకోవాలని మీరు భావించారనే అనుకుందాం! అప్పుడు కూడా మీరు వెధవ పనులు చేసినట్టు ఒప్పుకున్నట్టే కదా! ఆ వెధవ పనులను కప్పిపుచ్చడానికి నాతో డీల్స్ కుదుర్చుకున్నానని అంగీకరిస్తున్నావా? ఒక ఆడిటర్‌గా అనైతిక చర్యలకు పాల్పడినందుకు నీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని మీ చార్టెడ్ అకౌంటెంట్స్ సంస్థ నోటీసు ఇచ్చింది కదా? దానిపై కూడా స్టే తెచ్చుకొని తప్పించుకుంటున్నావు. తప్పుడు పనులు చేసి ఉండకపోతే స్టే తెచ్చుకోవడం ఎందుకో? దొంగ లెక్కలకు మారుపేరైన నువ్వు కూడా సవాళ్లు విసరడం గొప్పగా ఉంది. ఎంతైనా నీ బరితెగింపును అభినందించాలోయ్ విజయ సాయీ! ఎందుకైనా మంచిది జగన్‌రెడ్డి అనుమతి తీసుకొని చర్చకు సిద్ధపడు. జగన్ ముందు కూర్చోడానికి కూడా ధైర్యం లేని నీకు తేడా వస్తే వీపు పగిలిపోయే ప్రమాదం ఉంది. టేక్ కేర్!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

భారత రాజ్యాంగ మాతృమూర్తులు

> **విభిన్న సామాజిక నేపథ్యాలు, వివిధ వృత్తుల నుంచి జాతీయోద్యమంలోకి ప్రవేశించి మన సమున్నత రాజ్యాంగ స్రష్టలుగా చరిత్రలో నిలిచిపోయిన 15 మంది అసాధారణ మహిళలు : అన్నే మాస్కారిని, దాక్షాయణి వేలాయుధన్, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మి పండిట్, సరోజినీ నాయుడు, కమల చౌదరీ, రాజకుమారి అమృత్‌కౌర్, అమ్ము స్వామినాథన్, లీల రాయ్, రేణుక రే, బేగం ఐజాజ్ రసూల్, హంసా జీవరాజ్ మెహతా, మాలతి చౌదరీ, పూర్ణిమా బెనర్జీ, సుచేతా కృపాలానీ.**



భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ ఆమోదించింది. ఈ దృష్ట్యా ఈ ఏడాది మన రాజ్యాంగ అమృతోత్సవ సంవత్సరం. ఆ అద్భుత మౌలిక శాసన రూపకల్పనలో పాల్గొన్న 15 మంది మహిళామూర్తుల గురించి ఈ అమృతోత్సవ సంవత్సరంలో ప్రత్యేకంగా గుర్తుచేసుకోవడమనేది మన నైతిక కర్తవ్యం. ఈ అసాధారణ మహిళలు తమ వ్యక్తిగత జీవితాల్లో ఎదురైన ఎన్నో ప్రతికూలతలు అధిగమించి ప్రజా జీవితంలో జీవించినవారు. రాజ్యాంగ పరిషత్తులో వారు చర్చకు పెట్టిన విషయాలు దూరదృష్టితో కూడినట్టివి. వివిధ అంశాలపై వారి వాదనా పటిమ అసమానమైనది. మన సమున్నత రాజ్యాంగ స్రష్టలుగా చరిత్రలో నిలిచిపోయిన ఆ మహిళామణులు: అన్నే మాస్కారిని, దాక్షాయణి వేలాయుధన్, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మి పండిట్, సరోజినీ నాయుడు, కమల చౌదరీ, రాజకుమారి అమృత్‌కౌర్, అమ్ము స్వామినాథన్, లీల రాయ్, రేణుక రే, బేగం ఐజాజ్ రసూల్, హంసా జీవరాజ్ మెహతా, మాలతి చౌదరీ, పూర్ణిమా బెనర్జీ, సుచేతా కృపాలానీ. ఈ మహిళలు విభిన్న సామాజిక నేపథ్యాల నుంచి, వివిధ వృత్తులు, లేదా వ్యాపకాల నుంచి జాతీయోద్యమంలోకి వచ్చినవారు. వారిలో కొందరు బారిష్టర్లు, సంఘసంస్కర్తలు. వీరిలో ప్రతి ఒక్కరికీ సొంత సైద్ధాంతిక దృక్పథాలు ఉన్నాయి. అయినప్పటికీ రాజ్యాంగ సభ చర్చల్లో వారు చూపించిన శ్రద్ధాశక్తులు ప్రశస్తమైనవి. రాజకీయ, ఆర్థిక, సామాజిక విషయాలతో పాటు, మహిళా సమానత్వం, బాలికావిద్య, అణగారిన వర్గాల అభ్యున్నతి మొదలైనవాటిపై ఆ మహిళా రాజ్యాంగ నిర్మాతలు మౌలిక ప్రతిపాదనలు చేశారు.

ఉమెన్స్ ఇండియా అసోసియేషన్‌ను స్థాపించిన అమ్ము స్వామినాథన్ రాజ్యాంగం ఇచ్చిన సమానత్వాన్ని ఆమోదించగా, హంసా మెహతా సమానత్వాన్ని ఆమోదిస్తూనే, మహిళలకు రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలో సమాన అవకాశాలు ఉండాలని డిమాండ్ చేసారు. హంసా మెహతా, రాజకుమారి అమృత్ కౌర్ మహిళా హక్కులు, విధులు అనే చార్టర్‌ను తయారుచేయటంతో పాటు యూనిఫామ్ సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరస్మృతి) ఆమోదించాలని కోరారు. ఇది జరిగినప్పుడే సమాజంలోని అన్ని వర్గాల మహిళలకు సమాన హక్కులు లభిస్తాయని స్పష్టం చేశారు. ఈ పదిహేనుమంది మహిళల్లో అతి పిన్న వయస్కురాలు, దళిత మహిళ అయిన దాక్షాయణి వేలాయుధన్ దళితుల హక్కుల గురించి మాట్లాడుతూ హరిజన్, క్రిస్టియన్, ముస్లిం లేదా సిక్కు... ఏ విధమయిన కుల, మతవాదమైనా జాతి అనే భావనకు విరుద్ధమని వక్కాణించారు. దళితులు బానిసలుగా ముఖ్యంగా ఆర్థిక బానిసలుగా ఉన్నంతకాలం, వారికి ప్రత్యేక రిజర్వేషన్ అన్నదానికి అర్థం ఉండదు. 'ప్రత్యేక నియోజకవర్గాలు' అన్న డిమాండ్ దళితుల పట్ల సరైన అవగాహన లేకపోవటంవల్ల, వాళ్ళని సమాజం హీనంగా చూస్తుండడం వల్ల వస్తుందని' అంటూ రిజర్వేషన్లను ఆమె వ్యతిరేకించారు. ఆమె ఈ వాదనకు చాలామంది సభ్యులు హర్షం వ్యక్తం చేసారు. బేగం ఐజాజ్ రసూల్ అయితే రిజర్వేషన్ అన్నది ఆత్మఘాతుక ఆయుధం అని అన్నారు. రిజర్వేషన్ అన్నది దళితులకు దళితేతరులకు మధ్య అగాధం సృష్టిస్తుందని అన్నారు. చాలామంది మహిళా సభ్యులతో పాటు, డా. అంబేడ్కర్, మినూ మసాని, నెహ్రూ, ఇంకా చాలామంది కుల, జాతి, మత గుర్తింపులు కాకుండా ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలని కోరుకున్నారు. అలాంటి ఒక గుర్తింపు మాత్రమే మతం కబంధ హస్తాల నుంచి దళితులని, మహిళలని రక్షిస్తుందని దాక్షాయణి అన్నారు (అయితే నేటికీ కూడా దళితుల హక్కులు కాలరాయబడుతున్నాయి. స్వాతంత్ర్య శతాబ్దికి చేరువవుతున్న ప్రస్తుత కాలంలో కూడా దళితులు, మహిళలపై అత్యాచారాలు, నానా దాష్టీకాలు జరుగుతూనే ఉన్నాయి).


దేశ పౌరుల ప్రాథమిక హక్కుల రక్షణకు, ఆదేశిక సూత్రాలు సక్రమంగా అమలయ్యేలా బాధ్యత వహించేందుకు ఒక స్వతంత్ర అధికార యంత్రాంగం ఉండాలని బేగం ఐజాజ్ రసూల్ సూచించారు. పౌర స్వేచ్ఛ పరిపూర్ణంగా ఉండాలంటే, ప్రాథమిక హక్కులకు తక్కువ మినహాయింపులు ఉండాలని ఆమె కోరారు. బేగం ఐజాజ్ రసూల్ వాదనను అమ్ము స్వామినాథన్ బలపరుస్తూ ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు మన రాజ్యాంగ సౌధానికి రెండు బలమైన స్తంభాలు అని అభివర్ణించారు. దాక్షాయణి వేలాయుధన్ సమాజంలో బలవంతపు శ్రమని (forced labor) రద్దు చేయాలని డిమాండ్ చేసారు. దుర్గాబాయి దేశముఖ్ కానిస్టిట్యూషనల్ రెమెడీని పౌరులకి గల ఒక ముఖ్యమైన హక్కు అని అభివర్ణించారు. హిందీని రాష్ట్ర భాషగా అంగీకరిస్తూనే, ఆ భాషను హిందీయేతరులపై బలవంతంగా రుద్దకూడదని ఆమె స్పష్టం చేశారు. మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం ఈ మహిళా సభ్యులు అందరూ బలంగా వాదించారని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

పూర్ణిమా బెనర్జీ, రేణుకా రే ఉన్నత విద్యార్హతలు పొందే విషయంలో మహిళలకు సమాన అవకాశాలు ఉండాలని, విద్యాసంస్థలలో మతపరమైన బోధనలు ఉండరాదని, అప్పటికే ఉన్న విద్యాసంస్థలలో మతపరమైన బోధనలను రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిషత్తు ముసాయిదాలోని ప్రివెంటివ్ డిటెన్షన్ నిబంధనపై పూర్ణిమా బెనర్జీ మాట్లాడుతూ డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్ట్‌పై ఒక వ్యక్తిని ఖైదులో ఉంచడానికి సమయ పరిమితి ఉండాలని వాదించారు. అంతే కాదు ఖైదు చేయబడ్డ వ్యక్తి ఆ కుటుంబ సంపాదనపరుడైతే అతనికి మెయింటెనెన్స్ అలవెన్సు ఇవ్వాలని ప్రతిపాదించారు. రాజ్యాంగ పీఠికపై చర్చ సమయంలో 'సార్వభౌమ' పదం అనేది ప్రజల సార్వభౌమత్వంగా ఉండాలని సూచించారు. రాజ్యసభ సభ్యుల అర్హతలకు సంబంధించిన చర్చలో సభ్యుల వయోపరిమితి 35 సంవత్సరాలకు బదులు 30 సంవత్సరాలు ఉండాలని పూర్ణిమా బెనర్జీ అన్నారు.

పదిహేను మంది మహిళా సభ్యులూ వేర్వేరు చర్చల్లో రాజ్యాంగంలో కొన్ని మార్పులను సూచిస్తూ వివిధ అభ్యంతరాలు కూడా లేవనెత్తారు. పీఠికలో 'సార్వభౌమ' అనే పదం 'ప్రజల సార్వభౌమత్వం'గా ఉండాలని పూర్ణిమా బెనర్జీ సూచించారు. అసంఖ్యాక ప్రజలను ప్రభావితం చేసే సినిమాలు ఉన్నత ప్రమాణాలతో ఉండేలా చట్టం చేయాలని సూచించడంతోపాటు బాల బాలికల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో ఉండాలని దుర్గాబాయి దేశ్‌ముఖ్ కోరారు. రూపొందుతున్న రాజ్యాంగంలోని లోపాలను కూడా పలువురు మహిళా సభ్యులు ఎత్తి చూపారు. అమ్ము స్వామినాథన్, రేణుకా రేలు ఇంత సుదీర్ఘ రాజ్యాంగం అవసరం లేదని అభిప్రాయపడ్డారు. అమ్ము స్వామినాథన్ అయితే రాజ్యాంగం చిన్న పుస్తకం సైజులో ఉండాలని, సామాన్య ప్రజానీకానికి కూడా అర్థమయ్యేలా ఉండాలని సూచించారు. మాలతి చౌదరి భారత రాజ్యాంగం, ఎక్కువగా ఇతర రాజ్యాంగాలపై ఆధారపడడం మంచిదికాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అంతిమంగా ఈ మహిళా సభ్యులు అందరూ రాజ్యాంగ సభ ఆమోదించిన రాజ్యాంగం పట్ల సంతృప్తిని వ్యక్తపరిచారు. మన రాజ్యాంగం వివిధ దృక్పథాలను ప్రతిబింబిస్తుందని మెచ్చుకున్నారు. 'Unity is meaningless without the accompaniment of women. Education is fruitless without educated women and agitation is incomplete without the strength of women.' అని డాక్టర్ అంబేడ్కర్ అన్న మాటలను గుర్తు చేసుకుంటూ రాజ్యాంగ అమృతోత్సవం సందర్భంగా మన సంవిధాన మాతృమూర్తులకు నమోవాకాలు, ఘన నివాళులు అర్పిద్దాం.

■ పి. అరవిందకుమారి

(నవంబర్ 26: రాజ్యాంగ దినోత్సవం, భారత రాజ్యాంగ అమృతోత్సవం)




శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 కనిష్ఠం 15.4

బీసీల అభ్యున్నతిపై సమగ్ర నివేదిక
- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

సాహిత్య స్పృహను రగిలించిన తెలంగాణ ఉద్యమం

8

మహానగర ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో కీలకమైన జీహెచ్ఎంసీ.. కాసుల కోసం తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నది. అభివృద్ధి పనులను పక్కన పెడితే.. కనీసం ఉద్యోగులకు వేతనాలు.. చేసిన అప్పులకు వడ్డీ, వాయిదాలు చెల్లించేందుకే సతమతమవుతున్నది. గతంతో పోలిస్తే ఆదాయం తగ్గడం.. సర్కారు నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



జీహెచ్ఎంసీ లెక్క (రూ.కోట్లలో)

1.	బడ్జెట్‌లో కేటాయించిన నిధులు	3,065
2.	మంజూరైన నిధులు	400
3.	కాంట్రాక్టర్ల బిల్లుల బకాయిలు	1,200
4.	సీడీఎఫ్ ఎస్‌డీఎఫ్ పనుల బిల్లులు	100
5.	ఎస్ఆర్‌డీపీ పెండింగ్ బిల్లులు	150
6.	ఇతరత్రా బిల్లులు	200
7.	ప్రతి నెలా కావల్సిన మొత్తం	300
8.	వస్తోన్న ఆదాయం	150 (లోపే)

- బడ్జెట్‌లో కేటాయింపు రూ.3,065 కోట్లు
- విడుదల చేసింది రూ.400 కోట్లు మాత్రమే
- వేతనాలు, వాయిదాల చెల్లింపునకూ తిప్పలే
- పెండింగ్‌లో రూ.వేల కోట్ల బిల్లులు
- ఎక్కడికక్కడ నిలిచిన పనులు

కాసుల కష్టాలు

బల్దియాకు సర్కారు సాయం అరకొరే..

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధుల కోసం బల్దియాకు ఎదురు చూపులు తప్పడం లేదు. బడ్జెట్‌లో భారీగా నిధుల కేటాయింపులు జరిగినా ఆ మేరకు విడుదల చేయడంలో శ్రద్ధ చూపకపోవడంతో అభివృద్ధి పనులకు బ్రేక్ పడుతున్నది. 2024-25 బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి రూ.3,065 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. రెండు త్రైమాసికాలు ముగియగా.. ఇప్పటి వరకు కేవలం రూ.400 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. సెప్టెంబరు, అక్టోబరులో రెండు విడతల్లో నిధులు రాగా.. పెండింగ్‌లో ఉన్న కొన్ని బిల్లులు, వేతనాలు, వాయిదాల చెల్లింపునకు వినియోగించినట్టు సంస్థ వర్గాలు చెబుతున్నాయి. కేటాయించిన రూ.3,065 కోట్లలో త్రైమాసికానికి రూ.766 కోట్ల చొప్పున కేటాయించాలి. ఈ లెక్కన ఇప్పటి వరకు రూ.1532 కోట్లు రావాలి. కానీ, పలు కారణాలతో ప్రభుత్వం రూ.400కోట్లు మాత్రమే విడుదల చేసింది. మరో రూ.1,132 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో పట్టణ ప్రగతిలో భాగంగా ప్రతినెలా రూ.70 కోట్ల నుంచి రూ.80 కోట్లు జీహెచ్ఎంసీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిధులు వచ్చేవి. కొన్ని నెలలుగా ఆ నిధులూ రావడం లేదని బల్దియా వర్గాలు చెబుతున్నాయి.

నెలకు రూ.300 కోట్లు..

జీహెచ్ఎంసీకి ప్రతినెలా సుమారు రూ.300 కోట్లు అవసరం. వేతనాలు, పెన్షన్ల చెల్లింపునకు రూ.120 కోట్లు.. రుణాల వడ్డీ, వాయిదాలకు రూ.100 కోట్లు.. రోడ్ల నిర్మాణం, మరమ్మతు, పారిశుధ్య నిర్వహణ, ఇతరత్రా పనులకు మరో రూ.70కోట్ల నుంచి 80కోట్లు కావాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రతినెలా సంస్థకు వస్తోన్న ఆదాయం రూ.150 కోట్లు దాటడం లేదు. దీంతో వేతనాల చెల్లింపునకూ సర్కారు వైపు చూడాల్సి వస్తోంది. ఈ క్రమంలోనే హెచ్ఎండీఏ, ఇతర విభాగాల నుంచి నిధులు

మిగతా 8వ పేజీలో..

మరిన్ని రుణాలు?

ఇప్పటికే రూ.6వేల కోట్లు అప్పు చేసిన జీహెచ్ఎంసీ.. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మరో దఫా రుణాలు తీసుకునే విషయాన్ని పరిశీలిస్తోంది. క్రెడిట్ రేటింగ్ ప్రకారం అర్హత మేర రుణాలు తీసుకున్నారు. కొన్ని బ్యాంకులు అప్పు ఇచ్చేందుకు ముందుకు వస్తుండడంతో సంస్థ ఆర్థిక వనరులు.. రీ పేమెంట్ స్తోమత తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. ఒకవేళ రుణం తీసుకోవాలనుకుంటే.. ఆదాయ మార్గాలు, ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని బ్యాంకులకు నివేదిస్తామని ఓ అధికారి తెలిపారు. సర్కారు ఆమోదంతోనే మరిన్ని రుణాలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.



బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

'మహా' ఫలితాలతో కమలంలో జోష్

- గ్రేటర్‌లో బీజేపీ శ్రేణుల సంబరాలు
- జీహెచ్ఎంసీ మేయర్ పీఠంపై కమలనాథుల ఆశాభావం

హైదరాబాద్ సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో ఎన్డీయే కూటమి విజయదుందుభి మోగించడంతో గ్రేటర్ బీజేపీలో జోష్ పెరిగింది. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పనిచేస్తున్న బీజేపీకి ఈ ఎన్నికల ఫలితాలు బలాన్నిచ్చాయి. మహారాష్ట్ర ఫలితాలతో బీజేపీ శ్రేణులు గ్రేటర్‌లో సంబరాలు చేసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో హైదరాబాద్‌లో బీజేపీ గెలుపునకు ఈ ఫలితాలు బాటలు వేస్తాయని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు స్పష్టం చేశారు. గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికల్లో తాము అత్యధిక స్థానాలు గెలిచి, మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'మహా' విజయంపై పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, పార్టీ సంస్థాగత ఎన్నికల కో రిటర్నింగ్ అధికారి గీతామూర్తి హర్షం వ్యక్తం చేశారు. సీతాఫల్‌మండి చౌరస్తాలో బాణాసంచాను కాల్చి స్థానికులకు మిఠాయిలను పంపిణీ చేశారు. యాప్రాల్‌లో బీజేపీ మహారాష్ట్ర ఎన్నికల విజయోత్సవాన్ని నిర్వహించారు.

స్పీడ్ పెంచనున్న బీజేపీ

మహారాష్ట్రలో ఎన్డీఏ గెలుపుతో భాగ్యనగరంపై కమలం గురిపెట్టింది. హైదరాబాద్‌లో బీజేపీ మరింత దూకుడు పెంచడానికి

మిగతా 8వ పేజీలో..



- డ్రంకెన్ డ్రైవ్‌పై సిటీ పోలీసుల స్పెషల్ డ్రైవ్
- 11 నెలల్లో.. 52,080 మంది మందుబాబులపై కేసులు
- 824 మందికి జైలు.. 89 డ్రైవింగ్ లైసెన్సులు రద్దు

₹ 2.87 కోట్ల జరిమానా వసూలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్న మందుబాబులకు సిటీ పోలీసులు మత్తును వదిలిస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక కార్యాచరణను చేపట్టి గత 11 నెలల్లో 52 వేల మందికి పైగా మందుబాబులపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.2.87 కోట్ల జరిమానాను వసూలు చేశారు. నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా మద్యం మత్తు, నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగమే కారణమని పోలీసుల గణాంకాలు చెప్తున్నాయి. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ మందుబాబులు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో తాగిన మత్తులో వాహనాలు నడుపుతున్న వారిని కట్టడి చేయడానికి హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ ఏడాది ఆగస్టు 24 నుంచి నవంబరు 20 వరకు కేవలం 3 నెలల్లోనే 13,933 కేసులు నమోదు చేశారు. మొత్తంగా ఈ ఏడాది నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 11 నెలల్లో 52,080 మంది మందుబాబులపై కేసులు

మిగతా 8వ పేజీలో..



లోక్‌మంథన్‌లో కళాకారుల నృత్య ప్రదర్శన

లోక్‌మంథన్.. ఉత్సాహం ఉప్పొంగెన్

- ఆకట్టుకున్న ప్రదర్శనలు, జానపద నృత్యాలు
- తమ సంస్కృతి చాటిచెప్పేలా కళారూపాలు

8

ఈవీలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఈ ఆటో రిక్షాలను ప్రమోట్‌చేస్తాం



ఈ-రాజా ఆటోలను ఆవిష్కరించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ఆర్.బాలకృష్ణన్ తదితరులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వాహనాలను (ఈవీ) రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాప్ ఎకో మోటార్స్ తన తొలి ఎల్ 5 సెగ్మెంట్ ఎలక్ట్రిక్ త్రీ వీలర్ 'ఈ రాజా' ఆటోలను ఖైరతాబాద్ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎలక్ట్రిక్ ఆటో రిక్షాల తయారీ పరిశ్రమలను ప్రోత్సహిస్తామన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం మరింత పెరగాల్సిన అవసరముందన్నారు. సెంటర్ ఫర్ ఎనర్జీ స్టడీస్ డైరెక్టర్ ప్రొ.రాజ్ కిరణ్ బిలోలికర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వాహనాల తయారీ, విడి భాగాల రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు మద్దతుగా నిలుస్తుందన్నారు. ఈ చర్యలు ఉద్యోగ అవకాశాలను పెంచుతాయని అన్నారు. రాక్ ఎకో మోటార్స్ సీఈఓ ఆర్.బాలకృష్ణన్ మాట్లాడుతూ అత్యాధునిక ఎలక్ట్రిక్ ఆటో- ఈ రాజా బ్యాటరీని మూడు గంటల్లో పూర్తిగా చార్జ్ చేయవచ్చన్నారు.

లంబసింగి టు హైదరాబాద్ 114 కిలోల గంజాయి పట్టివేత

- విలువ రూ.50 లక్షలు
- అనకాపల్లి ముఠా అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలోకి మార్చి కాలేజీ బ్యాగులు, లగేజీ సంచుల ద్వారా నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తున్న ఏడుగురు వ్యక్తుల అనకాపల్లి ముఠాను కాచిగూడ పోలీసులతో కలిసి హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్ న్యూ) పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 114 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.50 లక్షలుంటుందని తెలిపారు. హెచ్ న్యూ, టాస్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనకాపల్లికి చెందిన బాలాజీ గోవింద్ ఇంటర్మీడియట్ వరకు చదివి ఆ తర్వాత మానేశాడు. అతనికి ఆంధ్రా ఒడిశా బార్డర్‌కు చెందిన గంజాయి రైతులతో పరిచయం అయింది. అడ్డదారిలో రూ.లక్షల్లో సంపాదించాలని పథకం వేశాడు. ఒడిశా అటవీ ప్రాంతంలో గంజాయి సాగుచేస్తున్న రైతులనుంచి తక్కువ ధరకు కొని హోల్‌సేల్‌గా ఇతర వ్యాపారులకు రూ.5వేలకు విక్రయించేవాడు. దీంతో అతని

మిగతా 8వ పేజీలో..

గ్రేటర్‌లో 72.02% సర్వే పూర్తి

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే గ్రేటర్‌లో ఇప్పటి వరకు 72.02శాతం పూర్తయినట్టు అధికారులు తెలిపారు. శనివారం 1,09,493 కుటుంబాలను సర్వే చేశామని, మొత్తం ఇప్పటివరకు 17,47,056 కుటుంబాల గణన పూర్తయినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తన నివాసంలో ఎన్యూమరేటర్లకు కుటుంబ వివరాలను అందజేశారు.



సర్వే వివరాలను అందజేస్తున్న ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి

యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

- గ్రేటర్‌లో నిర్మాణంలో 12 భూగర్భ సంపులు
- 'ప్రజాపాలన' విజయోత్సవాలకు నగరాన్ని సిద్ధం చేయండి
- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్



లేక్ వ్యూ గెస్ట్‌హౌస్ వద్ద భూగర్భ సంపు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న దానకిశోర్, అధికారులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న భూగర్భ సంపులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. రాజ్‌భవన్ రోడ్డులోని లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ప్రవేశమార్గంలో భూగర్భ సంపు (రెయిన్‌వాటర్ హోల్డింగ్‌స్ట్రక్చర్)నిర్మాణ పనుల పురోగతిని హెచ్ఎండీఏ, వాటర్ బోర్డు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో శనివారం పరిశీలించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం ఎదురుగా నిర్మిస్తున్న భూగర్భ సంపు నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రేటర్ పరిధిలో 10లక్షల నుంచి 40 లక్షల లీటర్ల సామర్థ్యంతో ప్రయోగాత్మకంగా 12 చోట్ల భూగర్భ సంపుల నిర్మాణ పనులను చేపట్టామని, వాటిలో 4 పూర్తయ్యాయని, మిగతావి పలు దశల్లో ఉన్నాయని ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు దానకిశోర్‌కు వివరించారు.

ట్యాంక్‌బండ్ పరిసరాలను అందంగా ముస్తాబు చేయాలి

'ప్రజాపాలన- ప్రజా విజయోత్సవం' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 7, 8, 9 తేదీల్లో నిర్వహించే వేడుకలకు ట్యాంక్‌బండ్, సెక్రటేరియట్, నెక్లెస్ రోడ్ పరిసరాలను అనుసంధానం చేసే ప్రధాన మార్గాలను సుందరంగా తీర్చిదిద్దాలని దానకిశోర్ ఆదేశించారు. శనివారం హెచ్ఎండీఏ, వాటర్ బోర్డు, జీహెచ్ఎంసీ అధికారులతో నెక్లెస్‌రోడ్, ట్యాంక్‌బండ్, అసెంబ్లీ, సచివాలయం, సంజీవయ్యపార్క్, రోడ్డు మార్గాలను ఆయన పరిశీలించారు. నగరంలో ప్రజాపాలన- ప్రజావిజయోత్సవం వేడుకల విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైనచోట కొత్తగా తారువేయడం, మరమ్మతులు చేపట్టడం, మార్కింగ్, సంకేత సూచీల బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రహదారి వెంబడి ఉండే ఇనుపగ్రిల్‌లకు

మిగతా 8వ పేజీలో..



(ఫైల్)

'నిలోఫర్ ఆస్పత్రి గేటు వద్ద నెల రోజుల చిన్నారి కిడ్నాప్..'
'గాంధీ ఆస్పత్రిలో బాలుడి కిడ్నాప్..'

అవకాశం దొరికితే అపహరణే..

- ప్రసూతి ఆస్పత్రుల్లో ఆగంతుకుల తిష్ఠ
- అదను చూసి కిడ్నాప్‌లు
- ఆస్పత్రులు, పిల్లల వార్డుల్లో పర్యవేక్షణ కరువు

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలోనూ ఇలాంటి ఘటనే ఇటీవల చోటు చేసుకుంది. ఇలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నవజాత శిశువుల నుంచి ఆరేడేళ్ల చిన్నారుల వరకు రక్షణ లేకుండా పోతోంది. చిన్న పిల్లల వార్డుల్లో, ఆస్పత్రి ఆవరణలో ఆగంతుకులు మాటువేస్తూ అదనుచూసి అపహరణకు తెగబడుతున్నారు. కొన్ని సందర్భాల్లో గంటల్లోనే కిడ్నాపర్లు పట్టుబడుతున్నా మరికొన్ని ఘటనల్లో రోజుల తరబడి బాధిత తల్లిదండ్రులకు ఆవేదన తప్పడం లేదు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సెక్యూరిటీ వ్యవస్థ ఏ మాత్రం రక్షణ ఇవ్వలేకపోతోంది. ఆగంతుకులు సులువుగా ఆస్పత్రుల్లోకి చొరబడి బిడ్డలను ఎత్తుకెళుతున్నారు. నేరుగా ప్రధాన ద్వారం ద్వారా వెళుతున్నప్పటికీ ఆ విషయాన్ని పట్టించుకునే వారే ఉండడం లేదు. జంటనగరాల్లో పేట్లబురుజు, గాంధీ, నిలోఫర్ ఆస్పత్రి, సుల్తాన్‌బజార్ ఆస్పత్రుల్లో ప్రసూతి సదుపాయం ఉంది. ఇక్కడ నిత్యం ఒక్కొక్క ఆస్పత్రిలో ఇరవై నుంచి ముప్పై వరకు డెలివరీలు జరుగుతుంటాయి.

సీసీ కెమెరాల పనితీరు అంతంతే..

ప్రసూతి ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినా కొన్నిచోట్ల అవి సరిగ్గా పనిచేయవు. సీసీ కెమెరాలను ఉన్నతాధికారి ప్రతి రోజు పర్యవేక్షించాలి. అందులో ప్రధాన ద్వారం వద్ద ఆగంతుకుల రాకపోకలు గమనించాలి. వార్డులోకి ఎవరు వస్తున్నారో తెలుసుకోవాలి. సిబ్బంది కానీ, బయటి వ్యక్తులు కానీ అనుమానాస్పదంగా తచ్చాడుతుంటే గమనించి వారిని పట్టుకోవాలి. కానీ వాటిని పరిశీలించే వారే లేరు. ఎప్పుడో సంఘటన జరిగిన తర్వాత సీసీ కెమెరాలను పరిశీలిస్తుంటారు. ప్రతి రోజు వాటిని గమనిస్తుంటే అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి అప్రమత్తం అయ్యే అవకాశాలు ఉంటాయి. కానీ ఈ దిశగా దృష్టి సారించడం లేదు.

నియంత్రణ ఏదీ..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసే సెక్యూరిటీ సంస్థలు పసిబిడ్డల అపహరణను నియంత్రించలేకపోతున్నాయి. ఎవరైనా కొంత డబ్బిస్తే ఎటువంటి ప్రశ్నలు వేయకుండా లోపలకు పంపిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ఆగంతుకులు పసిబిడ్డలను ఎత్తుకుని పోతున్నారు.

నర్సులు, ఆయాలు లేక..

లేబర్ వార్డుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రతి షిఫ్టుకు ఒక ఇన్‌చార్జీ నర్సు, సహాయకులుగా కనీసం నలుగురు నర్సులు, మరో ఎనిమిదిమంది వరకు ఆయాలు ఉండాలి. వీరంతా

మిగతా 8వ పేజీలో..

25న సర్వే ఆఫ్ ఇండస్ట్రీస్‌పై సమావేశం

నేషనల్ స్టాటిస్టిక్స్ కార్యాలయం, ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్"పై అవగాహన కల్పించేందుకు నేషనల్ స్టాటిస్టిక్ ఫీల్డ్ ఆపరేషన్స్ డివిజన్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.జయరాం ఓ ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ ఆదేశాల మేరకు ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) సహకారంతో రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐ కార్యాలయంలో సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. యాన్యువల్ సర్వే ఆఫ్ ఇండస్ట్రీస్ పేరుతో నిర్వహించే సమావేశంలో తెలంగాణలో ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీల గురించి చర్చిస్తామని, ఈ కార్యక్రమంలో తెలంగాణ ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్ పాల్గొంటారని చెప్పారు.

నేటి నుంచి యూపీఎస్సీ ఐఎఫ్ఎస్ఎం పరీక్ష

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 24 (ఆదివారం) నుంచి డిసెంబరు 1 వరకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ మెయిన్స్(యూపీఎస్సీ ఐఎఫ్ఎస్ఎం) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన యూపీఎస్సీ డైరెక్టర్ మనోజ్ దేహూరీతో కలిసి పర్యవేక్షణ అధికారులు, పరీక్షాకేంద్రం సూపర్‌వైజర్లు, రూట్ ఆఫీసర్లు, పరీక్ష నిర్వహణ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ పరీక్షల సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 2.30 నుంచి 5.30 వరకు రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి 30 నిముషాల ముందే చేరుకోవాలని, సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతిలేదన్నారు. నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీకళాశాలలో కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షకు 222 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

ఈనెల 29న బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70ఎంఎం ఎ/సి - నారాయణగూడ

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఆర్.కె. - బంజారాహిల్స్ | ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | గలేరియా - పంజాగుట్ట | ఐకాన్ - హైటెక్‌సిటీ | పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ | అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | పి.పి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | మంత్రామాల్ - అత్తాపూర్ | సుధా - శాలిబండ | డిఎస్‌ఎల్ మాల్ - ఉప్పల్ | ఏషియన్ సత్యం - అమీర్‌పేట | సినీమార్క్ - ఆర్.సి.పురం | సినీ ప్లానెట్ - కొంపల్లి
సినీటౌన్ - మియాపూర్ | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి | మూవీటైమ్ - అమీర్‌పేట | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి | ప్లెక్సీమాల్ - సనత్‌నగర్ | టివోలి - సికింద్రాబాద్ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్

GLOBAL CINEMAS RELEASE

ఈనెల 28న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్రైడ్ ఎ/సి - మూసాపేట్

RK SRINU - 9391013613

నేడే చూడండి



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.45,6.40 | ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.10,1.25,7.40,10.10 | సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.45,2.00,8.15 | ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.45,1.25,7.40,10.30 | ఆర్.కె. - బంజారాహిల్స్
జిఎస్ఎమ్ - మదీనగూడ 11.00,5.00,8.00 | నెక్లెస్ సత్వ - కవాడిగూడ 11.20,4.30,10.40 | అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.10,1.40,7.50 | మంజీరామాల్ - కూకట్‌పల్లి 11.15,2.00,8.25 | పి.పి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
సినిమాస్ - బాలానగర్ 2.30,8.00,10.50 | సినిమాస్ - చందానగర్ 2.10,8.00,10.50 | సినీటౌన్ - మియాపూర్ 11.00,1.40,8.00 | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 11.00,1.40,8.00 | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి

ప్రిస్టేజ్ మాల్ - గచ్చిబౌలి 1.10,11.10 | అట్రియమ్ - గచ్చిబౌలి 10.25,2.05,8.20 | ప్రిస్మ్ మాల్ - గచ్చిబౌలి 1.00,8.00 | జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 1.30,7.30 | ఎం.పి మాల్ - కాచిగూడ 10.50,7.50
సినీ ప్లానెట్ - కొంపల్లి 10.45,4.35,10.40 | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.35,4.30,7.30,10.40 | ఏషియన్ రాధిక - కాప్రా 1.40,7.35 | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 10.50,1.40,7.35 | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 1.35,4.40,10.40 | శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 10.30,2.10,8.00
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 2.00,9.00 | షా షహెన్‌షా - చింతల్ 11.30,6.30 | మూవీమ్యాక్స్ - మౌలాలి 10.15,4.00,7.45 | జె.పి.సినిమాస్ - చందానగర్ 10.45,1.30,7.30,10.40 | అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల 11.10,4.45,7.30

వెంకటరమణ పద్మావతి - కాచిగూడ 2.30pm
ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 2.30,9.30
తాళ్లూరి కాంప్లెక్స్ - ఇసిఐఎల్ 11.00,2.00,6.00,9.00
సెన్సేషన్ సస్పెన్స్ - ఖైరతాబాద్ 11.15,6.15
అంజలి 70 - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ 70 ఎ/సి - ఉప్పల్ 11.00,2.15,6.00,9.15
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట్ 11.15,2.15,6.15,9.15
ఆరాధన 70 - తార్నాక 11.00,2.00,6.00,9.00
స్వప్న 70 ఎ/సి - కాటేదాన్ 11.00,6.00
లక్ష్మి 70 - శంషాబాద్ 11.15,2.15,6.00,9.15



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

అర్జున్ 70 ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.30,6.00,9.30
తాళ్లూరి 70 ఎ/సి - ఇసిఐఎల్ 11.15,2.15,6.15,9.15
సంపూర్ణ 70 - వనస్థలిపురం 11.00,2.15,6.00,9.15
వెంకటరమణపద్మావతి - కాచిగూడ 11.00am
ఈశ్వర్ - అత్తాపూర్ 2.15,9.00
ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 2.20,9.15
శ్రీసాయిరాం - మల్కాజ్‌గిరి 2.30,6.15
సెన్సేషన్ సస్పెన్స్ - ఖైరతాబాద్ 2.45pm
రంగ 70 - జీడిమెట్ల 2.00,9.00
శ్రీరాములు - మూసాపేట్ 2.30,9.30
స్వప్న 70 - కాటేదాన్ 11.15,6.00
ఎ.ఎం.బి.సినిమాస్ - గచ్చిబౌలి 9.55,4.25,7.00,10.30
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 1.15,7.10,10.20

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.25,5.00,10.45 | సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.35,10.50 | ఫోరం మాల్ - కూకట్‌పల్లి 1.10,7.40,11.10 | ఆర్.కె. - బంజారాహిల్స్ 10.00,4.45,7.25
నెక్లెస్ సత్వ - కవాడిగూడ 11.55,7.50,10.40 | అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 11.15,2.50,6.25,10.00 | మంజీరామాల్ - కూకట్‌పల్లి 1.40,11.20 | పి.పి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 1.30pm | మంత్రామాల్ - అత్తాపూర్ 1.30,11.00
సినిమాస్ - చందానగర్ 10.00,4.20,10.50 | సినీటౌన్ - మియాపూర్ 10.05,4.10,10.30 | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 10.20,4.30,10.40 | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 7.15pm | మూవీటైమ్ - అమీర్‌పేట 10.00,4.00,7.20

GLOBAL CINEMAS RELEASE

METRO MASS BLOCK BUSTER నేడే చూడండి



సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.15

భ్రమరాంబ ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.45,6.30,9.45
సాయిరంగ 70 - మియాపూర్ 11.00,2.00,6.00,9.00
వైజయంతి 70 - నాచారం 11.00,2.00,6.00,9.00
రాజ్యలక్ష్మి 70ఎంఎం - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00
అలంకార్ (ప్రతాప్) - లంగర్‌హౌస్ 11.00,2.00,6.00,9.00
జ్యోతి 70 - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 9.00,11.50,2.40,8.20,11.10 | ఎ.ఎం.బి సినిమాస్ - గచ్చిబౌలి 10.00,1.10,4.20,7.30,10.40 | సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.15,1.30,5.00,7.55,11.10 | ఫోరం మాల్ - కూకట్‌పల్లి
నెక్లెస్ సత్వ - కవాడిగూడ 10.10,1.25,4.40,7.50,11.00 | అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.10,1.25,4.40,7.50,11.00 | మంజీరామాల్ - కూకట్‌పల్లి 10.10,1.10,7.40,10.50 | పి.పి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
సినిమాస్ - బాలానగర్ 10.00,1.10,7.30,10.40 | సినిమాస్ - చందానగర్ 10.00,1.10,7.30,10.40 | సినీటౌన్ - మియాపూర్ 10.30,1.30,7.50,11.00 | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి

GLOBAL CINEMAS RELEASE

ఈనెల 28న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఆర్.కె. - బంజారాహిల్స్ | ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | గలేరియా - పంజాగుట్ట | ఐకాన్ - హైటెక్‌సిటీ
సినీ ప్లానెట్ - కొంపల్లి | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ | ఏషియన్ రాధిక - కాప్రా | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి | మీరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ | మీరాజ్ సినిమాస్ - బాలానగర్ | మీరాజ్ సినిమాస్ - చందానగర్

GLOBAL CINEMAS RELEASE

SUPER HIT నేడే చూడండి



సప్తగిరి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.00,6.00,9.00

మల్లిఖార్జున 70 - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30
రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.30,2.30,6.30,9.30
ఇంద్రనాగేంద్ర 70 - కర్మన్‌ఘాట్ 11.00,6.00
వెంకటరమణపద్మావతి - కాచిగూడ 6.15pm
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట్ 11.15,2.15,6.15,9.15
రామకృష్ణ 70ఎంఎం - అబిడ్స్ 11.15,6.00
తాళ్లూరి 70ఎంఎం - ఇసిఐఎల్ 11.15,2.15,6.15,9.15
మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.15,2.30,6.15,9.45
రంగ 70ఎంఎం - జీడిమెట్ల 11.00,6.00
ఆరాధన 70ఎంఎం - తార్నాక 11.00,2.00,6.00,9.00
లక్ష్మి 70ఎంఎం ఎ/సి - శంషాబాద్ 11.30,2.30,6.00,9.00

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.15,5.35,10.45 | ఎ.ఎం.బి సినిమాస్ - గచ్చిబౌలి 9.45,4.05,7.10,10.25 | సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.05,11.05 | ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.10,5.05,7.40,11.05
జిఎస్ఎమ్ - మదీనగూడ 10.05,1.30,7.25,10.50 | నెక్లెస్ సత్వ - కవాడిగూడ 1.00,7.15 | అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 9.50,1.15,7.30,10.55 | మంజీరామాల్ - కూకట్‌పల్లి 10.40,1.55,4.30
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 10.20,1.30,4.35,7.40,10.35 | మీరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 4.10,10.50 | మీరాజ్ సినిమాస్ - బాలానగర్ 1.20,7.30,10.50 | మీరాజ్ సినిమాస్ - చందానగర్ 4.10,7.30

GLOBAL CINEMAS RELEASE

SUPER HIT నేడే చూడండి



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.15am
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.15am | పివిఆర్ - ఎర్రమంజిల్ 10.05am | జిఎస్ఎమ్ - మదీనగూడ 10.30am
సినీమార్క్ - ఆర్.సి.పురం 1.25pm | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 4.50pm | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 7.45pm
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 11.30am | సినిమాస్ - బాలానగర్ 4.40pm | సినిమాస్ - చందానగర్ 5.00pm

DEEPA ARTS



శాంతి 70 - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00

పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 11.00am
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 10.50am
ఏషియన్ సినీ ప్లానెట్ - కొంపల్లి 10.40am
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 4.25pm
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 1.35pm
శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్ 1.20pm
మీరజ్ సినిమాస్ - బాలానగర్ 5.20pm
మీరజ్ సినిమాస్ - చందానగర్ 11.30am
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 11.00am
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 11.30am
జె.పి.సినిమాస్ - చందానగర్ 1.40pm

ఎస్2 70 - వరంగల్ | వేణుమాల్ - నిజామాబాద్ | బృందావన్ 70 - ఆర్మూర్ | వెంకటేశ్వర - మహబూబ్‌నగర్ | పరమేశ్వరి - కొత్తకోట | భువనేశ్వరి 70 - బిజా | అమర్ 70 - గంగావతి | తిరుమల 70 - గజ్వేల్ | శివశక్తి 70 - తాండూర్

VIISION MOVIE MAKERS THRU PARAMJYOTHI FILMS

SUPER HIT నేడే చూడండి



సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 11.05am
ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.40am
ఏషియన్ సినీ ప్లానెట్ - కొంపల్లి 1.30pm
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 7.50pm
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 4.45pm
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్ 6.25pm
జె.పి.సినిమాస్ - చందానగర్ 1.30pm

ఎస్2 - వరంగల్ | శ్రీదేవి - హన్మకొండ | శ్రీనివాస - కరీంనగర్ | గీతా - నిజామాబాద్ | వేణుమాల్ - నిజామాబాద్ | GHR కాంప్లెక్స్ - కోదాడ | సినిమాస్ - ఆర్మూర్ | తిరుమల - మహబూబ్‌నగర్

NTR CINEMAS RELEASE



శ్రీకృష్ణ - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00

విజయభారతి పుస్తకాలు నిశ్శబ్ద జీవనదులు

● నేటి తరానికి ఆరాధ గ్రంథాలు : పలువురు వక్తలు


విజయగాథ, నిశ్శబ్ద విప్లవ తరంగిణి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కాకి మాధరావు, ప్రొఫెసర్ రమామేల్కోటే తదితరులు

బర్కత్‌పుర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బోయి విజయభారతి రచించిన 12 పుస్తకాలు నేటి తరానికి ఆరాధ గ్రంథాలని అవి నిశ్శబ్ద జీవనదిలాంటివని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆమె రాసిన వ్యాసాలు జీవిత వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయని వారు తెలిపారు. శనివారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బొజ్జ తారకం ట్రస్ట్, బోయి విజయభారతి స్మారక సంచిక కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో విజయగాథ, నిశ్శబ్ద విప్లవ తరంగిణి పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. విజయగాథ పుస్తకాన్ని ఉమ్మడి ఏపీ ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు ఆవిష్కరించి మాట్లాడారు. మూడో తరం నిశ్శబ్దానికి ఈ పుస్తకాలు దోహదపడతాయన్నారు. నిశ్శబ్ద విప్లవ తరంగిణి పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రొఫెసర్ రమామేల్కోటే మాట్లాడుతూ తండ్రితో తనకు ఉన్న అనుబంధాన్ని విజయభారతి అద్భుతంగా రాసిందని కొనియాడారు. తండ్రి, భర్తల మధ్య వ్యక్తిత్వాన్ని నిలబెట్టడానికి ఆమె చేసిన రచనలు నేటి తరానికి మార్గదర్శకమన్నారు. మానవహక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య మాట్లాడుతూ అక్షరం భాషగా నిరంతరం సమాజాన్ని చైతన్యవంతం చేస్తూ ప్రగతిపథంలో నడిపిస్తాయని అన్నారు. భాషా సాహిత్యం, గాత్రం ఈ రెండు పుస్తకాలలో స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు.

సభకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.లింగయ్య అధ్యక్షత వహించగా విజయగాథ పుస్తకాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధారాణి, నిశ్శబ్ద విప్లవ తరంగిణి పుస్తకాన్ని ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధిపతి డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు సభకు పరిచయం చేశారు. అరుణోదయ విమలక్క పాడిన పాటలు సభను ఉత్తేజపరిచాయి. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు సతీష్‌చందర్, పాశం యాదగిరి, విప్లవ రచయిత నిఖిలేశ్వర్, పీఓడబ్ల్యూ జాతీయ అధ్యక్షులు సంధ్య, దళిత స్త్రీ శక్తి జాతీయ అధ్యక్షులు గడ్డం ఝాన్సీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ధనుముల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


కళాకారులను సత్కరిస్తున్న సుఖేందర్‌రెడ్డి

సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలి

రవీంద్రభారతి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాల్సిన అవసరముందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి వేదికగా నాలుగు రోజుల పాటు జరిగిన సంప్రదాయ కళల ఉత్సవం శనివారం ఘనంగా ముగిసింది. కళాకారులను సుఖేందర్‌రెడ్డి సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారి, భోగరాజు మూర్తి, అరికిరేవల రమాప్రభాకర్, మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంక చిత్రపటానికి గాంధీభవన్‌లో క్షీరాభిషేకం

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వయనాడ్ లోక్‌సభ ఉపఎన్నికలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి ప్రియాంకగాంధీ విజయం సాధించడంతో గాంధీభవన్‌లో శనివారం పార్టీ నేతలు సంబరాలు జరిపారు. పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ వయనాడ్‌లో 4 లక్షల మెజారిటీతో గెలిచిన ప్రియాంకగాంధీ.. ఇందిరాగాంధీ వారసురాలిగా చరిత్ర సృష్టించారన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా రాహుల్, ప్రియాంక తిరిగి కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారంలోకి తీసుకువస్తారని ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో గెలుపు మోదీ, అమిత్‌షాలది కాదని, అదానీ, అంబానీలదని అన్నారు.


ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నేతలు

సీసీ రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి


పహాడిషరీఫ్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డిని బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాల్టీ నేతలు శనివారం ఆమె నివాసంలో కలిశారు. జల్‌పల్లి పరిధిలో హెచ్ఎండీఏ నిధుల నుంచి చేపట్టిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులు ఆగిపోయాయని ఆమె దృష్టికి తెచ్చారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు షర్ఫుద్దీన్, అబ్దుల్లా గాలిబ్, ఆరిఫ్ అలీ, బర్కత్ అలీ, అలీ మన్సూరి, మెహెరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణలను కూల్చివేస్తున్న దృశ్యం

జూపార్కు ఎదురుగా ఆక్రమణల తొలగింపు

మదీన, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జూపార్కు నుంచి తాడ్‌బన్ చౌరస్తా వరకు గల ఫుట్‌పాత్ ఆక్రమణలను శనివారం ఫలక్‌నుమా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. జూపార్కు నుంచి ఆరాంఘర్ వరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ త్వరలో ప్రారంభం కానుంది. దీంతో ఫ్లైఓవర్ కిందిభాగంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అడ్డుగా ఉన్న 17 ప్రహరీలు, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కాలాపత్తర్, బహదూర్‌పురా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దక్షిణ మండలం టౌన్‌ప్లానర్ మజీద్, సర్కిల్-10 డిప్యూటీ సిటీప్లానర్ మెహ్రా, సెక్షన్ ఆఫీసర్ మహేందర్, డీఈఈ కాశిఫ్, ఏఈఈ ఫైసల్ కూల్చివేత పనులను పర్యవేక్షించారు.


ఆస్పత్రి ఆవరణలో బైఠాయించిన నగేశ్ తదితరులు

జంగమ్మెట్ ఆస్పత్రిలో కాంగ్రెస్ ఆందోళన

చాంద్రాయణగుట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం ఏర్పడి యేడాది కావస్తున్నా జంగమ్మెట్ ప్రభుత్వ ఆస్పత్రిలో నేటికీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ ఫొటోలను ఉంచడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయ నాగేశ్ నేతృత్వంలో నాయకులు ఆస్పత్రి ఆవరణలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన ఆస్పత్రి సిబ్బంది హుటాహుటిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఫొటోలను అతికించారు. కార్యక్రమంలో నాయకులు నానవాల ప్రమోద్‌కుమార్, రాజుయాదవ్, గణేశ్‌రాథోడ్, అనిల్‌కుమార్, రాము పాల్గొన్నారు.

ఎంపీజే ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

మదీన, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) ఒక సామాజిక, సంక్షేమ, రాజకీయేతర సంస్థ అని ఆ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. ఎంపీజే కుల, మత వివక్షత లేకుండా భారత పౌరుల రాజ్యాంగబద్ధమైన హక్కులు, బాధ్యతలను గు ర్తు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థల్లో అవినీతికి వ్యతిరేకంగా గొంతు విప్పి, ప్రమాణబద్ధమైన వ్యవస్థ కోసం ఎంపీజే పాటుపడుతుందని పేర్కొన్నారు.

రెడీమిక్స్ ప్లాంట్లను తొలగించాలి

● మణికొండ, నార్సింగ్ ప్రజల డిమాండ్ ● ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డులో నిరసన



ధర్నా చేస్తున్న ప్రజలు, ఆయా పార్టీల నేతలు

నార్సింగ్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హైరేంజ్ టవర్ల మధ్యన నడుస్తున్న రెడీమిక్స్ ప్లాంట్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ మణికొండ, నార్సింగ్ మున్సిపాలిటీల ప్రజలు రోడ్డెక్కారు. కొంతకాలంగా ఇళ్ల మధ్యన కొనసాగుతున్న ఈ ప్లాంట్ల కారణంగా ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, దుమ్ము, ధూళితో ఈ ప్రాంతం అంతా కలుషితంగా మారిందని అధికారులు, రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపించారు. ఔటర్ రింగ్‌రోడ్డు సర్వీసు రోడ్డులో మై హోం అవతార్ వద్ద శనివారం నిరసన తెలిపారు. వీరికి బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి, బీజేపీ నాయకుడు, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోదండరెడ్డి కొద్దిసేపు ధర్నాలో కనిపించి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ గండిపేట మండలంలోని కోకాపేట, మణికొండ, నార్సింగ్ ప్రాంతాల్లో కోట్లాది రూపాయలు పెట్టి ఇళ్లను కొన్నా ఆరోగ్యపరంగా భద్రత లేదన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. రెడీమిక్స్ ప్లాంట్ల నిర్వాహకులపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదో చెప్పాలని అధికారులను డిమాండ్ చేశారు.

మహిళా రిజర్వేషన్లపై మోదీ ప్రభుత్వం కుట్ర


సదస్సులో ప్రసంగిస్తున్న పశ్య పద్మ

బర్కత్‌పుర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం అనేక కుట్రలకు పాల్పడుతూ మహిళా రిజర్వేషన్లను అమలు చేయడంలేదని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా జనగణన, నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టకుండా మహిళా రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన భారత జాతీయ మహిళా సమాఖ్య 22వ మహాసభల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 'మహిళా రిజర్వేషన్ చట్టం-2023 - జనాభా లెక్కలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భారత జాతీయ మహిళా సమాఖ్య కార్యదర్శి డాక్టర్ కె.రజిని, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ సీనియర్ నాయకులు పశ్య పద్మ, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేమ్‌పావని, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ సదాలక్ష్మి, ఉపాధ్యక్షులు ఎస్.ఛాయాదేవి ప్రసంగించారు. ఎటువంటి షరతులు లేకుండా 2029 ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలయ్యే విధంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. మహిళా సమాఖ్య నిర్వహించిన పోరాటాల ఫలితంగానే మహిళలకు అనేక హక్కులు, చట్టాలు వచ్చాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సృజన అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు నళినిరెడ్డి, జంగమ్మ, లతాదేవి, జయలక్ష్మి, కల్పన, కళావతి పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో విజయంపై బీజేపీ హర్షం


దారుల్‌షిఫా చౌరస్తా వద్ద మిఠాయిలు పంచుతున్న బీజేపీ నాయకులు

చార్మినార్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు బీజేపీకి పట్టం కడుతున్నారని బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరసత్ అలీ బాకరి అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్‌డీఏకు అత్యధిక స్థానాలు, ఉప ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో బీజేపీ గెలుపొందడంపై ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం దారుల్‌షిఫా చౌరస్తా వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షబానా మోమిన్‌బేగం, వసీముద్దీన్, రవీంద్రనాథ్, అలీ గూట్కి, దియానత్ అలీ, వజహత్, నిస్సార్ పాల్గొన్నారు.


మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించినందున బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఆ పార్టీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. నాయకులు డి.గోపాల్‌జీ, గోవింద్ రాఠీ, దాసరి శేఖర్, ప్రాచీ జైన్, ఆనంద్‌ల నేతృత్వంలో బాణా సంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టుకున్నారు.

- గోషామహల్, ఆంధ్రజ్యోతి

టీటీడీ చైర్మన్ బొలినేని రాజగోపాల్‌నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీపీసీసీ కార్యదర్శి కొప్పుల ప్రవీణ్‌కుమార్



● చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

గోషామహల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ ట్రాఫిక్ పోలీసులు శనివారం గోషామహల్ చౌరస్తాలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ డి.బాలాజీ మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, పెండింగ్ చలాన్లపై వాహనదారులకు అవగాహన కల్పించి కొంతవరకు పాతబకాయిలను వసూలు చేశామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇప్పటి వరకు 1,500 కేసులు నమోదు చేశామని తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐలు ఎ.చెన్నయ్య, సుశాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలాపత్తర్‌లో నాకాబందీ

మదీన, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాలాపత్తర్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం తాడ్‌బన్ చౌరస్తాలో నాకాబందీ నిర్వహించారు. ఫలక్‌నుమా ఏసీపీ ఎంఏ జావిద్, కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్ తాడ్‌బన్, బిస్మిల్లా హోటల్ చౌరస్తాల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని ఎనిమిది వాహనాలను సీజ్ చేసినట్లు ఏసీపీ జావిద్ తెలిపారు. కార్యక్రమంలో కాలాపత్తర్ ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అక్రమ సివరేజ్ కనెక్షన్ కట్

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న ఓ రెస్టారెంట్ సివరేజ్ కనెక్షన్‌ను అధికారులు తొలగించారు. మెహిదీపట్నంలోని కింగ్స్ రెస్టారెంట్ యజమానులు అనుమతి లేకుండానే 250 ఎంఎం డయా సివరేజ్ పైపులైన్ కనెక్షన్ తీసుకున్నారు. దీంతో పాటు ఆ రెస్టారెంట్ నుంచి వచ్చే అధిక సీవరేజ్ వల్ల మెయిన్ రోడ్‌పై తరచూ సివరేజ్ ఓవర్ ఫ్లో అవుతోంది. ఇటీవల ఎండీ అశోక్‌రెడ్డి అక్కడ పర్యటించిన సమయంలో ఈ విషయం బయటపడడంతో కనెక్షన్ కట్ చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో శనివారం రెస్టారెంట్ సివరేజ్ పైపులైన్ కనెక్షన్ తొలగించారు. అక్రమంగా నల్లా, సివరేజ్ కనెక్షన్లు కలిగిన వాళ్లు వాటిని క్రమబద్ధీకరించుకోవాలని ఎండీ అశోక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రులు, హోటళ్లు, బేకరీలు, మాల్స్, తదితర వాణిజ్య, బహుళ అంతస్తు భవన సముదాయాల నిర్వాహకులు తప్పనిసరిగా సిల్ట్ చాంబర్లు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కురుక్షేత్ర అనుస్మరణాయ పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారతీయత గొప్పతనాన్ని సమగ్రత, సమైక్యతను విదేశాలు ఘనంగా చూస్తున్నాయని, ప్రతి ఒక్కరూ మన సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచారాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వాసవీ మహిళా సమాఖ్య ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఉప్పల రాజ్యలక్ష్మి అన్నారు. రవీంద్రభారతిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో రచయిత అరుణ్ కొత్త రచించిన తొలి పుస్తకం కురుక్షేత్ర అనుస్మరణాయ ఆవిష్కరణ సభ జరిగింది. రాజ్యలక్ష్మి పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. సభాధ్యక్షత వహించిన బీఆర్ఎస్ నేత బొగ్గారాపు వరుణ్ మాట్లాడుతూ రచయిత అరుణ్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో కొత్త కిరణ్‌గుప్తా, పోలా శ్రీనివాసరావు, నితిన్ పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/8NxVO5t లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


బీసీ కమిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

బీసీ కమిషన్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ

అఫ్జల్‌గంజ్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ కమిషన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో వెనకబడిన కులాల అధ్యయనంలో భాగంగా 'బహిరంగ విచారణ' కార్యక్రమం జరిగింది. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌కు పలు సూచనలు చేశారు. జాంబాగ్, గోషామహల్, గౌలిపురా డివిజన్ల కార్పొరేటర్లు రాకేశ్ జైస్వాల్, లాల్‌సింగ్, ఆలె భాగ్యలక్ష్మి తదితరులు బీసీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వివరించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, టి.సురేందర్, బాలలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎనుముల అంటే.. అష్యూరెన్స్! : కిసాన్ కాంగ్రెస్

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయిన అసహనంలో సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ఏదేదో మాట్లాడుతున్నారని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అన్నారు. ఎనుముల అంటే అష్యూరెన్సు అని, భట్టి అంటే బ్రాండ్ అని ఆయన గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎనుముల రేవంత్‌రెడ్డి అంటే.. ఎగవేతల రేవంత్‌రెడ్డి అంటూ ఖమ్మంలో హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఈ మేరకు స్పందించారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కన్నా ఇప్పటికే 3 లక్షల టన్నులు అదనంగా పత్తి కొనుగోళ్లు జరిగాయని, 12 శాతం తేమ ఉన్నా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. సన్నరకం ధాన్యానికి వారం రోజులుగా బోనస్ పడుతున్నా.. పడట్లేదంటూ హరీశ్‌రావు అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కృషి వల్లనే మత్స్యశాఖకు ఇన్‌ల్యాండ్ ఫిష్ స్టేట్ అవార్డు వచ్చిందని ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు.

పేట్లబుర్జు ఆస్పత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చార్మినార్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేట్లబుర్జు ఆస్పత్రి సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ రజనిరెడ్డి సూచించారు. ఆరోగ్య మహిళా పథకంలో భాగంగా గర్భిణులకు 16 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. నవంబరులో ఇప్పటి వరకు 1292 నార్మల్ డెలివరీ లు, 492 ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది ఎవరైనా డబ్బులు అ డిగితే తనకు లేదా ఆర్ఎంఓకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముస్లింలకు రిజర్వేషన్లు పెంచాలి

రాజేంద్రనగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను పెంచాలని రాజేంద్రనగర్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సయ్యద్ ముజమ్మిల్ అహ్మద్, జాఫర్ అహ్మద్ పాషా కోరారు. శనివారం లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీసీ కమిషన్‌చైర్మన్ నిరంజన్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు.

భారతీయ జన ఔషధీ కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేయాలి


చిన్నయ్యదొర

బర్కత్‌పుర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన భారతీయ జన ఔషధీ కేంద్రాలను రెండు తెలుగు రాష్ట్రాల్లో విరివిగా ఏర్పాటు చేయాలని, ఉమ్మడి ఏపీ మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ చైర్మన్ గొరకపూడి చిన్నయ్యదొర కోరారు. ప్రజలపై అధిక భారం పడకుండా అతితక్కువ ధరలకే మెడిసిన్ అందించాలని జన ఔషధీకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని ఆయన తెలిపారు. శనివారం బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి వీటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఏపీలో ఆ రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రతీ మండలంలో జన ఔషధీకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారని, దీనిని స్వాగతిస్తున్నామని చెప్పారు. జన ఔషధీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల షెడ్యూల్ విడుదల

కుషాయిగూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. వివిధ గ్రేడ్‌లలో నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలు జనవరి 18, 19వ తేదీలలో, షార్ట్‌హ్యాండ్ పరీక్షలు 25వ తేదీన నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 కేంద్రాల్లో టైప్ రైటింగ్, 6 కేంద్రాలలో షార్ట్‌హ్యాండ్ పరీక్షలు నిర్వహిస్తామని సాంకేతిక విద్య, శిక్షణా మండలి కార్యదర్శి ఆకుటి పుల్లయ్య వెల్లడించారు. ఆయా పరీక్షల టైం టేబుల్‌ను కూడా సిద్ధం చేసి గుర్తింపు పొందిన ఇనిస్టిట్యూట్‌ల నిర్వాహకులకు సమాచారం అందజేశామని ఆయన పేర్కొన్నారు. కాగా, పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబరు 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, మొదటిసారి టైప్, షార్ట్‌హ్యాండ్ పరీక్షలు రాసే అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన ఇనిస్టిట్యూట్ నుంచి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

2 నుంచి అయ్యప్పస్వాములకు అన్నప్రసాదం

చార్మినార్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వాములకు డిసెంబర్ 2 నుంచి జనవరి 8వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ఉచితంగా అన్నప్రసాదం అందజేయనున్నట్లు మీరాలంమండి మహాకాళేశ్వర ఆలయ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా భిక్ష కోసం సమయం లేని వారికి అన్నప్రసాదాన్ని టిఫిన్ బాక్స్‌ల్లో అందజేస్తామని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా ఈనెల 24న ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ, మధుబన్‌కాలనీ వాటర్‌ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. శివాజీనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని జల్‌పల్లి ఇండస్ట్రీయల్, శివాజీనగర్ ఇండస్ట్రీయల్, శివశక్తి ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని వారు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం


సౌమ్య

అఫ్జల్‌గంజ్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అత్తగారింటికి వెళ్లిన యువతి కనిపించకుండా పోయింది. అఫ్జల్‌గంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతపూర్ వెంకటరెడ్డినగర్‌కు చెందిన కసిరెడ్డి జానకి, హరినాథ్ కుమార్తె సౌమ్య(19)కు ఈ యేడాది ఆగస్టులో జడ్చర్లకు చెందిన నరేష్‌తో వివాహమైంది. అప్పటి నుంచి సౌమ్య అత్తగారింట్లో ఉంటోంది. ఈనెల 10వ తేదీన రామంతపూర్‌లోని తల్లిగారింటికి వచ్చింది. ఈనెల 20న మహాత్మా గాంధీ బస్‌స్టేషన్‌లో సౌమ్యను ఆమె తల్లి జానకి జడ్చర్ల బస్సు ఎక్కించి ఇంటికి వెళ్లిపోయింది. సాయంత్రం 3 గంటలకు జడ్చర్ల నుంచి అల్లుడు ఫోన్ చేసి సౌమ్య ఇంకా రాలేదని చెప్పారు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు సౌమ్య కోసం తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో బహదూర్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389
కె. అనిల్ కుమార్: 99854 03628



లోక్‌మంథన్..

ఉత్సాహం ఉప్పొంగెన్



- ఆకట్టుకున్న ప్రదర్శనలు, జానపద నృత్యాలు
- సంస్కృతిని చాటిచెప్పేలా కళారూపాలు
- భారీగా తరలివచ్చిన సందర్శకులు
- నేటి సాయంత్రంతో మంథన్ ముగింపు



హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ శిల్పారామం వేదికగా జరుగుతున్న లోక్‌మంథన్ మూడోరోజు శనివారం సందడిగా సాగింది. వివిధ కళారూపాల ప్రదర్శనలు, జానపద నృత్యాలు ఆహూతులను అలరించాయి. పలు ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్ కళాశాలలు, పాఠశాలల నుంచి వచ్చిన వందలమంది విద్యార్థులు జానపద ఉత్సవాన్ని తిలకించి మురిసిపోయారు. శిల్పకళావేదికలో జరిగిన 'లోకసాహిత్యం', 'పర్యావరణ పరిరక్షణపై భారతీయ లోకచేతన' తదితర అంశాలపై పలువురు జాతీయ వక్తలు ప్రసంగించారు. లిథువేనియా దేశంలోని రోమూవా మతానికి చెందిన అతిథుల సంప్రదాయ అగ్నిపూజ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. రకరకాల ముగ్గులు ప్రేక్షకులను అమితంగా ఆకర్షించాయి. ఆదివారం సాయంత్రం లోక్‌మంథన్ ముగియనుంది.

అలరించిన మగాళ్ల ముగ్గులు

లోక్‌మంథన్ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే రంగవల్లులు ఆకట్టుకుంటున్నాయి. ఆ ముగ్గులు వేసింది మహిళలు కాదు, నలుగురు పురుషులు. మహారాష్ట్రకు చెందిన రఘురాజ్ దేశ్‌పాండే, ఉమేష్ పాంచాల్, చారుదత్త చౌహాన్, అంకిత్‌హంబ్రే. లోక్‌మంథన్ ఇతివృత్తంతో పాటు సంప్రదాయ చుక్కల ముగ్గులు వేశారు. ముగ్గువేయడం (భూఅలంకరణ) మీద సంస్కారభారతి ప్రతిఏటా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తోందని, అలా తాను నేర్చుకున్నట్లు రఘురాజ్ దేశ్‌పాండే వివరించారు. ఆసక్తి ఉండాలేగానీ కళకు స్త్రీ, పురుష సంబంధం లేదన్నారు.

కాలుష్యం నుంచి నదులను రక్షించుకుందాం

కాలుష్యం నుంచి నదులను కాపాడుకోవాల్సిన అవశ్యకత ఉన్నదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. 'భారతీయ తత్వచింతన-పర్యావరణ స్పృహ'పై మేధావులు ప్రసంగించారు. పంచతత్వ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ శ్రీప్రాపాఠక్ మాట్లాడుతూ భారతీయ నదుల చుట్టూ నాగరికతలు ఎలా అల్లుకున్నాయో, ఎలా వృద్ధి పొందాయో తెలిపారు. నీటి వనరుల్లో పెరుగుతున్న కాలుష్యంపై ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు నదుల సంరక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

లిథువేనియా దేశవాసుల అగ్ని ఆరాధన

లిథువేనియాలోని రోమూవా మతానికి చెందిన నలుగురు ఈ ఉత్సవానికి విచ్చేసి వారి సంప్రదాయంలో భాగంగా అగ్ని ఆరాధన నిర్వహించారు. భారతీయ సంస్కృతికి, తమ ఆచార వ్యవహారాలకు మధ్య ఉన్న సారూప్యతలను వివరించారు.

శ్రామిక మహిళలకు వందనం

లోక్‌మంథన్ ఉత్సవంలో 'నారీవందనం' సందర్శకుల మదిదోచింది. ధనిక, పేద తేడా లేకుండా తమ వృత్తిని దైవంగా భావించి పనిచేస్తున్న శ్రామిక మహిళలను గౌరవించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు చెబుతున్నారు. ఆ క్రమంలో కొన్నివందల మందికి కాన్పులు చేసిన సంగారెడ్డి జిల్లా బిడెకన్న గ్రామానికి చెందిన తుల్జమ్మ, సేంద్రియ సాగు ద్వారా ప్రజారోగ్యానికి మేలు చేస్తున్న శ్యామమ్మలకు పాద పూజ చేశారు.



ఈశాన్య రాష్ట్రాల జానపదులే

లోక్‌మంథన్ మూడోరోజు ఈశాన్య రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలే అధికంగా కనిపించాయి. అసోం జానపద నృత్యం 'బిహు', మిజోరం బృందం చైలామ్ నృత్యంతో ఆకట్టుకుంటే, త్రిపుర నుంచి వచ్చిన కళాకారులు రవీంద్ర నృత్యంతో ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. షిల్లాంగ్ నుంచి వచ్చిన గిరిజనులు లాహో డ్యాన్స్‌ను, లడఖ్ బృందం యాక్, జబ్రో నృత్యాలను ప్రదర్శించారు. బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కళాకారులూ తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

నిర్వహణ తీరుపై పెదవివిరుపు

మూడురోజులుగా జరుగుతున్న లోక్‌మంథన్ ఉత్సవాల్లో కళాకారులు, సందర్శకులకు అడుగడుగున సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నిర్వాహకుల సమన్వయలోపం, ప్రదర్శనల ఆలస్యంపై కళాకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో దూరం నుంచి వ్యయప్రయాసలకోర్చి ఇక్కడకొస్తే తమ కళలను ప్రదర్శించే అవకాశం రావడం లేదని పేర్కొన్నారు. కొంతమంది వలంటీర్లు వ్యవహరించిన తీరు బాధ కలిగించినా, భరించామని మరికొందరు చెప్పారు. కార్యక్రమాల షెడ్యూల్‌ను తరచూ మారుస్తున్నారని, తగిన సమాచారం ఇవ్వడం లేదని ఓ వలంటీర్ వాపోయారు. వేదికల మార్పు, సమాచార లోపంతో చాలా ఇబ్బంది పడ్డామని మధ్య, ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.



బీసీల అభ్యున్నతిపై సమగ్ర నివేదిక

- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్
- కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ.. 90 దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కులవృత్తులు, కులసంఘాల సమస్యలను ప్రభుత్వానికి నివేదించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. రాష్ట్రంలో సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతుల అధ్యయనంలో భాగంగా శనివారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కుల సంఘాలు, కులవృత్తిదారుల నుంచి కమిషన్ సభ్యులు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం నిరంజన్ మాట్లాడారు. వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులు, వారికి కావాల్సిన అవకాశాలపై ఉమ్మడి జిల్లాల వారీగా బహిరంగ విచారణ చేపట్టామని, హైదరాబాద్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ విచారణలో కులసంఘాలు, వ్యక్తుల నుంచి 90 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. బీసీల్లో ఎక్కువ కులాల్లో ఆధిపత్యం ఉన్నదని, ఉపకులాలకు ప్రాధాన్యం కల్పించాలని వివరించినట్లు చెప్పారు. అన్నిరంగాల్లో బీసీల అభ్యున్నతికి చేపట్టే అంశాలపై జిల్లాల వారీగా సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. రజక, ఆరెకటిక, వడ్డెర, గంగపుత్ర, నాయీబ్రాహ్మణ, ముస్లింల సమస్యలపై, గతంలో 26 కులాల రద్దుపై పునఃపరిశీలన చేయాలని దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్వో వెంకటాచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బీసీ కమిషన్ చైర్మన్‌కు దరఖాస్తులు అందజేస్తున్న వివిధ కులసంఘాల నేతలు

కమిషన్‌కు పలు వినతులు

కాగా, బీసీ కమిషన్ బహిరంగ విచారణకు పలువురు బీసీ కులస్థులు, వృత్తిదారులు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో తెలియజేశారు. బీసీ-ఎ, బీసీ-బీలోని గంగపుత్రులు, రజకులు, వడ్డెర, ఆరె కటికలను ఎస్సీలోకి మార్చాలని, ఉప్పర కులస్థులను ఎస్టీలోకి మార్చాలని కమిషన్ చైర్మన్‌ను కోరారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని బీసీలను ఆదుకోవాలన్నారు. గౌలిపురాలో ఆరెకటికలకు కేటాయించిన 4 ఎకరాల భూమి కబ్జా అయ్యిందని, రహమత్‌నగర్‌లో కబ్జాకు గురైన 9 ఎకరాల వడ్డెర స్థలాన్ని కాపాడాలని పలువురు విన్నవించారు.

అవకాశం దొరికితే అపహరణే..

(5వ పేజీ తరువాయి)

కేవలం పుట్టిన శిశువులను గుర్తించి తల్లికి, బిడ్డకు ఒకే రకం ట్యాగ్‌లను ఏర్పాటు చేస్తారు. వీటి పర్యవేక్షణ ఇన్‌చార్జీ నర్స్ ఆధ్వర్యంలో జరగాలి. అయితే నర్సులు, ఆయాలు తక్కువగా ఉండడమేకాక ఇన్‌చార్జి నర్స్‌లు కూడా ఉండడం లేదు. దీంతో ట్యాగ్‌లు కట్టడంలో పెద్దగా పట్టించుకోవడం లేదు. మరికొన్ని ఆస్పత్రులలో ఈ ట్యాగ్‌లను కట్టడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. శిశువులను గుర్తించడానికి ట్యాగ్‌లు వెంటనే కట్టకపోవడం సమస్యకు కారణమవుతున్నది.

ఇలా చేస్తే...

- ఎన్‌ఐసీయూలో ఎక్కువ సహాయకులు లేకుండా చూడాలి.
- ప్రతి సహాయకుడికి ఫొటోతో కూడిన అటెండర్‌పాస్‌ను తప్పనిసరిగ్గా ఇవ్వాలి.
- ఎన్‌ఐసీయూలో మహిళా సెక్యూరిటీని గస్తీలో ఉంచాలి.
- పిల్లల వార్డుకు రాత్రి పూట తాళం వేసే సదుపాయం కల్పించాలి.
- బిడ్డలకు వైద్య పరీక్షల సమయంలో ప్రత్యేకంగా నర్సు లేదా మహిళ అటెండర్ వెంట ఉండేలా జాగ్రత్తలు పాటించాలి.
- ప్రధాన ద్వారం వద్ద, ఎన్‌ఐసీయూలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.
- ఆస్పత్రి ఆవరణలో తచ్చాడే వ్యక్తులను విచారించాలి.
- సెక్యూరిటీ వ్యవస్థను ఆస్పత్రి సిబ్బందిచే నిర్వహించాలి.



నానక్‌రాంగూడలో స్టార్ లివర్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించిన దర్శకుడు రాజమౌళి. చిత్రంలో డాక్టర్ గోపీచంద్, డాక్టర్ రమేశ్, వైద్యనిపుణులు

ఆరోగ్య సంరక్షణలో అప్రమత్తత అవసరం

- స్టార్ లివర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభోత్సవంలో రాజమౌళి

రాయదుర్గం/హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని.. ఆరోగ్యం, వ్యాయామం విషయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ప్రముఖ సినీదర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి సూచించారు. అత్యాధునిక లివర్ సంరక్షణ, అవయవ మార్పిడి సేవల కోసం నానక్‌రాంగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టార్ లివర్ ఇన్‌స్టిట్యూట్‌ను రాజమౌళి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవ మార్పిడిపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉన్నదని, ఏడాదికి రెండు లక్షల మందికి అవయవ మార్పిడి అవసరమైతే కేవలం నాలుగువేల శస్త్రచికిత్సలు జరుగుతుండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మన్నం గోపీచంద్, జేఎండీ డాక్టర్ రమేష్, వైద్యులు డాక్టర్ రవీంద్రనాథ్, డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

ప్రసవించి..అనాథగా వదిలేశారు

- వాహెద్‌నగర్‌లో అప్పుడే పుట్టిన శిశువు లభ్యం

చాదర్‌ఘాట్/ఓల్డ్ మలక్‌పేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి మగశిశువుకు జన్మనిచ్చిన తల్లి.. మాతృత్వం మరిచి బిడ్డను పురిట్లోనే వదిలిపోయింది. శిశువు ఏడుపు విన్న స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో వారు వెంటనే ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి.. ఓల్డ్‌మలక్‌పేట వాహెద్‌నగర్ హైటెక్‌గార్డెన్ వెనుకనున్న రెండంతస్తుల భవనంలోని టెర్రస్ పైనుంచి శనివారం తెల్లవారుజామున శిశువు ఏడుపు వినిపించింది. స్థానికులు గమనించి చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారమివ్వడంతో ఎస్ఐ భరత్ సిబ్బందితో చేరుకొని ప్రాథమిక చికిత్స కోసం శిశువును ఉస్మాన్‌పురలోని ముస్లిం మెటర్నిటీ ఆస్పత్రికి తరలించారు. పుట్టిన గంటన్నరలోపే చిన్నారిని వదిలివెళ్లారని, చలికి తట్టుకోలేక ఏడ్చి ఉంటాడని వైద్యులు తెలిపారు. అనంతరం నిలోఫర్‌లో మెరుగైన చికిత్స అందించి శిశు సంరక్షణ విభాగానికి అప్పగించారు.

ప్రభుత్వ హాస్టళ్ల తనిఖీకి ప్రత్యేకాధికారులు : కలెక్టర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గుణాత్మక విద్యతోపాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వార్డెన్లను ఆదేశించారు. శనివారం ఆయన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, గురుకులాల వార్డెన్లు, ప్రత్యేక అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వసతిగృహాల తనిఖీ కోసం జిల్లాలోని వివిధ విభాగాలకు చెందిన 82 మంది ప్రత్యేక అధికారులను నియమిస్తున్నామని, ప్రతిరోజు ఒక్కో అధికారి రెండు హాస్టళ్లను తనిఖీ చేస్తారని చెప్పారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆయన ఆదేశించారు.

న్యాయమూర్తుల నియామకాల్లోనూ అన్యాయం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల



మాట్లాడుతున్న ఎంపీ ఈటల

పంజాగుట్ట,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉన్నత న్యాయవ్యవస్థలో న్యాయమూర్తుల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పలువురు ఆరోపించారు. 'ఉన్నత న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయం' అన్న అంశంపై బీసీ, ఎస్సీ, ఎస్టీ అడ్వొకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ వీహెచ్, బీఆర్ఎస్ నేత దాసోజు శ్రావణ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీ ఈటల మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు లేవని, అలాగే న్యాయవ్యవస్థలో కూడా వివక్ష కొనసాగుతోందన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అందరికీ న్యాయం చెప్పే న్యాయస్థానాల్లో న్యాయం జరగడం లేదన్నారు. న్యాయస్థానాల్లో బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించాలని, ఇందుకు చట్టాలు రూపొందించాలని సమావేశం తీర్మానించింది. అసోసియేషన్ కన్వీనర్ జెల్లా లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవి డిమాండ్‌కు ముందస్తు చర్యలు : మేడ్చల్ ఎస్ఈ

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వేసవి విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని చేపట్టిన పనులు జనవరి 31 నాటికి పూర్తి కానున్నాయని మేడ్చల్ సర్కిల్ ఎస్ఈ రవికుమార్ తెలిపారు. సర్కిల్ పరిధిలో 46 సబ్‌స్టేషన్లు ఉండగా 18 సబ్‌స్టేషన్లలో 8 కేవీఏ సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను 12.5 కేవీఏ సామర్థ్యానికి పెంచినట్లు తెలిపారు. విద్యుత్ డిమాండ్ ఏ స్థాయిలో పెరిగినా అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమ్మర్ యాక్షన్‌ప్లాన్ పనులను ఆకస్మిక తనిఖీ చేస్తునట్లు ఆయన పేర్కొన్నారు.

మిసెస్ ఆసియా రన్నరప్‌గా రత్నమెహెరా



బంజారాహిల్స్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మిసెస్ ఆసియా ఇంటర్నేషనల్ 2024 పోటీల్లో నగరానికి చెందిన రత్నమెహెరా రన్నరప్‌గా నిలిచారు. బ్యాంకాక్‌లో ఈనెల 13 నుంచి 19 వరకు పోటీలు జరగగా, అనేక రౌండ్లు దాటుకొని రన్నరప్‌గా గెలిచినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనడం ద్వారా మహిళల్లో ఆత్మస్థైర్యానికి కొదవలేదని చాటిచెప్పడమే తన లక్ష్యమని మెహెరా చెప్పారు.

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

PLOT FOR SALE

H శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ హైవే బీబీ నగర్ టౌన్, AIMS అతి సమీపంలో, HMDA & RERA అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్లు కలవు. గే:కు॥ఆటేడె॥ స్పాట్ రిజి॥ బ్యాంకు లోన్, ఫ్రీ సైట్ విజిట్ Ph: 9912357546 AJH›1379

H 4,50,000/- లకే DTCP అప్రూవ్డ్ లేఅవుట్‌లో ప్లాట్లు కలవు ● యాదాద్రి, నెమిల (V) గేటెడ్, 40&33 cc రోడ్స్. స్పాట్ రిజిస్ట్రేషన్. Near RRR Ph: 7730884948 AJH›1492

H ఘట్‌కేసర్ మం. పోచారం, జోడిమెట్ల సర్కిల్ నుండి చౌదరిగూడా 60 ఫీట్ల రోడ్డుకు తూర్పు ఫేసింగ్‌తో కమర్షియల్ ప్లాటు 400 గజాలు అమ్మకానికి కలదు. 9849084905 AJH›16490

యోగా తరగతులు

H శ్రీనివాస్ యోగా క్లాసెస్ సంతాన మరియు అన్ని రకాల వ్యాధులకు యోగా నేర్పబడును. సంప్ర: శ్రీనివాసులు. ఫోన్: 9908501336. srinivasyogaclasses. in AJH›002728

FLAT FOR SALE

H 2BHK Flat, 1100 Sft, West Facing, 8years Old, Gated Cometed, Sarasari Garden At Suchitra Rs›65Lakhs PHONE: 9949434311, 7328989899 AJH›14770

JOBS

H డిసెంబర్ రెండవ వారంలో అమెరికా వెళుతున్న మాకు ఇంటి పనులు చేయుటకు 40-50 సం. వయస్సు గల ఆడ మనిషి కావలెను. USA విజిటింగ్ వీసా కలిగిన వారు మాత్రమే సంప్రదించగలరు. ఫోన్ : 81217 42155 AJH›99096

CHANGE OF NAME

H I, SIRISHA GUMPALLI W/o NAGA SREENIVASU AKULA R/o. R/o Flat No. Emerald 1401, My Home Jewel, Madinaguda, Miyapur, RR District, Hyd›500049, has Changed My Name as RATHNA SIRISHA AKULA. For all future purposes. AJH›002894

H I, Golla Kundana Kumari W/o Dileep Kumar Meruva R/o#301,Sunadura Residency, Keshava Nagar, Boduppal, Medchal (D)›92,T.S. after Marriage has my name as Kundana Dileep Meruva AJH›002893

H I, FARHANA NIZAMUDDIN CHAUDRY, R/o:206 Staff Quarters, Sriram Nagaram. JIMS Medical College, Shamshabad (M) Muchintal› 509325,K.V.Rangareddy,T.S Changed My Name as

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
99859 21380, 99859 21386
97036 18806

లంబసింగి టు హైదరాబాద్

(5వ పేజీ తరువాయి)

స్నేహితులు అదిగల్లి ప్రకాశ్‌కుమార్, మసాలాల మోహన్‌రావు, రాజన దుర్గాహరిప్రసాద్ అలియాస్ ప్రసాద్, కోడి రమణ ఇలా ముఠాగా ఏర్పడ్డారు.

జైలుకెళ్లి వచ్చినా ఆగని దందా..

గంజాయి సరఫరాలో రాటుదేలిన ఈ ముఠా సభ్యులు పోలీసులకు చిక్కి జైలుకెళ్లొచ్చారు. ఆ తర్వాత పద్ధతి మార్చుకోకుండా అదే దందాను కొనసాగించారు. హైదరాబాద్‌లో గంజాయికి అధిక డిమాండ్ పలుకుతుండటంతో గుట్టుగా నగరానికి చేరవేయాలని పథకం వేశారు. కాలేజీ బ్యాగులు, లగేజీ బ్యాగులు, ఉప్పులు, పప్పులు తీసుకెళ్లే సంచుల్లో గంజాయి ప్యాకెట్లను పెట్టి నిత్యావసర సరుకులు, దుస్తులు వాటిపై కప్పి రైలు, బస్సు, లారీల్లో వలస కూలీల్లా నగరానికి చేరుకునేవారు. గంజాయి విక్రయించే వ్యాపారులకు అమ్మి డబ్బులు తీసుకొని వెళ్లిపోయేవారు. రూ.1500 కేజీ కొన్న గంజాయిని రూ. 25వేలకు విక్రయించేవారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న హెచ్ న్యూ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి.. గోవింద్ ముఠా నగరానికి చేరుకున్నట్లు తెలుసుకొని కాచిగూడ పరిధిలో మాటు వేసి పట్టుకున్నారు. గోవింద్ ముఠాలోని ఐదుగురితో పాటు కమీషన్‌పై గంజాయిని తరలించడానికి ఒప్పుకున్న మరో ఇద్దరు .. లాలం గంగాధర్, ఏతుల గంగాధర్ (మొత్తం ఏడుగురు)లను పోలీసులు అరెస్టు చేశారు. చాకచక్యంగా ముఠా ఆటకట్టించిన హెచ్ న్యూ టీమ్ ఇన్‌స్పెక్టర్ డానియెల్, ఎస్సై వెంకటరాములు, కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, ఎస్సై నరేష్‌లను నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అభినందించినట్లు డీసీపీ తెలిపారు.

సాహిత్య స్పృహను రగిలించిన తెలంగాణ ఉద్యమం

- 'కథా కచ్చీరు' పుస్తకావిష్కరణలో కె.శ్రీనివాస్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కె.శ్రీనివాస్, నిత్యానందరావు, రచయిత వెల్దండి శ్రీధర్

రవీంద్రభారతి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమం సాహిత్య స్పృహను కలిగించిందని, వెల్దండి శ్రీధర్ ఆ స్పృహను అందిపుచ్చుకుని అస్తిత్వ సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని 'ఆంధ్రజ్యోతి' పూర్వ సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో వెల్దండి శ్రీధర్ రచించిన 'కథా కచ్చీరు' పుస్తకావిష్కరణ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య నిత్యానందరావు మాట్లాడుతూ కథా సాహిత్యం గుర్తింపు పొందేలా కథలను అందించారని, తెలంగాణ కథా సాహిత్య విమర్శ వ్యాసాలతో పుస్తకం రచించారని కొనియాడారు. పుస్తక ఆవిష్కర్త కె.శ్రీనివాస్ తన ప్రసంగంలో.. సమకాలీన కథల్ని పరిచయం చేయాలనుకోవడంతో పాటు తెలంగాణ ప్రాంతీయతత్వం గురించి పరిశోధన చేయడం అభినందనీయమన్నారు. తెలుగు సాహిత్యంలో తెలంగాణ కథలు గుర్తింపు పొందడానికి తెలంగాణ ఉద్యమం కూడా ఒక కారణమన్నారు. సాహిత్య ప్రవాహంతో తెలంగాణ సస్యశ్యామలంగా ముందుకెళ్తోందని, తెలంగాణ కథను విస్తరించే ప్రయత్నం జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు బండ సరోజన, సాహిత్య అకాడమీ సలహామండలి సభ్యురాలు లావణ్య, టీవీ నారాయణ, ఆడెపు లక్ష్మణ్, రవి, వలీ హుస్సేన్ పాల్గొన్నారు.

కాసుల కష్టాలు

(5వ పేజీ తరువాయి)

సర్దుబాటు చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో రహదారుల బిల్లులు చెల్లించడం లేదు. బ్యాంకు రుణాల ద్వారా(ట్రిడ్స్) కాంట్రాక్టర్లకు ప్రస్తుతం చెల్లింపులు జరుగుతున్నాయి. రుణాలకు షూరిటీగా ఉంటోన్న జీహెచ్ఎంసీ నిధుల సర్దుబాటు అనంతరం రుణాలను నేరుగా బ్యాంకులకు చెల్లించనుంది. రుణాలకు సంబంధించిన వడ్డీ మాత్రం కాంట్రాక్టర్లు భరిస్తున్నారు.

రోడ్ల బిల్లులు పెండింగ్

రోడ్లకు సంబంధించి ప్రస్తుతం రూ.1200 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నియోజకవర్గం అభివృద్ధి నిధులు(సీడీఎఫ్), అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్‌డీఎఫ్)లో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించి మరో రూ.100 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. ఎస్ఆర్‌డీపీ బిల్లులు రూ.150 కోట్లు, నాలాల పూడికతీత, సమగ్ర వ్యర్థాల నిర్వహణ, ఇతరత్రా పనులకు సంబంధించి మరో రూ.200 కోట్ల బిల్లు పెండింగ్‌లో ఉన్నది. రెండు పడకల ఇళ్ల బిల్లులు రూ.300 కోట్ల వరకు బకాయి ఉన్నా.. హౌసింగ్ కార్పొరేషన్ నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. అసంపూర్తి పనులు పూర్తి చేయడానికి మరో రూ.3 వేల కోట్లు అవసరమని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. బిల్లులు భారీగా పేరుకుపోవడంతో గ్రేటర్‌లో మెజార్టీ పనులు నిలిచిపోయాయి.

'మహా' ఫలితాలతో కమలం జోష్

(5వ పేజీ తరువాయి)

వ్యూహం రచిస్తోంది. మొదటి నుంచి తెలంగాణలో హైదరాబాద్‌లోనే బీజేపీ బలంగా ఉంది. గ్రేటర్‌లో పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో బీజేపీ గట్టి పోటీ ఇచ్చింది. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 47 స్థానాలను కైవసం చేసుకుంది. ఈసారి గ్రేటర్‌లోఎక్కువ సీట్లు గెలవడానికి బీజేపీ శ్రేణులు వ్యూహాత్మకంగా కదలనున్నారు. ఆసక్తి ఉన్న వారిని చేర్చుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో యువతను ఆకర్షించడమే లక్ష్యంగా బీజేపీ ముందుకు దూసుకుపోతున్నది.

రూ.2.87 కోట్ల జరిమానా వసూలు

(5వ పేజీ తరువాయి)

నమోదు చేసినట్లు సిటీ ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. 13,188 మందిపై పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసి వారిని వివిధ కోర్టుల్లో హాజరుపరచగా.. 824 మందికి వివిధ న్యాయస్థానాల మేజిస్ట్రేట్‌లు ఒకటి నుంచి 20 రోజుల వరకు జైలుశిక్ష విధించారు. మరో 227 మందితో పోలీసులు న్యాయస్థానం ఆదేశాల మేరకు రెండు రోజులపాటు సామాజిక సేవ చేయిస్తున్నారు. ఇతర డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో జరిమానాలు విధించగా రూ. 2,87,20,600 డబ్బు వసూలు అయినట్లు అధికారులు వెల్లడించారు. పదేపదే డ్రంకెన్‌డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడుతున్న మందుబాబుల్లో ఈ ఏడాది 89 మంది లైసెన్స్‌లు నెల నుంచి ఆరు నెలలపాటు ఆర్టీఏ అధికారులు రద్దు చేసినట్లు అడిషనల్ సీపీ తెలిపారు.

యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

(5వ పేజీ తరువాయి)

కలర్లు వేయించాలన్నారు. ట్యాంక్‌బండ్, సెక్రటేరియట్, నెక్లెస్‌రోడ్, డివైడర్‌లు, కూడళ్లను అందంగా ముస్తాబు చేయాలన్నారు. ప్రధానమార్గాల్లో ఇరువైపులా మిరుమిట్లు గొలిపేలా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వాటర్‌బోర్డు ఎండీ డి.అశోక్‌రెడ్డి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి ప్రియాంక, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హిందీ మహా విద్యాలయంలో డిగ్రీ సర్టిఫికెట్ల ఫోర్జరీ

» కళాశాల అనుమతులు రద్దు

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగుతున్న హిందీ మహా విద్యాలయ.. విద్యార్థుల డిగ్రీ సర్టిఫికెట్లను ఫోర్జరీ చేసింది. ఫెయిలైన విద్యార్థులను పాసైనట్లుగా తప్పుడు సర్టిఫికెట్లను సృష్టించింది. ఓయూకు చెందిన అధికారుల సంతకాలనూ ఫోర్జరీ చేసింది. విచారణ జరిపిన ఓయూ అధికారులు హిందీ మహా విద్యాలయ అనుమతులను రద్దు చేశారు. ప్రస్తుతం వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులు నష్టపోకుండా ఓయూ పర్యవేక్షణలో కోర్సులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. హిందీ మహా విద్యాలయానికి ఉన్న స్వయం ప్రతిపత్తిని రద్దు చేయాలంటూ ఉస్మానియా వర్సిటీ యూజీసీకి ప్రతిపాదనలు పంపింది. హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఉన్న హిందీ మహా విద్యాలయానికి స్వయం ప్రతిపత్తి ఉంది. యూజీలో బీబీఏ, బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులను, పీజీలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తోంది. స్వయం ప్రతిపత్తి ఉండడంతో హిందీ మహా విద్యాలయమే స్వయంగా పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, తమ అధ్యాపకులతోనే నిర్వహించుకోవడానికి అవకాశం ఉంది. అయితే 2019-22 విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షల్లో 49మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. ఐదుగురు విద్యార్థులు పాసయ్యారు. కానీ, ఫెయిలైన 49 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లుగా, ఉత్తీర్ణులైన 5గురు విద్యార్థులు ఫెయిలైనట్లుగా తారుమారు చేసిన జాబితాను ఓయూ పరీక్షల నియంత్రణ కార్యాలయానికి హిందీ మహావిద్యాలయం సమర్పించింది. సదరు విద్యాసంస్థ రికార్డులపై అనుమానం రావడంతో ఓయూ అధికార యంత్రాంగం సమగ్ర విచారణకు ఆదేశించింది. హిందీ మహా విద్యాలయ అక్రమాలకు పాల్పడ్డట్లు కమిటీ నిర్ధారించింది. ఓయూ పరిధిలో అక్రమాలను సహించే ప్రసక్తే లేదని వీసీ ఎం.కుమార్ చెప్పారు.

'ఇందిరమ్మ' ఇళ్ల సర్వేకు పైలట్ జిల్లాల ఎంపిక

» మెదక్, నిజామాబాద్, పాలమూరు, భద్రాద్రిలో సర్వే

మెదక్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేకు పైలట్ ప్రాజెక్ట్ జిల్లాలుగా మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం ఎంపికయ్యాయి. సర్వే ఆధారంగా లబ్ధిదారుల వివరాలను 'ఇందిరమ్మ' యాప్‌లో నమోదు చేయనున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం తెలిపారు. మెదక్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా సర్వే నిర్వహించనున్న హవేళీఘన్‌పూర్ మండలం లింగ్‌సాన్‌పల్లి గ్రామంలో దరఖాస్తుదారుల వివరాలను రాహుల్ రాజ్ యాప్‌లో పొందుపరిచారు. లింగ్‌సాన్‌పల్లితోపాటు జిల్లాలోని నర్సాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లింగ్‌సాన్‌పల్లిలో 153, నర్సాపూర్‌లోని 5వ వార్డులో 305 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఈ జిల్లాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సర్వే జరగనుంది.

'ఈవీ'లపై రాయితీలు ప్రజలకు తెలియాలి

» వాహన షోరూమ్‌ల వద్ద బోర్డులు పెట్టించండి: పొన్నం

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాలుష్యాన్ని తగ్గించడంలో భాగంగా ఈవీ(ఎలక్ట్రిక్ వాహనాలు)ల రిజిస్ట్రేషన్‌లో ప్రభుత్వం రాయితీలు ఇస్తున్న విషయం ప్రజలకు చేరువవ్వాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించింది. ఈ రాయితీలపై వాహన షోరూమ్‌ల వద్ద ఆయా సంస్థలు బోర్డులు పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు రవాణా శాఖ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించిన ఆయన కీలక సూచనలు చేశారు. అలాగే, 'మహాలక్ష్మీ' పథకం అమలుతో ఆర్టీసీ లాభాల బాట పట్టిందని టీజీఆర్టీసీ అధికారులతో నిర్వహించిన మరో సమీక్షలో మంత్రి పేర్కొన్నారు.

పది రోజులకో బిడ్డ ప్రాణం పోతోంది

» మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి: కవిత

హైదరాబాద్ సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల వ్యవస్థ ధ్వంసమైన పరిస్థితి కనిపిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజను, ఆమె కుటుంబ సభ్యులను కవిత శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 11 నెలలు అవుతోందని, సగటున నెలకు ముగ్గురు చొప్పున ఇప్పటి వరకు 42 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బిడ్డలు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆహారం విషతుల్యమవ్వడంతో మరణించారని అన్నారు. సగటున పది రోజులకో బిడ్డ ప్రాణం పోతున్నా ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మరణించిన 42 మంది పిల్లల కుటుంబ సభ్యులకు రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ప్రేమతత్వాన్ని బోధించిన కవి నజ్రుల్ ఇస్లాం

» 'విద్రోహి' పుస్తకావిష్కరణలో వరవరరావు


విద్రోహి పుస్తకావిష్కరణలో పాల్గొన్న సుధాకిరణ్, వేణుగోపాల్, గీతారామస్వామి

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'ద్వేషమే విశ్వగురువై ప్రపంచానికంతా విద్వేషాన్ని ప్రచారం చేస్తున్న ఈ కాలంలో దాన్ని ఎదుర్కొనే ఏకైక ఆయుధం ప్రేమతత్వం మాత్రమే. అది కాజీ నజ్రుల్ ఇస్లాం కవిత్వం నిండా ఉంది. అందుకే ఆ మహనీయుడి రచనలను ఆశ్రయించాను, అనువదించాను' అని విరసం నేత వరవరరావు తెలిపారు. తాను ఎరవాడ జైలు గోడల మధ్య ఉరిశిక్ష పడిన ఖైదీలతో కొన్ని ఉర్దూ పదాల గురించి సంభాషిస్తూ, నజ్రుల్ కవిత్వాన్ని తెలుగులోకి అనువదించినట్లు చెప్పారు. ప్రఖ్యాత కవి కాజీ నజ్రుల్ ఇస్లాం కవిత్వం వరవరారావు తెలుగు అనువాదం 'విద్రోహి' పుస్తకావిష్కరణ సభ శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో హైదరాబాద్ బుక్ ట్రస్ట్ నిర్వహించింది. ముంబై నుంచి వరవరరావు వర్చువల్‌గా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఉపా లాంటి దేశద్రోహ చట్టాలతో దేశమే జైలుగా మారిన ఈ కాలంలో నిశ్శబ్దాన్ని బద్ధలు కొట్టడానికి జైలు గోడలు బద్ధలు కొట్టండంటూ నజ్రుల్ కవిత్వాన్ని ఎత్తిపట్టుకున్నాను' అని వ్యాఖ్యానించారు. నజ్రుల్‌ఇస్లాం కవితలు తెలుగులోకి అంతగా రాలేదని, ఆ లోటును 'విద్రోహి' పుస్తకం భర్తీ చేస్తుందని వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ అన్నారు. బ్రిటిషు వలసవాదానికి వ్యతిరేకంగా నజ్రుల్ ఇస్లాం సాగించిన పోరాటాన్ని, తర్వాత కాలంలో బంగ్లాదేశ్ జాతీయోద్యమంలో ఆయన సాహిత్యం వహించిన పాత్రను వివరించారు. కార్యక్రమంలో 'విద్రోహి' కవిత్వానికి లెల్లే సురేశ్ బృందం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. హెచ్‌బీటీ గీత, సుధాకిరణ్ తదితరులు ఇందులో పాల్గొన్నారు.

జగన్‌పై పీసీ యాక్ట్?

» అమెరికా కేసుపై ఏపీ ప్రభుత్వం పరిశీలన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సౌర విద్యుత్ ప్రాజెక్టు ముడుపుల కేసులో ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మెడకు ఉచ్చు బిగుసుకునే అవకాశం కనిపిస్తోంది. జగన్‌ను ప్రాసిక్యూట్ చేసే అవకాశాలపై రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం వ్యవహారంలో అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజి కమిషన్ అక్కడి కోర్టుల్లో చార్జిషీటు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అమెరికాలో గౌతమ్ అదానీ తదితరులపై కేసు నమోదు చేశారు. 2021లో ఏపీ ప్రభుత్వం 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోవడానికి రూ.1750 కోట్ల మేర లంచం ఇచ్చారని చార్జిషీటులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అప్పటి ఏపీ సీఎం ఉన్నారని చార్జిషీటులో నిర్దిష్టంగా ప్రస్తావించారు. దీని ఆధారంగా జగన్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయవచ్చా అన్న కోణంలో కూటమి ప్రభుత్వం న్యాయ నిపుణుల సలహా కోరింది.

ఇండి కూటమి సమష్టి కృషి వల్లే

ఝార్ఖండ్‌లో విజయం

రాష్ట్ర సంపద స్థానికులకే చెందాలంటూ ప్రచారం చేశాం

» చొరబాటుదారులు పెరుగుతారంటూ బీజేపీ తప్పుడు ప్రచారం

» మా కూటమి మాటలనే ప్రజలు నమ్మారు: భట్టి విక్రమార్క


హేమంత్ సోరెన్‌కు మిఠాయి తినిపిస్తున్న భట్టి

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ రాష్ట్ర ఎన్నికల్లో ఇండి కూటమి సమష్టి కృషి వల్లే విజయం సాధించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బీజేపీ తలకిందులుగా తపస్సు చేసినా విజయం సాధించలేకపోయిందని పేర్కొన్నారు. ఆ పార్టీ కొనుగోళ్ల గిమ్మిక్కులు సాగలేదని చెప్పారు. ఝార్ఖండ్ ఎన్నికల కోసం భట్టి విక్రమార్కను కాంగ్రెస్ అధిష్ఠానం ఎన్నికల పరిశీలకుడిగా, స్టార్ క్యాంపెయినర్‌గా నియమించింది. ఆ మేర కు ఎన్నికల్లో ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. ఝార్ఖండ్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే శుక్రవారం భట్టిని ఫలితాల పరిశీలకుడిగా నియమించారు. దాంతో ఆయన శనివారం ఉదయమే ప్రత్యేక విమానంలో ఝార్ఖండ్ వెళ్లారు. అక్క డి కాంగ్రెస్ నేతలతో సమావేశమై ఎన్నికల ఫలితాలను విశ్లేషించారు. ఇండి కూటమి విజయం ఖరారు కావడంతో రాంచీలోని జేఎంఎంనేత, సీఎం హేమంత్ సోరెన్ ఇంటికి వెళ్లి ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఝార్ఖండ్‌లోని ఖనిజాలు, వనరులు వంటి సంపద స్థానికులకే చెందాలని, ఆదానీ, అంబానీ వంటి బడా పారిశ్రామికవేత్తలకు ఏమాత్రం అవకాశం ఇవ్వొద్దంటూ ఎన్నికల్లో ప్రజలకు వివరించామని పేర్కొన్నారు. రాష్ట్ర సంపద అందరికీ సమానంగా పంపిణీ కావాలన్న రాజ్యాంగ హక్కులను కాపాడుతామంటూ తమ పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ఖర్గే.. ప్రజలకు హామీ ఇచ్చారని తెలిపారు. జేఎంఎం, కాంగ్రెస్ కూటమి గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించామని, మళ్లీ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి చేస్తామని చెప్పామన్నారు. అందుకే తమ కూటమి మాటలను ప్రజలు నమ్మారని, బీజేపీ పట్ల ఎలాంటి భ్రమలు లేవంటూ తేల్చేశారని చెప్పారు. ఇండి కూటమి గెలిస్తే బంగ్లాదేశ్ నుంచి వలసలు పెరుగుతాయని, చొరబాటుదారులు చొచ్చుకువస్తారంటూ బీజేపీ తప్పుడు ప్రచారం చేసిందని, చొరబాటుదారులను నియంత్రించాల్సింది సరిహద్దుల్లోని బీఎస్ఎఫ్ అని, ఆ సంస్థ కేంద్ర ప్రభుత్వ అజమాయిషీ కింద ఉందన్నారు. బీజేపీ వైఫల్యం వల్లే చొరబాటుదారులు పెరుగుతున్నారని ఆరోపించారు. ఝార్ఖండ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా, ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెడతామని చెప్పారు. పేదల ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ఝార్ఖండ్ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తనకు పరిశీలకుడిగా, స్టార్ క్యాంపెయినర్‌గా కీలక బాధ్యతలు అప్పగించినందుకు రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు చెప్పారు.

ఝార్ఖండ్ విజయంలో భట్టి కీలక భూమిక

ఝార్ఖండ్ ఎన్నికల్లో ఇండి కూటమి విజయం సాధించడంలో భట్టి కీలక భూమిక పోషించారు. ఏఐసీసీ ద్వారా స్టార్ క్యాంపెయినర్‌గా, ఎన్నికల సీనియర్ పరిశీలకుడిగా నియమితులైన వెంటనే ఆయన రాష్ట్రానికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. మొదటి దశలో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీల మధ్య సీట్ల పంపకంలో క్రియాశీల పాత్ర పోషించారు. ఉమ్మడి ఎన్నికల ప్రచార వ్యూహం, కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారులో నిర్ణయాత్మకంగా వ్యవహరించారు. ఝార్ఖండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించి, సీనియర్ నేతలందరూ ప్రచారంలో పాల్గొనేలా చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, భట్టి కలిసి మ్యానిఫెస్టోను రూపొందించారు. రెండు దశల్లో జరిగిన ఎన్నికల్లో ఆయన ముమ్మరంగా ప్రచారం చేశారు. భారీ బహిరంగ సభలకన్నా బ్లాక్ స్థాయి సభలకు ప్రాధాన్యమిస్తూ స్థానిక నేతల్లో ఉత్సాహం నింపారు. 10రోజులపాటు జార్ఖండ్‌లో పర్యటిస్తూ ప్రచారం చేశారు.

ప్రియాంకకు మంత్రుల శుభాకాంక్షలు

కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానంలో జరిగిన ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ ఘన విజయం సాధించడంపై రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రియాంకకు శుభాకాంక్షలు తెలిపారు. ఉప ఎన్నికలతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అరంగేట్రం చేసిన ప్రియాంకకు.. అత్యధిక మెజారిటీతో వయనాడ్ ప్రజలు అమోఘమైన తీర్పునిచ్చారని కొనియాడారు.


మీడియాతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

రేవంత్ ప్రచారం పనిచేయలేదు

» కాంగ్రెస్ అబద్ధాలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం పనిచేయలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కోసం రేవంత్, తెలంగాణ ప్రజల నుంచి కోట్ల రూపాయలు వసూలుచేసి మహారాష్ట్ర పంపించినా.. అది కూడా పనిచేయలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అనేక రకాల తప్పుడు ప్రచారం చేసినా అక్కడి ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వంలోని డబుల్ ఇంజన్ సర్కార్‌కే అత్యధిక ఓట్లు, సీట్లతో మరోసారి పట్టం కట్టారని చెప్పారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'బీజేపీ వస్తే రిజర్వేషన్లు పోతాయని, మరాఠీలకు అన్యాయం జరుగుతందని లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేసి కొంత లబ్ధి పొందారు. కానీ, 5 నెలల్లోనే ప్రజలకు వాస్తవం అర్థమైంది. ఇంత పెద్ద విజయం అందించారని చెప్పారు. రాహుల్ చిలకపలుకులకు, రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని చేసుకుని అసత్య ప్రచారాలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదన్నారు. ప్రజాతీర్పును గౌరవించకుండా కాంగ్రెస్ నేతలు ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందంటూ విమర్శించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు.

కాంగ్రెస్ కుట్రలను గుర్తించారు: డీకే అరుణ

కాంగ్రెస్ కుట్రలు, తప్పుడు ప్రచారం మహారాష్ట్ర ఎన్నికల్లో పనిచేయలేదని బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టే సెంటిమెంట్ రాజకీయాలను కాంగ్రెస్ చేసిందని ఆమె ఆరోపించారు.

టీ కాంగ్రెస్‌కు 'మహా' నిరాశ

» మరాఠా గడ్డపై రేవంత్ విస్తృత ప్రచారం

» నియోజకవర్గాల్లో ఉత్తమ్, సీతక్క మకాం

» కాంగ్రెస్ ముఖ్య నేతలూ కార్యక్షేత్రంలోకి

» సరిహద్దు జిల్లాల్లోనూ మహాయుతిదే హవా

» పేరు మార్చినా.. పోటీకి నోచుకోని బీఆర్ఎస్

హైదరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు తెలంగాణ కాంగ్రెస్‌కు చేదు అనుభవాన్ని మిగిల్చాయి. సరిహద్దు రాష్ట్రం, అంతకుముందు హైదరాబాద్ రాష్ట్రంలో అంతర్భాగమైన ప్రాంతం, తెలంగాణతో అనుబంధం కలిగి ఉన్న రాష్ట్రం కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి మొదలుకుని టీపీసీసీ ముఖ్య నేతలంతా మహారాష్ట్రలో మకాం వేసి కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. అయితే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మహారాష్ట్రలో కాంగ్రెస్ 15 సీట్లకు పడిపోవడం టీపీసీసీ నేతలను తీవ్ర నిరాశకు గురి చేసింది. తెలంగాణ సరిహద్దు నియోజకవర్గాల్లోనూ పొరుగు సెంటిమెంటు ఏమాత్రం పనిచేయలేదు. ఆయా ప్రాంతాల్లో మహాయుతి నేతలే భారీ మెజారిటీలతో గెలుపొందారు. మహారాష్ట్ర ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి మూడు విడతల్లో ప్రచారం చేశారు. గుగ్గూస్, రాజూర, డిగ్రామ్, వార్ధా, సోలాపూర్, కడెగావ్, ధారావి, వర్లి తదితర నియోజకవర్గాల్లో తిరిగారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ, ఇతర పథకాలపై అక్కడి ప్రజలకు వివరించారు. తాను ప్రచారం చేసిన నియోజకవర్గాల అభివృద్ధి బాధ్యతను తీసుకుంటానని ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌పై బీజేపీ చేసిన ఆరోపణలను తిప్పి కొట్టారు. రేవంత్ ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో కడెగావ్, ధారావి, వర్లి స్థానాల్లో మహా వికాస్ అఘాడీ అభ్యర్థులు విజయం సాధించారు. ఇక ఏఐసీసీ పరిశీలకులుగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మరాఠ్వాడా ప్రాంతం, మంత్రి సీతక్క ఉత్తర మహారాష్ట్ర ప్రాంత బాధ్యతలను తీసుకున్నారు. ఇద్దరూ కలిసి 80కి పైగా నియోజకవర్గాల్లో పార్టీ నేతల మధ్య సమన్వయం, తిరుగుబాటు అభ్యర్థులను బుజ్జగించడం వంటివి చూసుకున్నారు. దాదాపు పది రోజుల పాటు మహారాష్ట్రలోనే మకాం వేసి అక్కడి వ్యవహారాలను చక్కదిద్దారు. ఆ రెండు ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమిపాలు కావడం మంత్రులను నిరుత్సాహపరిచింది. మరోవైపు, కొంత మంది కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు నియోజకవర్గాల వారీగా సమన్వయ బాధ్యతలు తీసుకుని.. పది రోజులు పని చేశారు. అయితే, ఎన్నికల ఫలితాలు వారినీ నిరాశపరిచాయి. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికే అత్యధికంగా సీట్లు రావడం, తెలంగాణతో అక్కడి ప్రజలకు ఉన్న బంధుత్వాలు ఎన్నికలను ప్రభావితం చేసే స్థాయిలో ఉండటంతో మహా వికాస్ అఘాడీకి మెరుగైన ఫలితాలే రావచ్చని పార్టీ నేతలు భావించారు. అయితే వారి అంచనాలను తలకిందులు చేస్తే అనూహ్య ఓటమి ఎదురైంది.

పోటీకి నోచుకోని బీఆర్ఎస్

జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించాలనే ఉద్దేశంతో టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చిన కేసీఆర్.. ప్రధానంగా మహారాష్ట్రలోనే పార్టీ విస్తరణపై దృష్టి పెట్టారు. ఆ రాష్ట్రంలో బీఆర్ఎస్ శాఖను ఏర్పాటు చేసి వివిధ పార్టీల నేతలను చేర్చుకున్నారు. తెలంగాణ సీఎం హోదాలో మహారాష్ట్రలో పర్యటించి పార్టీ కార్యకలాపాలను పెంచారు. అయితే తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలు కావడంతో.. మహారాష్ట్రలో ఆ పార్టీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. మహారాష్ట్రలో పాగా వేయాలని భావించిన బీఆర్ఎస్.. మొన్న లోక్‌సభ, తాజా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి కూడా నోచుకోలేకపోయింది.

రాష్ట్రంలో త్వరలో ప్రజా తిరుగుబాటు

కాంగ్రెస్ సర్కార్‌పై బీజేపీ యుద్ధం.. ఇక ఇండియా కూటమి ముక్కలే

» బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం

» కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్


కరీంనగర్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

కరీంనగర్/సిరిసిల్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తెలంగాణలో త్వరలో ప్రజా తిరుగుబాటు రానున్నదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయ ఆవరణలో శనివారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ యుద్ధం ప్రకటించబోతున్నదన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో మోదీ అభివృద్ధి మంత్రం పనిచేసిందన్నారు. కాంగ్రెస్ కూటమి ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా ప్రజలు నమ్మలేదన్నారు. భవిష్యత్తులో ఆ కూటమి ముక్కలు కావడం ఖాయమన్నారు. తెలంగాణలోనూ ఆ పార్టీలో లుకలుకలు మొదలు కాబోతున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టే అవసరం బీజేపీకి లేదని స్పష్టం చేశారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలే కూల్చుకుంటారన్నారు. ఇప్పటికైనా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తుందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చేపడుతున్న కులగణన పెద్ద బోగస్ అన్నారు. కేసీఆర్ సర్కార్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే రిపోర్టును ఇప్పటికైనా బయట పెట్టాలన్నారు. ఈవీఎంలపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ దారిలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నడుస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో రూ.23 కోట్ల కేంద్రం నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గతంలో సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో నిధులు ఇచ్చిందన్నారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని తమవిగా ప్రచారం చేసుకుందని, రాజకీయ వైషమ్యాలతో కుట్రలు చేసిందని విమర్శించారు. అంతకు ముందు గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటలో పురాతన దేవాలయంలో ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

ఇక తెలంగాణపై కమలం గురి!

తొలుత జీహెచ్ఎంసీ పీఠంపై నజర్.. పార్టీ సంస్థాగత బలోపేతంపై ప్రత్యేక దృష్టి

» ఆపై 'ఆపరేషన్ ఆకర్ష్'పై కమలం దృష్టి!

» రేవంత్ సర్కారు లక్ష్యంగా కార్యాచరణ

» హామీల అమలులో వైఫల్యంపై జనంలోకి..

హైదరాబాద్/న్యూఢిల్లీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన నేపథ్యంలో బీజేపీ ఇక తెలంగాణపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకోవడంతోపాటు రాజకీయ వ్యూహాలకూ పదును పెట్టే యోచనలో ఉంది. దక్షిణాదికి తెలంగాణను గేట్‌వేగా భావిస్తున్న బీజేపీ అగ్రనాయకత్వం.. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో ఉంది. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే అంతర్గత కార్యాచరణ అమలు చేస్తోంది. తాజాగా మహారాష్ట్ర ఫలితాల జోష్‌ను తెలంగాణలో కొనసాగించేందుకు సమాయత్తమవుతోందని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. ఇందులో భాగంగా పార్టీని సంస్థాగత బలోపేతం చేయాలని, జీహెచ్ఎంసీతో పాటు ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని రాష్ట్ర పార్టీని జాతీయ నాయకత్వం ఆదేశించింది. జీహెచ్ఎంసీ ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం వచ్చే ఏడాది డిసెంబరులో పూర్తవుతున్న దృష్ట్యా.. ఈసారి పీఠం కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో రాష్ట్ర పార్టీ నాయకత్వం కసరత్తు చేస్తోంది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు సాధించి మేయర్ పీఠానికి అతి చేరువలోకి వచ్చి నిలిచిపోయిన బీజేపీ.. ఈసారి రాజధానిలో సత్తా చాటాలని, తద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు మరింత బలపడాలని భావిస్తోంది. ఇందులో భాగంగా స్థానిక పార్టీ ముఖ్యులు, కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. గ్రేటర్ పరిధిలోని అన్ని డివిజన్లలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని, ప్రజా సమస్యలపై పోరాటాలను విస్తృతం చేయాలని నిర్దేశించింది. వీటితోపాటు ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో విస్తృతంగా ఎండగట్టేలా దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందిస్తున్నామని పార్టీ ముఖ్యనేత ఒకరు తెలిపారు.

కొత్త అధ్యక్షుడిపై ఆచితూచి నిర్ణయం..

రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడి నియామకం విషయంలో జాతీయ నాయకత్వం ఆచితూచి నిర్ణయం తీసుకుంటుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. క్యాడర్‌లో ఉత్సాహం తీసుకురావడంతోపాటు ముఖ్యనేతలను సమన్వయం చేసుకోవడం, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ.. బీఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వకుండా అధికార పార్టీకి ప్రత్యామ్నాయం తామేనని ప్రజల్లో విశ్వాసం కల్పించే నాయకుడు అవసరమన్న భావనలో ఉన్నట్లు చెబుతున్నాయి. ఈ దిశగా అభిప్రాయ సేకరణ కూడా జరిగిందని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. వచ్చే నెలాఖరు లేదా జనవరి మొదటి వారంలో కొత్త అధ్యక్షుడిని నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కొత్త అధ్యక్షుడి నియామకం తరువాత రాష్ట్రంలో బీజేపీ దూకుడు మరింత పెంచుతుందని, ఇతర పార్టీల నుంచి ముఖ్యమైన నేతలను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తుందని కమలం వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అసంతృప్తితో ఉన్నవారిపై 'ఆపరేషన్ ఆకర్ష్'ను ప్రయోగించే ప్రయత్నం చేస్తుందని అంటున్నాయి. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బలహీనపరచడమే లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతుందని చెబుతున్నాయి. ఈ మేరకు ఈటల రాజేందర్‌తోపాటు పలువురు తెలంగాణ నేతలు ఇప్పటికే ఢిల్లీలో పార్టీ పెద్దలతో భావి కార్యాచరణపై చర్చించినట్లు తెలిసింది. డిసెంబరు మొదటి వారంలోగా పార్టీలో మార్పులు, చేర్పులు జరుగుతాయని ఈ సందర్భంగా వారికి అగ్ర నాయకత్వం సూచనప్రాయంగా చెప్పినట్లు సమాచారం.

కర్ణాటకపైనా స్పెషల్ ఫోకస్..

కర్ణాటకలో ఉప ఎన్నికలు జరిగిన మూడు స్థానాలనూ కాంగ్రెస్ పార్టీయే గెలుచుకోవడంతో.. ఆ రాష్ట్రంలో బీజేపీ తన భవిష్యత్తుపై తీవ్రంగా ఆలోచించాల్సిన సమయం వచ్చిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా మాజీ సీఎం యడ్యూరప్ప కుమారుడు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్రను తక్షణం మార్చాల్సిన అవసరం ఉందంటున్నాయి. ఆయనకు వ్యతిరేకంగా ఇప్పటికే పార్టీలో తీవ్ర అసంతృప్తి ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ నేతలు బసన్నగౌడ పాటిల్ యత్నాల్, రమేశ్ జర్కోలితోపాటు పది మంది ఎమ్మెల్యేలు ఇప్పటికే యడ్యూరప్ప వర్గంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నాయి.



రేవంత్ అబద్ధపు ప్రచారాల్ని మరాఠా ప్రజలు నమ్మలేదు


"రేవంత్ అబద్ధపు ప్రచారాల్ని మరాఠా ప్రజలు నమ్మలేదు. ఏడాది క్రితం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ఆయన దృష్టి పెట్టాలి. కాంగ్రెస్ చేతగానీ, అసమర్థత కారణంగానే బీజేపీ మనుగడ కొనసాగుతోంది. బీజేపీకి బలమైన ప్రతిపక్షంగానూ నిలువలేని దుస్థితిలో కాంగ్రెస్ ఉంది. దేశ భవిష్యత్తుకు ప్రాంతీయ పార్టీలే బలమైన పునాదులు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల ఫలితాలతో ఈ విషయం తేలిపోయింది. బలమైన ప్రతిపక్షంగా కూడా నిలవలేని కాంగ్రెస్ దేశంలో ప్రాంతీయ పార్టీలను లేకుండా చేయాలని చూస్తోంది. ఇందులో బీజేపీ కూడా తక్కువ కాదు. ప్రాంతీయ పార్టీలు బలంగా లేని ప్రాంతాల్లోనే బీజేపీ గెలుస్తోంది."

\- కేటీఆర్

మహారాష్ట్రలో కాంగ్రెస్ గ్యారెంటీల గారడీ విఫలం

"ఐదు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ చేసిన గారడీని మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదు. తెలంగాణలో కాంగ్రెస్ మోసాలను మహారాష్ట్ర ప్రజలు గుర్తించి గుణపాఠం చెప్పారు. తెలంగాణలో మహిళలకు రూ. 2,500 ఇస్తామన్న మహాలక్ష్మి పథకం అమలు చేయకుండా మహారాష్ట్రలో రూ.3,000 ఇస్తామనడం, రైతు భరోసా ఎగ్గొట్టడం, ఆసరా అమలు చేయకపోవడం, ఏడాది గడుస్తున్నా రైతు రుణమాఫీ పూర్తి చేయకపోవడం వంటివి మహారాష్ట్రలో తీవ్ర ప్రభావం చూపాయి. బీజేపీ హేమంత్ సోరెన్‌పై పెట్టిన అక్రమ కేసులు, అరెస్టులు, పార్టీ చీల్చే ప్రయత్నాలను ఝార్ఖండ్ ప్రజలు తిప్పి కొట్టారు. బీజేపీ కక్ష సాధింపు విధానాల్ని ప్రజలు హర్షించడంలేదని తేలిపోయింది. ఝార్ఖండ్‌లో గెలిచిన హేమంత్ సోరెన్‌కు శుభాకాంక్షలు"

\- హరీశ్ రావు





డాక్యుమెంటరీగా బావుంటుందేమో



'నాన్నగారి బయోపిక్ గురించి తరచూ చర్చ జరుగుతూనే ఉంది. ఆయన జీవిత గాథను సినిమాగా కన్నా డాక్యుమెంటరీగా తీస్తే బాగుంటుందేమో' అని అక్కినేని నాగార్జున అభిప్రాయపడ్డారు. గోవాలోని పణజీలో జరుగుతున్న భారత అంతర్జాతీయ చిత్రోత్సవం (ఇఫీ)లో నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అక్కినేని నాగేశ్వరరావు శతాబ్ది వేడుకల్లో ఆయన మాట్లాడుతూ 'నాన్నగారి జీవితాన్ని సినిమాగా రూపొందించాలంటే చాలా కష్టం. నటుడిగా ఆయన జీవితంలో వెనకడుగు లేదు. అలాంటి దాన్ని తెరపైన చూపాలంటే బోర్ కొడుతుందేమో! ఒడిదొడుకులు చూపిస్తేనే సినిమా బాగుంటుంది. అందుకే ఆయన జీవిత కథకు కొంత కాల్పనికతను జోడించి డాక్యుమెంటరీగా రూపొందించాలి' అని చెప్పారు. 'ఆయన సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చారు. తన సినీ ప్రయాణంలో ఎన్నో చేదు అనుభవాలు ఎదుర్కొన్నారు. తొలినాళ్లలో స్త్రీ పాత్రలు పోషించినప్పుడు ఎంతో మంది హేళనకు గురయ్యారు. ఓసారి ఆ బాధతో మెరీనా బీచ్‌కు వెళ్లి సముద్రంలో దూకి చనిపోవాలనుకున్నారట. కానీ అవమానాలను విజయ సోపానంగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఎన్నో క్లిష్టమైన పాత్రల్లో నటించి ప్రేక్షకుల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సొంతం చేసుకున్నారు' అని అన్నారు.

వాళ్లిద్దరినీ నేనే కలిపానేమో

నాగ చైతన్య, శోభిత ధూళిపాళ్ల ప్రేమ గురించి నాగార్జున మాట్లాడుతూ 'శోభిత అద్భుతమైన నటి, ఓ సినిమాలో ఆమె నటన బాగా నచ్చి, ఫోన్ చేసి అభినందించా. నా ఆహ్వానం మేరకు తను ఓ సారి మా ఇంటికి వచ్చింది. సినిమాలతో పాటు జీవితానికి సంబంధించిన ఎన్నో విషయాల గురించి మేం మాట్లాడుకుంటూ ఉన్న సమయంలో చైతన్య అక్కడకు వచ్చాడు. అప్పుడే వారిద్దరికి తొలిపరిచయం ఏర్పడింది. అలా వారిద్దరూ ఒకరినొకరు ఇష్టపడడానికి నేనే కారణమయ్యానేమో' అని చెప్పారు. 'డిసెంబరు 4న అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరగనున్న పెళ్లి వేడుకకు కుటుంబ సభ్యులు, సన్నిహితులు కొద్దిమందినే ఆహ్వానిస్తున్నాం. చైతూ, శోభిత పెళ్లి పనులను దగ్గరుండి చూసుకుంటున్నారు'అని చెప్పారు.

పౌరాణిక నేపథ్యంలో...



నాగచైతన్య తను నటించబోయే కొత్త సినిమాను ప్రకటించారు. శనివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. 'ఎన్‌సీ 24' వర్కింగ్ టైటిల్‌తో.. పౌరాణిక నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. కార్తీక్ దండు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో నాగ చైతన్య హీరోగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బేనర్‌పై బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. పవర్ ప్యాక్డ్ యాక్షన్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. తుపానులో ఓడపై చేతిలో యాంకర్ పట్టుకుని నాగ చైతన్య కనిపించారు.



సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్, ఆయన బృంద సభ్యురాలు మోహినీ దే ఇద్దరూ ఒకేసారి జీవిత భాగస్వాముల నుంచి విడిపోతున్నట్లు ప్రకటించడం, వారిద్దరి మధ్య ఏదో నడుస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం అవడం తెలిసిందే. ఇప్పటికే రెహమాన్ భార్య సైరాబాను లాయర్ వందన షా ఈ ప్రచారాన్ని ఖండించగా తాజాగా మోహినీ దే కూడా స్పందించారు.

ఏం అడగాలనుకుంటున్నారో నాకు తెలుసు

"నా విడాకుల ప్రకటన తర్వాత ఇంటర్వ్యూ కోసం చాలా మంది నుంచి వరుసగా ఫోన్ కాల్స్, మెసేజెస్ వస్తున్నాయి. అందరూ నన్ను ఇంటర్వ్యూలో ఏం అడగాలనుకుంటున్నారో నాకు తెలుసు. నేను వారి అభ్యర్థనను సున్నితంగా తిరస్కరిస్తున్నాను. నాకున్న శక్తిని.. సమయాన్ని వదంతుల కోసం కేటాయించలేను. నా వ్యక్తిగత గోప్యతను అందరూ గౌరవిస్తారని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు.

పరువు నష్టం దావా వేస్తాం

తన వ్యక్తిగత జీవితం గురించి తప్పుడు వార్తలను వ్యాప్తిచేస్తున్న వారిపై ఏఆర్ రెహమాన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి దుష్ప్రచారం ఆపకపోతే పరువునష్టం దావా వేస్తామని ఆయన తరపు న్యాయవాది నర్మదా సంపత్ హెచ్చరించారు. "సోషల్ మీడియాలో కొందరు రెహమాన్ దంపతుల వ్యక్తిగత జీవితాలపై కల్పిత కథనాలను ప్రసారం చేస్తున్నారు. వారి విడాకుల అంశంపై పరిశ్రమలోని ఇతర వ్యక్తుల నుంచి అభిప్రాయాలను సేకరించి ఆ వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. ఇదంతా అనవసరం" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రసారమవుతున్న కంటెంట్‌లో ఏమాత్రం నిజం లేదని, రెహమాన్ పేరు ప్రతిష్ఠలకు, గౌరవానికి భంగం కలిగించేందుకే ఈ తరహా చీప్ పబ్లిసిటీ చేస్తున్నారని అన్నారు. వాటిని తొలగించేందుకు 24 గంటల సమయం ఇస్తున్నామని స్పష్టం చేశారు. గడువులోగా తొలగించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు పరువునష్టం దావా కూడా వేస్తామని పేర్కొన్నారు.



ఒకరు మోసం చేశారు.. మరొకరు సినిమాలు మానుకోమన్నారు



"నా తొలి ప్రేమ పూర్తిగా నమ్మకంపైనే నడిచింది. నేనో వ్యక్తిని మనస్ఫూర్తిగా ప్రేమించాను. అతను కూడా నన్ను అలానే ప్రేమిస్తున్నాడని అనుకున్నా. కానీ అది నిజం కాదని తర్వాత తెలిసింది. ఆ తర్వాత మరో వ్యక్తితో ప్రేమలో పడ్డాను. అయితే ఆయన ఏకంగా నన్ను సినిమాల నుంచే వైదొలగాలని షరతు పెట్టాడు. అందుకు అంగీకరించినా మా బంధం ముందుకు వెళ్లలేదు' అని నయనతార చెప్పారు. 'బియాండ్ ద ఫేరీ టేల్' డాక్యుమెంటరీతో ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చారు నయనతార. గతంలో తన విఫల ప్రేమ గురించి ఈ డాక్యుమెంటరీలో ఆమె తొలిసారి స్పందించారు. 'నా ప్రేమ వ్యవహారాల్లో అసలేం జరిగింది అనేది నేను బయటపెట్టకపోవడంతో నా వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఎవరికి తోచినట్లు వారు రాశారు. సమాజం అబ్బాయిల్ని ప్రశ్నించకుండా నన్ను మాత్రమే ఎందుకు ప్రశ్నిస్తోంది? బహుశా నేను మనుషులను అతిగా నమ్మాననుకుంటా" అని నయనతార పేర్కొన్నారు. అయితే తన మాజీ ప్రియుల పేర్లను మాత్రం నయనతార వెల్లడించలేదు. ఇదే డాక్యుమెంటరీలో నాగార్జున మాట్లాడుతూ "బాస్' సినిమా షూటింగ్ సమయంలో నయనతార ఫోన్ మోగితే చాలు.. చాలా డల్ అయిపోయేవారు" అని చెప్పారు.







పంత్ ఎంత పలికేనో?



నేడు, రేపు ఐపీఎల్ మెగా వేలం

రాహుల్, శ్రేయాస్, సిరాజ్‌పైనా ఫ్రాంచైజీల కన్ను

మ. 3.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

జెడ్డా: ఐపీఎల్ మెగా వేలానికి అంతా సిద్ధం. సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో ఆదివారం, సోమవారం ఈ కార్యక్రమం జరగనుంది. అయితే ఈసారి వేలం అత్యంత ఆసక్తిగా ఉండనుంది. ఎందుకంటే లీగ్‌లోని పది ఫ్రాంచైజీల దగ్గర ఇప్పుడు గరిష్ఠంగా ఆరుగురు చొప్పున మాత్రమే అందుబాటులో ఉన్నారు. పంజాబ్ ఇద్దరిని, ఆర్సీబీ ముగ్గుర్ని మాత్రమే అట్టిపెట్టుకుంది. దాదాపు అన్ని జట్లు ప్రధాన ఆటగాళ్లను రిటైన్ చేసుకొని మిగతావాళ్లను వదిలేయడంతో వేలంలో హోరాహోరీ బిడ్డింగ్ తప్పదనిపిస్తోంది. ఢిల్లీ, లఖ్‌నవూ, కోల్‌కతా కెప్టెన్లు కూడా ఈ వేలంలో ఉండడం విశేషం. దీంతో జట్లన్నీ కూడా సరికొత్త రూపు లతో వచ్చే ఏడాది ఐపీఎల్‌ను ఆరంభిస్తాయి.


శ్రేయాస్

577 మంది.. 204 స్లాట్లు

వేలంలో మొత్తం 577 మంది ఆటగాళ్లు పోటీలో ఉన్నారు. అయితే వీరిలో 204 మందినే ఫ్రాంచైజీలు తీసుకుంటాయి. ఇందుకోసం పదిజట్లు రూ. 641.50 కోట్లు వెచ్చించనున్నాయి. ఇక, రూ.2 కోట్ల గరిష్ఠ ధరతో 81 మంది క్రికెటర్లు అందుబాటులో ఉన్నారు. ప్రతీజట్టులో అత్యధికంగా 25 మంది, కనీసం 18 మంది ఆటగాళ్లుండాలి. ఇప్పటికే అన్నిజట్లు కలిపి 46 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకున్నాయి. అత్యధికంగా పంజాబ్‌కు రూ.110.50 కోట్లు, అత్యల్పంగా రాజస్థాన్‌కు రూ.41 కోట్లు ఉన్నాయి.

పాతిక కోట్లు ఖాయం?

పిచ్‌తో పనిలేదు.. బౌలర్‌తో పట్టింపు లేదు.. ఫార్మాట్ ఏదైనా విధ్వంసకర బ్యాటింగ్‌తో, వైవిధ్యమైన షాట్లతో మైదానాలను హోరెత్తించే రిషభ్ పంత్ ఈసారి వేలంలో ఉండడంతో సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది. ఇంతటి విలువైన బ్యాటర్‌ను ఏ జట్టు.. ఎంత మొత్తం వెచ్చించి దక్కించుకుంటుందోనని అంతా ఎదురుచూస్తున్నారు. కచ్చితంగా రూ.25 నుంచి 30 కోట్ల మధ్య అతడి రేటు ఉంటుందన్నది అంచనా. ఇంత మొత్తం వెచ్చించాలంటే పంజాబ్ కింగ్స్ వల్లే అవుతుందన్నది అందరి భావన. ఈ జట్టుకు కెప్టెన్ కూడా అవసరమే. పైగా ఆ జట్టు కోచ్ పాంటింగ్‌తో పంత్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. పంత్ కోసం బెంగళూరు (రూ.83 కోట్లు) కూడా ప్రయత్నించొచ్చు. చెన్నై, ముంబై దగ్గర కనీసం రూ.50 కోట్లు కూడా లేకపోవడంతో పంత్ వైపు దృష్టి సారించకపోవచ్చు.

వీరిపైనా కనకవర్షమే!

లఖ్‌నవూ, కోల్‌కతా, బెంగళూరు, పంజాబ్, ఢిల్లీ జట్లకు కెప్టెన్లు అవసరం. దీంతో సరైన నాయకుడి కోసం ఈ ఫ్రాంచైజీలు తీవ్రంగా ప్రయత్నిస్తాయి. అందుకే శ్రేయాస్ అయ్యర్‌ను ఢిల్లీ తీసుకుని పగ్గాలు అప్పగించే చాన్సుంది. అలాగే రాహుల్‌పై బెంగళూరు మొగ్గు చూపొచ్చు. ఈ ఇద్దరికీ వేలంలో రికార్డు ధర లభించవచ్చు. భారత్ నుంచి ఇషాన్, జితేశ్, అశుతోష్, పేసర్లు అర్ష్‌దీప్, సిరాజ్, షమి, ఖలీల్, అవేశ్, హర్షల్, దీపక్ చాహర్, స్పిన్నర్ చాహల్‌తో పాటు విదేశీ ఆటగాళ్లలో బట్లర్, స్టార్క్, మ్యాక్స్‌వెల్, మెక్‌గుర్క్, లివింగ్‌స్టోన్, డుప్లెసీ, రబాడ, కర్రాన్, సాల్ట్‌ల కోసం పోటీ నెలకొనే అవకాశముంది.


సిరాజ్

ఫేవరెట్ గుకేష్

లిరెన్‌తో పోరు
రేపటి నుంచే వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్



సింగపూర్: చెస్ ప్రపంచంలో రసవత్తర పోటీకి రంగం సిద్ధమైంది. విశ్వవిజేతను తేల్చే సమరంలో భారత చిచ్చరపిడుగు, 18 ఏళ్ల గుకేష్, చైనాకు చెందిన 32 ఏళ్ల డింగ్ లిరెన్‌ను ఢీకొననున్నాడు. ఈ 14రౌండ్ల క్లాసికల్ గేమ్‌ల ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్ సోమవారం మొదలవనుంది. తొలుత 7.5 పాయింట్లు సాధించిన ఆటగాడికి ప్రపంచ కిరీటం దక్కుతుంది. టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 21 కోట్లు. ఫలితం టైబ్రేక్‌కు వెళ్తే విజేతకు రూ.10.97 కోట్లు, రన్నరప్‌కు రూ. 10.13 కోట్ల ప్రైజ్‌మనీ లభిస్తుంది. 138 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో ఇద్దరు ఆసియా ఆటగాళ్లు తలపడుతుండడం ఇదే తొలిసారి. గుకేష్‌ను టోర్నీ ఫేవరెట్ అన్నది చెస్ పండితుల అంచనా. నిరుడు ప్రపంచ టైటిల్ గెలిచాక లిరెన్ ఫామ్ దిగజారింది. దాంతో వరల్డ్ ర్యాంకుల్లో అతను 23వ స్థానానికి పడిపోయాడు. మరోవైపు గుకేష్ ఐదో ర్యాంక్‌కు ఎగబాకడం విశేషం. అంతేకాదు.. గుకేష్ క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలవడం ద్వారానే లిరెన్‌తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ పోరుకు అర్హత సాధించాడు.

కంగారూలు చిక్కినట్టేనా!

భారత్ రెండో ఇన్నింగ్స్ 172/0


కేఎల్ రాహుల్ (62 బ్యాటింగ్)

మొత్తం ఆధిక్యం 218 పరుగులు

జైస్వాల్, రాహుల్ అదుర్స్ ● ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 104


యశస్వి జైస్వాల్ (90 బ్యాటింగ్)

1 2000 సంవత్సరం తర్వాత ఆస్ట్రేలియాలో అత్యధికంగా 57 ఓవర్లు క్రీజులో నిలిచిన జోడీగా జైస్వాల్-రాహుల్. 2001లో క్యాంప్‌బెల్-హిండ్స్ 53.5 ఓవర్ల పాటు ఆసీస్ బౌలర్లను ఎదుర్కొన్నారు.

ఓ క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన బ్యాటర్‌గా జైస్వాల్ (34). న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్ (33)ను అధిగమించాడు.

2 ఆసీస్ గడ్డపై వరుసగా రెండు సెషన్లు బ్యాటింగ్ చేసిన రెండో భారత జోడీగా జైస్వాల్-రాహుల్. 2018లో మెల్‌బోర్న్‌లో కోహ్లీ-పుజార ఈ ఫీట్ సాధించారు.

పెర్త్: తడ'బ్యాటు'తో మొదలైన టెస్ట్‌లో.. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (90 బ్యాటింగ్), కేఎల్ రాహుల్ (62 బ్యాటింగ్) పటిష్ఠమైన డిఫెన్స్‌తో ఎదురునిలిచారు. దీంతో ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్‌లో భారత్ అనూహ్యంగా పట్టుబిగించింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 67/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 104 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ స్టార్క్ (26), క్యారీ (21) కాసేపు ప్రతిఘటించారు. బుమ్రా 5 వికెట్లు, హర్షిత్ రాణా 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం 46 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్ శనివారం ఆటముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 172 పరుగులు చేసింది. మొత్తంగా 218 పరుగుల ఆధిక్యం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 150 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

తెరదించిన హర్షిత్: స్టార్క్ పోరాటంతో ఆసీస్ స్కోరు సెంచరీ మార్క్ దాటింది. జోష్ మీదున్న బుమ్రా రెండో ఓవర్‌లోనే ఓవర్‌నైట్ బ్యాటర్ క్యారీని అవుట్ చేశాడు. కానీ, స్టార్క్, హాజెల్‌వుడ్ (7 నాటౌట్) బౌలర్లను విసిగిస్తూ పదో వికెట్‌కు 25 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. లియోన్ (5), స్టార్క్‌ను అవుట్ చేసిన హర్షిత్.. కంగారూ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

అసలుసిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో..: ఎన్నో అనుమానాల మధ్య రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన జైస్వాల్, రాహుల్ తొలి వికెట్‌కు అజేయంగా 172 పరుగుల భాగస్వామ్యంతో ఆట తీరును పూర్తిగా మార్చేశారు. ఆసీస్ సహనాన్ని పరీక్షించారు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన జైస్వాల్ ఈసారి సమయస్ఫూర్తితో పాటు చక్కని షాట్లతో చెలరేగగా.. రాహుల్ కచ్చితమైన సాంకేతిక నైపుణ్యంతో ఎదురు నిలిచాడు. వీరిద్దరూ మంచి బంతులను గౌరవిస్తూనే.. గతితప్పిన బంతులను బౌండ్రీ దాటించారు. క్రమంగా బంతి పాతబడడంతోపాటు పిచ్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడంతో వీరి పని మరింత సులువైంది. సమన్వయ లోపంతో రాహుల్ రనౌట్ ప్రమాదాన్ని తప్పించుకోవడం మినహా.. వీరిద్దరూ ఆసీస్ బౌలర్లకు ఏమాత్రం చాన్సులివ్వలేదు. షాట్లు ఆడే జైస్వాల్ కొంత సంయమనంతో వ్యవహరించాడు. అతడిని బోల్తా కొట్టించడానికి కమిన్స్ చేసిన బౌలింగ్ మార్పులు, ఎత్తులు ఏమాత్రం పారలేదు. దీంతో టీ సమయానికి భారత్ 84/0తో నిలిచింది. బ్రేక్ తర్వాత కూడా టీమిండియా ఓపెనర్లు ఏమాత్రం దూకుడు కనబర్చకుండా నింపాదిగా ఆడారు. 38వ ఓవర్‌లో లియోన్ బౌలింగ్‌లో జైస్వాల్ సింగిల్‌తో హాఫ్ సెంచరీ చేయగా.. జట్టు స్కోరు కూడా సెంచరీ మార్క్ దాటింది. యశస్వి క్రమంగా వేగం పెంచారు. స్టార్క్ బౌలింగ్‌లో జైస్వాల్ సిక్స్ బాదగా.. ఫోర్ కొట్టిన రాహుల్ ఆ తర్వాత ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. చివరి సెషన్‌లో కూడా వికెట్ చేజార్చుకోకుండా రోజును మెరుగ్గా ముగించారు.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 150 ఆలౌట్.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఖవాజా (సి) విరాట్ (బి) బుమ్రా 8; మెక్‌స్వీనే (ఎల్బీ) బుమ్రా 10; లబుషేన్ (ఎల్బీ) సిరాజ్ 2; స్మిత్(ఎల్బీ) బుమ్రా 0; హెడ్ (బి) హర్షిత్ 11; మార్ష్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 6; క్యారీ (సి) పంత్ (బి) బుమ్రా 21; కమిన్స్ (సి) పంత్ (బి) బుమ్రా 3; స్టార్క్ (సి) పంత్ (బి) హర్షిత్ 26; లియోన్ (సి) రాహుల్ (బి) హర్షిత్ 5; హాజెల్‌వుడ్ (నాటౌట్) 7; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 51.2 ఓవర్లలో 104 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-14, 2-19, 3-19, 4-31, 5-38, 6-47, 7-59, 8-70, 9-79; **బౌలింగ్:** బుమ్రా 18-6-30-5; సిరాజ్ 13-7-20-2; హర్షిత్ 15.2-3-48-3; నితీశ్ 3-0-4-0; సుందర్ 2-1-1-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (బ్యాటింగ్) 90; రాహుల్ (బ్యాటింగ్) 62; **ఎక్స్‌ట్రాలు: 20; మొత్తం: 57 ఓవర్లలో 172/0; బౌలింగ్:** స్టార్క్ 12-2-43-0; హాజెల్‌వుడ్ 10-5-9-0; కమిన్స్ 13-2-44-0; మార్ష్ 6-0-27-0; లియోన్ 13-3-28-0; లబుషేన్ 2-0-2-0; హెడ్ 1-0-8-0.

తిలక్ హ్యాట్రిక్ శతకం



రాజ్‌కోట్: టీ20 ఫార్మాట్‌లో తిలక్ వర్మ అదరగొట్టే ఫామ్‌తో దూసుకెళ్తున్నాడు. చరిత్రలో మరెవరికీ సాధ్యంకాని రీతిలో అతడు వరుసగా మూడో శతకం బాదడం విశేషం. ఇటీవల దక్షిణాఫ్రికా పర్యటనలో చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ సెంచరీలు సాధించిన తిలక్.. తాజాగా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ శతక్కొట్టాడు. శనివారం మేఘాలయతో జరిగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ కెప్టెన్ తిలక్ 151 పరుగులు సాధించాడు. ఈ ట్రోఫీలో అత్యధిక వ్యక్తిగత స్కోరుతో నిలిచిన శ్రేయాస్ అయ్యర్ (147) రికార్డును కూడా తిలక్ అధిగమించాడు. అంతేకాకుండా పొట్టి ఫార్మాట్‌లో భారత పురుషుల క్రికెట్‌లో తిలక్ మాత్రమే 150+ స్కోరు దాటాడు. కెప్టెన్ జోరుతో హైదరాబాద్ ఈ మ్యాచ్‌లో 179 పరుగులతో నెగ్గింది. ముందుగా హైదరాబాద్ 248/4 స్కోరు సాధించగా, ఛేదనలో మేఘాలయ 69 రన్స్‌కే కుప్పకూలింది.

శ్రేయాస్ సెంచరీ: ఐపీఎల్ వేలానికి ముందు ముంబై కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ శతకంతో ఫామ్ నిరూపించుకున్నాడు. ముస్తాక్ అలీ టోర్నీ గ్రూప్ 'ఇ'లో గోవాతో మ్యాచ్‌లో అయ్యర్ 57 బంతుల్లో 130 రన్స్ చేసి ముంబై విజయంలో కీలకపాత్ర పోషించాడు.

సాత్విక్ జోడీ పరాజయం

షెన్‌జెన్ (చైనా): డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టికి చైనా మాస్టర్స్ టోర్నీలో నిరాశ ఎదురైంది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత తొలిసారి బరిలోకి దిగిన సాత్విక్ జంట ఈ టోర్నీ ఫైనల్ చేరడంలో విఫలమైంది. శనివారం జరిగిన సెమీఫైనల్లో సాత్విక్/చిరాగ్ ద్వయం 18-21, 21-14, 16-21తో కొరియాకు చెందిన అన్‌సీడెడ్ జోడీ జిన్ యాంగ్/సియో సెంగ్ జె చేతిలో పరాజయం పాలైంది.

టైటాన్స్‌కు చుక్కెదురు

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్‌కు చుక్కెదురైంది. శనివారం జరిగిన పోరులో గుజరాత్ జెయింట్స్ 31-28తో టైటాన్స్‌ను చిత్తుచేసింది. టోర్నీలో ఇప్పటిదాకా 13 మ్యాచ్‌లాడిన టైటాన్స్‌కు ఇది ఐదో ఓటమి. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 43-30తో జైపూర్ పింక్‌పాంథర్స్‌పై గెలిచింది.

బిజినెస్

అంతర్జాతీయ ఫార్మా సంస్థతో అరబిందో ఫార్మా జట్టు


శ్వాసకోశ సంబంధిత ఔషధాల అభివృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): శ్వాసకోశ సంబంధిత ఔషధాల అభివృద్ధికి అంతర్జాతీయ ఫార్మా సంస్థతో జట్టు కట్టినట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. ఈ మేరకు అనుబంధ సంస్థ అరబిందో ఫార్మా యూఎస్ఏ ఇంక్. సదరు సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. అయితే అంతర్జాతీయ ఫార్మా సంస్థ పేరు మాత్రం కంపెనీ వెల్లడించలేదు. ఒప్పందంలో భాగంగా శ్వాస సంబంధిత ఉత్పత్తుల అభివృద్ధి, కమర్షియలైజేషన్‌ను చేపట్టనున్నట్లు అరబిందో ఫార్మా పేర్కొంది. ఈ ఒప్పంద కాలపరిమితి తొలుత మూడు నుంచి ఐదేళ్ల వరకు ఉండే అవకాశం ఉందని తెలిపింది. అంతేకాకుండా అభివృద్ధి చేసిన ఔషధాలను భాగస్వామ్య సంస్థకు చెందిన ప్లాంట్‌లో ఉత్పత్తి చేయటంతో పాటు ఇరు సంస్థలు సంయుక్తంగా ఈ ఉత్పత్తులను వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకురానున్నాయని అరబిందో ఫార్మా తెలిపింది.

మార్కెట్‌కు 'మహా' జోష్!

సోమవారం సూచీలు మరింత ఎగబాకే చాన్స్


ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ నేతృత్వ మహాయుతి కూటమి సాధించిన ఘన విజయం స్టాక్ మార్కెట్ వర్గాల్లోనూ నూతన ఉత్తేజాన్ని నింపనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. సెన్సెక్స్, నిఫ్టీ శుక్రవారం 2 శాతం మేర ఎగబాకాయి. మహా ఎన్నికల్లో బీజేపీ కూటమి గెలవచ్చన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలూ ఇందుకు ఒక కారణం. కాగా, బీజేపీ కూటమి ఆ అంచనాలను సైతం మించి భారీ మెజారిటీతో గెలవడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరచనుందని, సోమవారం ట్రేడింగ్‌లో సూచీలు మళ్లీ ర్యాలీ తీయవచ్చని ఈక్విటీ నిపుణులు అంటున్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,640 ▲	73,000 ▲	1,01,000 ▲
ముంబై	77,787 ▲	71,253 ▲	90,850 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	575	విజయవాడ	590
వరంగల్	577	గోదావరి	590
చిత్తూరు	593	విశాఖపట్నం	580
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	108
వరంగల్	107	గుంటూరు	103
కరీంనగర్	107	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	87
కర్నూలు	107	నెల్లూరు	87
విశాఖపట్నం	120	అనంతపురం	87
గోదావరి	108		

2030 నాటికి రూ.3.38 లక్షల కోట్లు

భారత క్విక్ కామర్స్ మార్కెట్‌పై దాతుమ్ ఇంటెలిజెన్స్ అంచనా



న్యూఢిల్లీ: దేశంలోని ప్రధాన నగరాల్లో క్విక్ కామర్స్ సేవలకు గిరాకీ వేగంగా పెరుగుతోంది. వినియోగదారులు తమ ఇంటి దగ్గర్లోని కిరాణా దుకాణానికి వెళ్లి తెచ్చుకోగలిగేంత తక్కువ సమయంలోనే క్విక్ కామర్స్ కంపెనీలు ఆ సరుకులను ఇంటి వద్దకే డెలివరీ చేస్తున్నాయి. పైగా డిస్కౌంట్లూ ఆఫర్ చేస్తున్నాయి. దాంతో క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఆర్డర్ చేసే కస్టమర్ల సంఖ్య రోజురోజుకీ పెరుగుతూపోతోంది. 2024లో 610 కోట్ల డాలర్ల (రూ.51,484 కోట్లు) స్థాయికి చేరనున్న దేశీయ క్విక్‌కామర్స్ మార్కెట్.. 2030 నాటికి 4,000 కోట్ల డాలర్ల (రూ.3.38 లక్షల కోట్లు) స్థాయికి పెరగవచ్చని దాతుమ్ ఇంటెలిజెన్స్ తాజా నివేదిక అంచనా వేసింది. క్విక్ కామర్స్ కంపెనీలు ఇప్పటికే సంప్రదాయ కిరాణా షాపులకు చెందిన దాదాపు సగం విక్రయాలను చేజిక్కించుకోగలిగాయని రిపోర్టు పేర్కొంది. కిరాణా షాపుల నుంచి కొనుగోళ్లు తగ్గించామని కంపెనీ సర్వేలో పాల్గొన్న 46 శాతం మంది వెల్లడించారు.

దేశీయ క్విక్ కామర్స్ రంగంలో బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, ఫ్లిప్‌కార్ట్ మినట్స్ ప్రముఖ కంపెనీలుగా ఉన్నాయి. ఈ ప్లాట్‌ఫామ్స్ కస్టమర్లకు 10-30 నిమిషాల్లో ఇంటివద్దకే సరుకుల డెలివరీ అందిస్తున్నాయి. తొలుత నిత్యావసర, ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులను మాత్రమే ఆఫర్ చేసిన ఈ ప్లాట్‌ఫామ్స్.. ఈ మధ్య కాలంలో ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియోను ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, కాస్మెటిక్స్, దుస్తులు, జువెలరీ, బుక్స్, క్రీడల ఉత్పత్తులు, ఔషధాలు, మాంసాహారోత్పత్తులు సహా పలు విభాగాలకు విస్తరించాయి. ఈ ఏడాదిలో 128 కోట్ల డాలర్ల విలువైన కిరాణా షాపుల విక్రయాలను క్విక్ కామర్స్ వేదికలు చేజిక్కించుకోనున్నాయని అంచనా. ఇది ఆ ప్లాట్‌ఫామ్స్ మొత్తం విక్రయాల్లో 21 శాతంగా ఉండనుందని రిపోర్టు పేర్కొంది. ఈ ఏడాది క్విక్ కామర్స్ సేవలు 74 శాతం మేర వృద్ధి చెందవచ్చని అంచనా.

2023-28 మధ్య కాలంలో ఈ మార్కెట్ 48 శాతం సమ్మిళిత వృద్ధి రేటు (సీఏజీఆర్)తో దూసుకెళ్లనుందని నివేదిక పేర్కొంది.

2 లక్షల కిరాణా స్టోర్ల మూత : ఏఐసీపీడీఎఫ్

దేశంలో క్విక్ కామర్స్ సంస్థల సేవల శరవేగ వ్యాప్తి సంప్రదాయ కిరాణా దుకాణాల మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోంది. క్విక్ కామర్స్ దెబ్బకు గడిచిన ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 2 లక్షల కిరాణా స్టోర్లు మూతపడ్డాయని ది ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ ఫెడరేషన్ (ఏఐసీపీడీఎఫ్) ప్రకటించింది. దేశంలో దాదాపు 1.3 కోట్ల కిరాణా దుకాణాలున్నాయని అంచనా. అందులో కోటికి పైగా ద్వితీయ శ్రేణి, చిన్న నగరాలు, పట్టణాల్లో ఉన్నాయి. క్విక్ కామర్స్ సేవలు ప్రధానంగా మెట్రో నగరాల్లోని కిరాణా దుకాణాల వ్యాపారంపై అధిక ప్రభావం చూపుతున్నాయని.. గత ఏడాది కాలంలో మెట్రో సిటీల్లోని 90,000 స్టోర్లు మూతపడ్డాయని ఏఐసీపీడీఎఫ్ అంటోంది. ప్రథమ శ్రేణి నగరాల్లో 60,000.. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో మరో 50,000 దుకాణాలను కట్టేశారని తెలిపింది. క్విక్ కామర్స్ సంస్థల భారీ డిస్కౌంట్లు, అనుచిత వ్యాపార విధానాలు సంప్రదాయ కిరాణా దుకాణాల సంఖ్యతో పాటు వాటి కస్టమర్లు, లాభాలకూ గండికొడుతున్నాయని, వాటి మనుగడకు ప్రశ్నార్థకంగా మారాయని ఏఐసీపీడీఎఫ్ జాతీయ అధ్యక్షుడు ధైర్యశీల్ పాటిల్ అన్నారు.

నయా ఫండ్స్

AXIS MUTUAL FUND

యాక్సిస్ మూమెంటమ్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ మూమెంటమ్ ఫండ్ పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించింది. ఇది మూమెంటమ్ థీమ్‌తో కూడిన ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించినట్లు యాక్సిస్ ఎంఎఫ్ వెల్లడించింది. ఈ ఫండ్‌కు నిఫ్టీ 500 టీఆర్ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.100. ఆ తర్వాత రూపాయి చొప్పున పెట్టుబడులు పెంచుకుంటూ పోవచ్చు. ఈ ఫండ్ ముగింపు తేదీ డిసెంబరు 6.

శ్రీరామ్ మల్టీ సెక్టార్ రొటేషన్ ఫండ్

SHRIRAM Mutual Fund

శ్రీరామ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్.. శ్రీరామ్ మల్టీ సెక్టార్ రొటేషన్ ఫండ్ పేరుతో కొత్త ఫండ్‌ను తీసుకువచ్చింది. దేశంలో ఈ తరహా ఫండ్‌ను తీసుకురావటం ఇదే మొదటిసారి. మంచి లాభాల్లో సాగుతున్న రంగాలను గుర్తించి ఎప్పటికప్పుడు పెట్టుబడుల పోర్టుఫోలియోలను మార్చుకుంటూ మధ్య, దీర్ఘకాలంలో మెరుగైన రిటర్నులు అందించే విధంగా ఈ ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ ఫండ్‌ను రూపొందించినట్లు శ్రీరామ్ ఏఎంసీ వెల్లడించింది. వివిధ రంగాల మూమెంటమ్ ఆధారంగా ట్రెండింగ్‌లో ఉన్న మూడు నుంచి ఆరు రంగాల్లో ఈ ఫండ్ ప్రధానంగా పెట్టుబడులు పెడుతుంది. పెట్టుబడులు పెట్టే రంగాలను శ్రీరామ్ ఏఎంసీకి చెందిన ఎన్‌హాన్స్‌డ్ క్వాంటమెంటల్ ఇన్వెస్ట్‌మెంట్ (ఈక్యూఐ) ఫ్రేమ్‌వర్క్ ఎంపిక చేస్తుంది. ఈ ఫండ్‌కు నిఫ్టీ 500 ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. క్రమానుగత పెట్టుబడి (సిప్) రూపంలో కూడా ఇంతే మొత్తం పెట్టుబడిగా పెట్టవచ్చు. ఈ ఫండ్ ముగింపు తేదీ డిసెంబరు 2.

ఐసీఐసీఐ ప్రు ఈక్విటీ మినిమమ్ వేరియన్స్ ఫండ్

ICICI PRUDENTIAL MUTUAL FUND

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్.. ఈక్విటీ మినిమమ్ వేరియన్స్ ఫండ్‌ను ప్రారంభించింది. తక్కువ ఆటుపోట్లతో కూడిన పోర్టుఫోలియోను రూపొందించటమే ఈ ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం ప్రధాన లక్ష్యం. ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత విభాగాల్లో ఇన్నోవేటివ్ విధానంతో పెట్టుబడులు పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించినట్లు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వెల్లడించింది. నిఫ్టీ 50 టీఆర్ఐ ఈ ఫండ్‌కు బెంచ్ మార్క్‌గా ఉండనుంది. ఈక్విటీ మినిమమ్ వేరియన్స్ ఫండ్ ప్రధానంగా తక్కువ ఆటుపోట్లు ఉన్న లార్జ్‌క్యాప్ విభాగంలో పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. సిప్ రూపంలో కనీస పెట్టుబడి రూ.100. ఈ ఫండ్ ముగింపు తేదీ డిసెంబరు 2.



బ్యాంకు లాకర్లకు జోరుగా డిమాండ్

విలువైన వస్తువులకు భద్రత ఉంటుందనే భరోసా

ఈ రోజుల్లో మనం ఎంత జాగ్రత్తగా ఉంటున్నా.. ఇళ్లల్లో ఉంచే విలువైన వస్తువులకు భద్రత ఉంటుందా అనేది అనుమానమే. ఇండిపెండెంట్ గృహాలైనా, అపార్ట్‌మెంట్స్ అయినా ఎప్పుడు ఏ దొంగ కన్నం వేస్తాడో తెలియని పరిస్థితి. దీంతో ప్రజలు తమ దగ్గర ఉన్న విలువైన వస్తువులు, ఆభరణాలు, కీలక పత్రాలు భద్రపరుచుకునేందుకు బ్యాంక్ లాకర్లను ఆశ్రయిస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా బ్యాంకు లాకర్ల కోసం ఎగబడుతున్నారు. దీంతో బ్యాంకుల్లో లాకర్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది.

అర్హత: దాదాపు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు తమ శాఖల్లో లాకర్ సౌకర్యం అందిస్తున్నాయి. మైనర్లు తప్ప, వయోజనులైన ప్రతి ఒక్కరు ఒంటరిగా లేదా ఉమ్మడిగా నిర్ణీత వార్షిక ఫీజుతో ఈ సౌకర్యాన్ని ఎంచుకోవచ్చు. భాగస్వామ్య సంస్థలు, లిమిటెడ్ కంపెనీలు, అసోసియేషన్లు, క్లబ్బులు కూడా తమ పేరు మీద బ్యాంకు లాకర్లను తీసుకోవచ్చు. బ్యాంకు-బ్యాంకు లాకర్‌ను అద్దెకు తీసుకున్న వ్యక్తి/సంస్థల మధ్య ఉండే సంబంధం.. ఏదైనా ఆస్తిని లీజుకు ఇచ్చిన వ్యక్తి-లీజుకు తీసుకున్న వ్యక్తి మధ్య ఉండే సంబంధంలాంటిదే.

నూరు శాతం భద్రత: ఇంట్లో దాచుకునే విలువైన నగ, నట్రా, కీలక పత్రాలకు పూర్తి స్థాయిలో భద్రత ఉండకపోవచ్చు. బ్యాంకు లాకర్లలో దాచుకునే వాటికి మాత్రం పూర్తి భద్రత ఉంటుందనే భరోసాతో ఉండవచ్చు. ఇందుకు చెల్లించే వార్షిక ఫీజూ నామమాత్రమే. క్రమం తప్పకుండా వార్షిక ఫీజు చెల్లిస్తూ నిబంధనలు పాటించినంత కాలం బ్యాంకులు కూడా లాకర్‌ను క్లోజ్ చేయవు. కాకపోతే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో లాకర్ దొరకడమే కొద్దిగా కష్టం. ప్రైవేట్ బ్యాంకులతో పోలిస్తే ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో లాకర్ ఫీజు తక్కువ. దీంతో వీటికి విపరీతమైన డిమాండ్ ఉంది.

నామినేషన్ సదుపాయం: లాకర్‌ను లీజుకు తీసుకున్న వ్యక్తులకు బ్యాంకులు నామినేషన్, సర్వైవర్‌షిప్ సదుపాయాలు కల్పిస్తున్నాయి. కొన్ని ప్రభుత్వ బ్యాంకులు నామినేషన్ సదుపాయాన్ని ఒకరికి మాత్రమే పరిమితం చేస్తున్నాయి. లాకర్ ఒకరి కంటే ఎక్కువ మంది పేరు మీద ఉండి, వారిలో ఒకరు చనిపోతే, ఆ లాకర్, అందులోని వస్తువులు జీవించి ఉన్న మిగతా వ్యక్తులకు వెంటనే సంక్రమించవు. నామినేషన్, సర్వైవర్‌షిప్ క్లాజును ఎంచుకున్నప్పుడు మాత్రమే, ఆ లాకర్‌ను ఆపరేట్ చేసే హక్కు జీవించి ఉన్న మిగతా జాయింట్ హోల్డర్ లేదా నామినీకి సంక్రమిస్తుంది.

ఫీజులు: లాకర్‌ను లీజుకు ఇచ్చినందుకు బ్యాంకుకు ఏటా ముందుగానే వార్షిక ఫీజు చెల్లించాలి. ఈ ఫీజు లాకర్ పరిమాణం, బ్యాంకు ఉన్న ప్రాంతాన్ని బట్టి మారుతుంటుంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)తో పోలిస్తే, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఈ ఫీజు ఎక్కువ. దాదాపు అన్ని పీఎస్‌బీలు ఒక ఆర్థిక సంవత్సరంలో 12 సార్లు ఉచితంగా లాకర్‌ను ఓపెన్ చేసే సదుపాయం కల్పిస్తున్నాయి. అంతకు మించితే మాత్రం ప్రతి ఓపెనింగ్‌కు రూ.100 ప్లస్ జీఎస్‌టీ చెల్లించాలి. ఒకవేళ లాకర్ తాళం పోగొట్టుకున్నా, లాకర్ బ్రేక్ చేయాల్సి వచ్చినా, సమయానికి లాకర్ ఫీజు చెల్లించక పోయినా రూ.1,000 ప్లస్ జీఎస్‌టీతో పాటు లాకర్ బ్రేక్ చేయడానికి అయ్యే ఖర్చులు కూడా చెల్లించాలి. దీనికి తోడు లాకర్ ఇచ్చేటప్పుడే నిర్ణీత ఫీజు సహా జీఎస్‌టీ, కొంత మొత్తం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలి.

అనధికార దందా: వీటికి తోడు లాకర్ సైజును బట్టి.. లాకర్ ఇచ్చే ముందే పెద్ద మొత్తంలో నగదు తమ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) చేయమని బ్యాంకులు అడుగుతుంటాయి. ప్రైవేట్ బ్యాంకులు ఇందుకు లాకర్ సైజును బట్టి రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షలు అడుగుతుంటే, పీఎస్‌బీలూ రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు వసూలు చేస్తున్నాయి. అలా చెల్లించలేని వారికి లాకర్లు ఖాళీ లేవని చెప్పేస్తున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిబంధనలకు ఇది పూర్తిగా విరుద్ధం. అయినా చాలా బ్యాంకులు ఇప్పటికీ ఈ దందా కొనసాగిస్తున్నాయి.




మహాయుతి మహా విజయం



అదానీ 'ధారావి'కి అడ్డంకులు తొలగినట్టే

అమెరికాలో నమోదైన కేసులతో సతమతమవుతున్న అదానీలకు మహారాష్ట్రలో 'మహాయుతి' గెలుపు భారీ ఊరటనిచ్చింది. ఆ కంపెనీ ప్రతిపాదించిన ముంబైలోని 'ధారావి' మురికివాడ పునర్నిర్మాణ ప్రాజెక్టుకు అడ్డంకులు తొలగినట్టయింది. తాము అధికారంలోకి వస్తే ఆ ప్రాజెక్టును రద్దు చేస్తామని విపక్ష మహా వికాస్ అఘాడీ ఎన్నికల్లో ప్రచారం చేసింది. అయితే, మహాయుతి అధికారం చేపట్టనుండడంతో ఇబ్బందులన్నీ తొలగినట్టయింది. ముంబైలో ధారావి మురికివాడ ఉంది. 620 ఎకరాల విస్తీర్ణంగల ఈ స్థలంలో పది లక్షల మంది చిన్న చిన్న గుడిసెల్లో నివసిస్తున్నారు. వాటిని తొలగించి, అపార్టుమెంట్లు నిర్మించి, తొలుత 7లక్షల మందికి ఒక్కొక్కరికీ 350 చదరపు అడుగుల విస్తీర్ణంగల ఫ్లాటును ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుమారు రూ.25వేల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు 2022లో అదానీలకు దక్కింది.

పవర్ కోల్పోయిన పవార్!



» ఎన్నికల్లో ఎన్సీపీ(ఎస్పీ)కి నిరాశజనక ఫలితాలు.. 10 సీట్లకు పరిమితం

ముంబై, నవంబరు 23: మహారాష్ట్ర రాజకీయాల్లో కురువృద్ధ నేతగా, కీలకమైన వ్యూహకర్తగా పేరొందిన శరద్ పవార్ రాజకీయ జీవితానికి ఇక తెర పడనుందా? ఇవే తన చివరి ఎన్నికలని ఇప్పటికే ప్రకటించిన 84 ఏళ్ల పవార్.. రాజకీయాల నుంచి తప్పుకునే పరిస్థితి వచ్చిందా? మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్సీపీ (ఎస్పీ) పేలవమైన ప్రదర్శనను చూస్తే.. ఈ సందేహాలు కలగకమానవు. శరద్ పవార్ నుంచి విడిపోయి ఎన్సీపీని కైవసం చేసుకున్న అజిత్ పవార్.. ఏకంగా 41 సీట్లను కైవసం చేసుకోగా, ఎన్సీపీ (ఎస్పీ) కేవలం 10 స్థానాలకు పరిమితమైంది. శరద్ పవార్ కుటుంబానికి కంచుకోటగా పేరొందిన బారామతిలో కూడా ఎన్సీపీ (ఎస్పీ) ఓటమి పాలైంది. లోక్‌సభ ఎన్నికల్లో బారామతిలో తన భార్యను నిలిపి గెలిపించుకోలేకపోయిన అజిత్ పవార్ ఈసారి స్వయంగా రంగంలోకి దిగి పట్టు నిరూపించుకున్నారు. ఎన్సీపీ (ఎస్పీ) అభ్యర్థిపై 1.16 లక్షల ఓట్ల మెజారిటీతో అజిత్ పవార్ ఘన విజయం సాధించారు. ఇదే బారామతిలో ఇటీవల ఎన్నికల ప్రచారం సందర్భంగా.. తన రిటైర్మెంట్ గురించి శరద్ పవార్ పరోక్షంగా వెల్లడించారు. 'బారామతి నుంచి 14 సార్లు పోటీ చేశాను. అన్నిసార్లూ మీరు నన్ను గెలిపించారు. మీ వల్లే నేను ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రినయ్యాను. నాలుగుసార్లు సీఎం పదవిని చేపట్టాను. ఇక మీదట సాధారణ ఎన్నికల్లో పోటీ చేయొద్దని నిర్ణయించుకున్నా. అందుకనే, రాజ్యసభకు వెళ్లా. మరో ఏడాదిన్నరలో రాజ్యసభ సభ్యత్వం కూడా ముగియనుంది. మళ్లీ రాజ్యసభ ఎంపీ కావాలని అనుకోవటం లేదు' అని తెలిపారు. పవార్ అంతగా సెంటిమెంట్ మాటలు మాట్లాడినా కూడా మహారాష్ట్ర ప్రజలు ముఖ్యంగా బారామతి ఓటర్లు ఆయనకు ముఖం చాటేశారు. వాస్తవానికి పెద్ద వయస్సు, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న శరద్ పవార్ రాజకీయ జీవితంపై.. ఎన్సీపీని అజిత్ పవార్ చీల్చి మహాయుతి ప్రభుత్వంలో చేరినప్పుడే నీలినీడలు కమ్ముకున్నాయి. పార్టీ పేరు, ఎన్నికల చిహ్నం కోసం సుప్రీంకోర్టుకు వెళ్లినా కూడా శరద్ పవార్‌కు అనుకూలంగా తీర్పు రాలేదు. అజిత్ పవార్ వర్గమే అసలైన ఎన్సీపీ అని న్యాయస్థానం తేల్చింది. ఇటువంటి గడ్డు పరిస్థితుల్లో కూడా.. లోక్‌సభ ఎన్నికల్లో అజిత్‌పై పైచేయి సాధించి తన చేవ తగ్గలేదని పవార్ నిరూపించుకున్నారు. మహా వికాస్ అఘాడీ కూటమి సూత్రధారి అయిన పవార్.. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఏదో మ్యాజిక్ చేసి.. మళ్లీ చక్రం తిప్పుతారనే పలువురు భావించారు. కానీ, మహాయుతి ప్రభంజనం ముందు అన్ని అంచనాలు తలకిందులయ్యాయి. ఈ నేపథ్యంలో.. పవార్ రాజకీయ జీవితం ఇక ముగిసినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఉద్ధవ్ ఠాక్రే భవితవ్యం?

బీజేపీ, కేంద్ర ప్రభుత్వం అండతో శివసేనను కుట్రపూరితంగా చీల్చిన ఏక్‌నాథ్ షిండే ఓ ద్రోహి అని, అసలైన శివసేన తమదేనని ప్రచారం చేసిన ఉద్ధవ్ ఠాక్రే వాదనను మహారాష్ట్ర ప్రజలు పట్టించుకోలేదు. షిండే శివసేనకు భారీ విజయం సమకూర్చారు. ఏకంగా 57 స్థానాల్లో గెలిపించారు. ఉద్ధవ్ శివసేన కేవలం 20 స్థానాలకు పరిమితమైంది. అఘాడీ కూటమిలోని ఇతర పార్టీలైన కాంగ్రెస్ 15, ఎన్సీపీ(ఎస్పీ) 10 స్థానాలే గెల్చుకున్నాయి. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా దక్కటానికి అవసరమైనన్ని సీట్లు ఏ పార్టీకీ రాలేదు. ఫలితాల నేపథ్యంలో ఏక్‌నాథ్‌షిండే మాట్లాడుతూ, తాము ఇంట్లో కూర్చొని ప్రభుత్వాన్ని నడపలేదని, ప్రజల వద్దకు వెళ్లామని ఉద్ధవ్‌ను పరోక్షంగా ఎద్దేవా చేస్తూ వ్యాఖ్యానించారు. షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే మరో అడుగు ముందుకేసి.. బాలాసాహెబ్ ఠాక్రే ఆశయాల్ని తామే ముందుకు తీసుకెళ్తున్నామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో, మృదుస్వభావిగా పేరొందిన 64 ఏళ్ల ఉద్ధవ్ ఠాక్రే.. తన వర్గం పార్టీని ఎలా నిలబెట్టుకుంటారు? రాజకీయాల్లో ఉనికిని ఎలా చాటుకుంటారు? అన్న ప్రశ్నలు ఆసక్తి కలిగిస్తున్నాయి.

'మహా'యుతి విజయానికి ఐదు మెట్లు



సంక్షేమ పథకాలు, అభివృద్ధి, కుల సమీకరణ, హిందూ ఓటు ఏకీకృతం, విదర్భపై ప్రత్యేక దృష్టి



ముంబై: ఆర్నెల్ల క్రితం లోక్‌సభ ఎన్నికల్లో తమకు వచ్చిన వ్యతిరేక ఫలితాల నైరాశ్యం నుంచి తేరుకుని మహారాష్ట్రలో 'మహాయుతి' సాధించిన విజయం అద్భుతమే! అయితే ఆ అద్భుతం దానంతట అదే జరగలేదు. ప్రజల్లో కోల్పోయిన పట్టును, విశ్వాసాన్ని తిరిగి సాధించడానికి ఈ ఎన్నికల్లో గెలవడానికి.. అధికార మహాయుతి కూటమి ఒక పద్ధతి ప్రకారం పావులు కదిపింది. తప్పులు, లోపాలు చూసుకుని సరిచేసుకుంది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి, కులాల సమీకరణ, మతపరంగా ఏకీకరణ.. అనే పదునైన అస్త్రాలను ప్రయోగించి విజయపీఠాన్ని అధివసించింది!! గెలుపు కోసం మహాయుతి ప్రయోగించిన అస్త్రాలను పరిశీలిస్తే..

సంక్షేమం

ప్రతిపక్షాలను విమర్శించే క్రమంలో ప్రధాని మోదీ పదేపదే ప్రస్తావించే అంశం.. 'రేవ్‌డీ కల్చర్'. అంటే తాయిలాల సంస్కృతి. కానీ.. లోక్‌సభ ఎన్నికల్లో వ్యతిరేక ఫలితాల దెబ్బకు అప్రమత్తమైన శిందే సర్కారు ఆ 'తాయిలాల సంస్కృతి'నే ఆశ్రయించింది! మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు 'మాఝీ లాడ్కీ బహిణ్ యోజన'ను జూన్ 28న ప్రకటించింది. ఈ పథకం కింద వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలలోపు ఉండి, 21-60ఏళ్ల మధ్య వయసు మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తోంది. తాము మళ్లీ గెలిస్తే ఆ మొత్తాన్ని రూ.2,100 చేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. అంగన్వాడీ, ఆశావర్కర్ల వేతనాలను నెలకు రూ.15 వేలు చేసింది. యువకుల ఓట్లను ఆకర్షించడానికి శిందే సర్కారు ఈఏడాది జూలైలో 'లాడ్లా భాయ్ (లడ్కా భావు) యోజన'ను ప్రకటించింది. దీని కింద 12వ తరగతి, డిప్లొమా, డిగ్రీ పూర్తిచేసినవారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ, శిక్షణ సమయంలో స్టైపెండ్ ఇస్తామని శిందే ప్రకటించారు. పేద కుటుంబాలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇచ్చే 'అన్నపూర్ణ యోజన'ను జూలై నెలాఖరులో ప్రకటించారు.

అభివృద్ధి

నగరాలు, పట్టణాలకే పరిమితమైన అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనను గ్రామీణ ప్రాంతాల్లో కల్పించడంపై మహాయుతి సర్కారు దృష్టిపెట్టింది. రైతులు పంటను అమ్ముకునేందుకు మార్కెట్లకు వెళ్లడానికి గ్రామీణ ప్రాంతాల్లో 45వేల రోడ్లను నిర్మించింది! ఇవి ఓట్ల రూపంలో ఫలసాయం అందించాయి!!

గ్రామీణంలో మళ్లీ హవా

లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు విదర్భలో నష్టపోయిన మహాయుతి కూటమి.. ఇప్పుడు అదే ప్రాంతాల్లో గణనీయమైన ఓట్లను తన ఖాతాలో వేసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో మహాయుతి కూటమి 49.3 శాతం ఓట్లను సాధించింది. లోక్‌సభ ఎన్నికల్లో కంటే ఈసారి 9.8 శాతం ఓట్లు పెరిగాయి. మరోవైపు, మారుమూల ప్రాంతాల్లో మహా వికాస్ అఘాడీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ కూటమి లోక్‌సభ ఎన్నికల్లో కంటే 10 శాతం ఓట్లను కోల్పోయి 34.4 శాతం ఓట్లకు పడిపోయింది. మొత్తంగా లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే విదర్భతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మహాయుతి కూటమి 15 శాతానికిపైగా ఓట్ల వృద్ధిని నమోదు చేసింది. మొత్తంగా చూస్తే కొంకణ్, ఉత్తర, పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతాల్లో మహాయుతి కూటమికి 50 శాతం ఓట్లు వచ్చాయి.

కులం

రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న మరాఠాల ఓటు తమవైపే ఉంటుందని మహావికాస్ అఘాడీ భావిస్తున్న నేపథ్యంలో హరియాణాలో జాటేతర ఓట్లను ఏకంచేసి విజయం సాధించినట్టుగానే మహారాష్ట్రలోనూ చేయాలని బీజేపీ భావించింది. రిజర్వేషన్ల కోసం ఉద్యమిస్తున్న మరాఠాలకు ఓబీసీ కేటగిరీలో రిజర్వేషన్ కల్పిస్తే తమ వాటా తగ్గుతుందన్న ఆందోళన ఓబీసీల్లో ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న ఓబీసీల ఓట్లను సంఘటితం చేసే దిశగా వ్యూహాలు రచించింది. ఇందుకోసం 1980ల్లో తనకు కలిసి వచ్చిన మా-ధ-వ మంత్రాన్ని మరోసారి జపించింది. మా-ధ-వ అంటే మాలి, ధన్‌గార్, వంజారీ (ఓబీసీలు). అప్పట్లో మహారాష్ట్రలో మరాఠాలు, దళితులు, కున్బీలు, గిరిజనులు, ముస్లింల ఓట్లన్నీ ఎక్కువగా కాంగ్రెస్‌కు పడేవి. దీంతో ఆరెస్సెస్ అప్పట్లో ఓబీసీల ఓట్లపై దృష్టిసారించింది. దాని ఫలితంగానే మహారాష్ట్రలో తొలితరం బీజేపీ నాయకులు ఎన్ఎస్ ఫరాండే(మాలి), అన్నా డాంగే (ధన్‌గార్), గోపీనాథ్ ముండే (వంజారీ) ఆ కులాల నుంచి వచ్చారు. మరాఠా రిజర్వేషన్ల ఉద్యమాల నేపథ్యంలో ఓబీసీల ఓట్లను తమకనుకూలంగా సంఘటితం చేయడానికి రెండు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఒకటి.. మహారాష్ట్రకు చెందిన ఏడు ఓబీసీ కులాలను కేంద్ర జాబితాలో చేర్చాలని, రెండు.. ఓబీసీ క్రీమీలేయర్ వార్షిక ఆదాయ పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచాలని కేంద్రానికి ప్రతిపాదించింది. దీంతో ఓబీసీల ఓట్లు గణనీయంగా ఆ కూటమికే పడ్డాయి.

మతం

మహారాష్ట్రలోని మైనారిటీల ఓట్లు గంపగుత్తగా మహా వికాస్ అఘాడీకి పడడంతో లోక్‌సభ ఎన్నికల్లో పలు సీట్లను కోల్పోయినట్టు గుర్తించిన మహాయుతి.. దానికి ప్రతిగా హిందువుల ఓట్లను సంఘటితం చేసేందుకు రెండు నినాదాలను రూపొందించింది. ఆ నినాదాలు.. 'బటేంగేతో కటేంగే (విడిపోతే పడిపోతాం)'.. 'ఏక్ హైతో సేఫ్ హై (ఐక్యంగా ఉంటే క్షేమంగా ఉంటాం)'. ఈ వ్యూహం పట్టణ, నగర ప్రాంతాల్లో బాగా పనిచేసింది.

విదర్భ

మహారాష్ట్రలో అధికారం సాధించాలంటే కరువు ప్రాంతమైన విదర్భలో ఎక్కువ సీట్లు సాధించాల్సి ఉంటుంది. అయితే.. లోక్‌సభ ఎన్నికల్లో అక్కడ ఘోరంగా దెబ్బతిన్న మహాయుతి ఈ ఎన్నికల్లో ఆ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. గ్రామీణ విదర్భ ప్రాంతంలో బీజేపీకి వ్యతిరేకంగా దళిత, ముస్లిం, ఓబీసీ ఓటర్లను మహావికాస్ అఘాడీ ఏకీకృతం చేసినట్టు గుర్తించి దానికి ప్రతిగా హిందువుల ఐక్యత, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలను విస్తృతంగా ప్రచారం చేసింది. ముఖ్యంగా ఆరెస్సెస్ కార్యకర్తలు ఈ ప్రచారంలో కీలకపాత్ర పోషించారు. దీంతోపాటు ఉల్లి ఎగుమతులపై నిషేధాన్ని కేంద్రంలోని ఎన్డీయే సర్కారు ఎత్తివేసింది.

డేటా ఆధారంగా.. ఫోన్లు చేసి మరీ..

ఎన్నికలను ఒక పద్ధతి ప్రకారం ప్రణాళికాబద్ధంగా ఎదుర్కొనే బీజేపీ.. ఈసారి కూడా అదే వ్యూహాన్ని అవలంబించింది. అత్యంత అధునాతనమైన సాఫ్ట్‌వేర్ ద్వారా ఓటర్ డేటాబేస్‌ను రూపొందించుకుంది. కచ్చితంగా మహాయుతికి ఓటేసే వారి వివరాలు, వారి ఫోన్ నంబర్లు అన్నీ ఆ డేటాబేస్‌లో ఉన్నాయి. కార్యకర్తలందరికీ పార్టీ ఆ డేటాను అందుబాటులో ఉంచింది. దీంతో వారంతా ఎప్పటికప్పుడు ఎవరెవరు ఓటు వేశారు, ఇంకా ఎవరు తమ ఓటుహక్కును వినియోగించుకోలేదు.. అనే సమాచారాన్ని తెలుసుకుని, మధ్యాహ్నం దాకా ఓటు వేయనివారికి ఫోన్ కాల్స్ చేశారు. వారిని పోలింగ్ బూత్‌ల దాకా తీసుకొచ్చేవరకూ పట్టు వదల్లేదు.

ఎంవీఏ 'మహా'పతనం!



» కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ??

» గుర్తులు మారి బోల్తాపడ్డ ఉద్ధవ్, శరద్‌పవార్!

మహా వికాస్ అఘాడీ.. మహారాష్ట్రలో 2019 ఎన్నికల తర్వాత అనూహ్య పరిస్థితుల్లో ఎంవీఏ కూటమిగా ఏర్పడ్డ కాంగ్రెస్, శివసేన(ఉద్ధవ్), ఎన్సీపీ(శరద్‌పవార్) పార్టీలు అధికారాన్ని చేపట్టాయి..! ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ మహారాష్ట్రలో ఎన్డీయేకు ఝలక్ ఇచ్చిన ఈ కూటమి.. ఆర్నెల్లలో చతికిలపడిపోయింది..! తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడా.. అక్కడా అని కాకుండా.. కొంకణ్ మొదలు మారాఠ్వాడ దాకా.. అంతటా ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ ఓటమి ప్రభావం కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి భవితవ్యం, ఉద్ధవ్‌ఠాక్రే, శరద్‌పవార్ పార్టీల మనుగడనే ప్రశ్నార్థకంగా మారుస్తోంది. ఎంవీఏలో సిద్ధాంతపర విభేదాలు లోక్‌సభ ఎన్నికలకు ముందు నుంచే బయటపడ్డాయి. ఆ తర్వాత కూడా.. వీర సావర్కర్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం.. దాన్ని ఉద్ధవ్‌ఠాక్రే ఖండించడం.. ఆ తర్వాత వెనక్కి తగ్గినా.. నష్టనివారణకు కూటమి ప్రయత్నించిన దాఖలాలు మాత్రం అంతంతమాత్రమే..! అడపాదడపా శరద్ పవార్, ఉద్ధవ్‌ఠాక్రే వేర్వేరుగా కాంగ్రెస్‌ను విమర్శించారు. అదానీని కాంగ్రెస్ పదేపదే టార్గెట్‌గా చేసుకోవడాన్ని శరద్‌పవార్ తప్పుబట్టారు. అంతే కాదు.. బాల్‌ఠాక్రే హయాంలో శివసేన అంటే హిందుత్వ అనేలా పరిస్థితులుండేవి. అయితే.. ఉద్ధవ్‌ఠాక్రే తమ సిద్ధాంతాలకు వ్యతిరేకమైన కాంగ్రెస్ పంచన చేరడం.. తమదే అసలైన శివసేన అంటూ శిందే వర్గం పదేపదే ప్రకటనలు చేయడం ఎంవీఏకు నష్టాన్ని కలిగించాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రెబెల్స్ వల్ల ఎంవీఏ ఓట్ల బదిలీ జరిగి ఎంవీఏ కూటమికి నష్టం జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

గుర్తులు మారి..

బాలాసాహెబ్(బాల్‌ఠాక్రే) పేరుతో ముందుకు దూసుకెళ్లే శివసేన(ఉద్ధవ్) పార్టీ.. ఈ సారి సొంత గుర్తు లేక.. ప్రజల్లోకి తమదే అసలైన శివసేన అని చెప్పడంలో విఫలమైంది. అదే సమయంలో శిందే వర్గం ఈ విషయంలో ముందంజలో ఉండి.. బాలాసాహెబ్ ఆశయాలను సాధించేది తామేనని చాటింది. అటు శరద్‌పవార్ కూడా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారు. గడియారం గుర్తు అజిత్‌వర్గానికి వెళ్లడంతో.. స్వయంగా శరద్‌పవార్ ముందుండి ప్రచారం చేసినా.. ఫలితం లేకుండా పోయింది.

ప్రణాళిక అద్భుతంగా ఉన్నా..

ఈ సారి మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి, ఎంవీఏ కూటములు ప్రజలపై వరాల జల్లులు కురిపించాయి. అయితే.. ఎన్నికల ప్రణాళికను ఓటర్లలోకి తీసుకెళ్లడంలో మహాయుతి విజయవంతమైనట్లు తాజా ఫలితాలు చెబుతున్నాయి. ముఖ్యంగా రైతులు అధికంగా ఉండే విదర్భ, మరాఠ్వాడల్లో గతంలోకంటే ఎక్కువ సీట్లను ఈ కూటమి సాధించింది. అటు కేంద్రంలో.. ఇటు రాష్ట్రంలో ప్రభుత్వాల ప్రజావ్యతిరేక చర్యలను ప్రచారం చేయడంలో ఎంవీఏ వెనకబడిందని విశ్లేషకులు చెబుతున్నారు. దాంతో బీజేపీ, దాని మిత్రపక్షాల విజయం ఏకపక్షమైంది. ఎంవీఏ మహాయుతికి పోటీ ఇవ్వలేకపోయింది. -సెంట్రల్ డెస్క్

మహారాష్ట్ర(మొత్తం సీట్లు-288 సీట్లు, మ్యాజిక్ ఫిగర్-145)			
సంస్థ	మహాయుతి	ఎంవీఏ	ఇతరులు
టైమ్స్ నౌ-జేవీసీ	150-167	107-125	13-14
పీపుల్స్‌పల్స్	175-195	85-112	7-12
న్యూస్ 24-చాణక్య	152-160	130-138	6-8
పోల్ డైరీ	122-186	69-121	10-27
దైనిక్ భాస్కర్	125-140	135-150	20-25
యాక్సిస్ మై ఇండియా	178-200	82-102	6-12
వాస్తవ ఫలితం	235	49	4

ఎగ్జిట్ పోల్స్ మిశ్రమం!

యాక్సిస్ మై ఇండియా అంచనాలు మాత్రమే వాస్తవానికి దగ్గరగా

న్యూఢిల్లీ, నవంబరు 23: ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఈసారి మిశ్రమంగా ఉన్నాయి. మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి విజయం సాధిస్తుందని దాదాపు అన్ని సర్వే సంస్థలు అంచనా వేసినప్పటికీ, ఈ స్థాయిలో సీట్లు సాధిస్తుందని ఏ ఒక్క సంస్థ కూడా చెప్పలేకపోయింది. దాదాపు అన్ని సంస్థలు మహాయుతికి సగటున 155-190 మధ్యలో సీట్లు వస్తాయని ప్రకటించాయి. కానీ, వాస్తవ ఫలితాల్లో ఈ కూటమి ఏకంగా 233 సీట్లు సాధించింది. ఒక్క యాక్సిస్ మై ఇండియా సంస్థ మాత్రమే మహాయుతి కూటమికి గరిష్ఠంగా 200సీట్ల వరకు రావొచ్చని అంచనా వేసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)కి సగటున 100-120 సీట్లు రావొచ్చని సర్వే సంస్థలు అంచనా వేయగా.. ఈ కూటమి కేవలం 50 సీట్లకే పరిమితం అయింది. ఒక్క పోల్ డైరీ మాత్రమే ఈ కూటమికి కనిష్ఠంగా 69 సీట్లు రావొచ్చని పేర్కొంది. యాక్సిస్ మై ఇండియా 82 సీట్లు రావొచ్చని అంచనా వేసింది. ఇక, ఝార్ఖండ్‌లో ఇండియా కూటమికి 50కి పైగా సీట్లు వస్తాయని ఒక్క యాక్సిస్ మై ఇండియా సంస్థ మాత్రమే అంచనా వేసింది. ఇది ఇండియా కూటమికి 53 సీట్లు వస్తాయని తెలిపింది. అసలు ఫలితాల్లో కూటమికి 57 స్థానాలు వచ్చాయి. ఎన్డీయే కూటమికి 25 స్థానాలు వస్తాయని వెల్లడించగా.. 23 స్థానాలు వచ్చాయి. మిగతా సంస్థల్లో కొన్ని హంగ్ వస్తుందని అంచనా వేశాయి. మెజారిటీ సంస్థలు బీజేపీదే అధికారం అని తేల్చి చెప్పాయి. కానీ, ఇండియా కూటమి స్పష్టమైన ఆధిక్యంతో అధికారంలోకి వచ్చింది. కాగా, గత లోక్‌సభ ఎన్నికల్లో తమ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పినప్పుడు యాక్సిస్ మై ఇండియా సీఈవో ప్రదీప్ గుప్తా టీవీ కార్యక్రమం లైవ్‌లోనే కంటతడి పెట్టిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో ఆ ఒక్క సంస్థ మాత్రమే రెండు రాష్ట్రాల్లో వాస్తవ ఫలితాలకు దగ్గరగా అంచనాలను వెల్లడించింది.

ఝార్ఖండ్(మొత్తం సీట్లు-81, మ్యాజిక్ ఫిగర్-41)			
సంస్థ	ఎన్డీయే	ఇండియా	ఇతరులు
పీపుల్స్ పల్స్	42-48	16-23	8-14
పీ-మార్క్	31-40	37-47	1-6
చాణక్య స్ట్రాటజీస్	45-50	35-38	3-5
టైమ్స్ నౌ-జేవీసీ	40-44	30-40	0-1
మ్యాట్రిజ్	42-47	25-30	1-4
యాక్సిస్ మై ఇండియా	25	53	3
వాస్తవ ఫలితం	24	56	1

జమిలిపై బీజేపీ నజర్?

న్యూఢిల్లీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో మహాయుతి ఘన విజయంతో.. కమలనాథులు ఇక జమిలి ఎన్నికలపై దృష్టి సారించే అవకాశాలున్నాయి. వీలైతే ఈ శీతాకాల సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టి.. స్థాయీ సంఘానికి నివేదించే అవకాశాలున్నాయి. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో.. దేశంలోని మెజారిటీ పార్టీల మద్దతును కూడగట్టుకుని, బిల్లును ఆమోదించేందుకు అవసరమైన వ్యూహరచనను ఇప్పటికే బీజేపీ పూర్తిచేసినట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో పవార్, ఉద్ధవ్ నేతృత్వంలోని ఎన్సీపీ(ఎస్పీ), శివసేన(ఉద్ధవ్) ఓటమిపాలై.. అస్తిత్వం కోల్పోవడంతో.. దేశంలో పలు ప్రాంతీయ పార్టీలు కూడా ఆత్మరక్షణలో పడే అవకాశాలున్నాయని బీజేపీ భావిస్తోంది. అలాంటి పార్టీలతో కలిసి.. తన అజెండాను నెగ్గించుకోవాలని యోచిస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే.. 2027లో జమిలి ఎన్నికలు జరుగుతాయని బీజేపీ భావిస్తోంది. అయితే.. అంతకంటే ముందే 2026లోగా జనగణన జరగాల్సి ఉంటుంది. 2026కల్లా జనగణన జరిగితే.. 2027కల్లా జమిలికి వెళ్లి.. మహారాష్ట్రలో మాదిరిగా హిందూ ఓటర్లను సంఘటితం చేసి, విజయం సాధించాలనేది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది. మహారాష్ట్ర మాదిరిగానే మహిళా ఓటర్లను తమవైపు తిప్పుకొనేందుకు 33% సీట్లను వారికి కేటాయించాలని భావిస్తోంది. శీతాకాలం పార్లమెంట్ సమావేశాల్లో వక్ఫ్ బిల్లు.. ఆ తర్వాత ఉమ్మడి పౌరస్మృతి బిల్లును ఆమోదింపజేస్తే.. హిందూ ఓట్లను సంఘటితం చేసుకుని, 'ఏక్ హైతో.. సేఫ్ హై' నినాదాన్ని దేశవ్యాప్తంగా మారుమ్రోగించేందుకు బీజేపీ సిద్ధమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఉప ఎన్నికల్లోనూ ఎన్డీయేనే

14 రాష్ట్రాల్లోని 48 అసెంబ్లీ స్థానాల్లో మెజార్టీ సీట్లు కైవసం



న్యూఢిల్లీ, నవంబరు23: దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లోని 48 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ఎన్డీయే సత్తా చాటింది. మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంది. ఉత్తరప్రదేశ్‌లో తొమ్మిది స్థానాలకు ఎన్నికలు జరగ్గా ఆరు నియోజకవర్గాలను బీజేపీ గెలుచుకుంది. ఎన్డీయే కూటమిలో భాగంగా ఉన్న ఆర్ఎల్‌డీ ఒక స్థానంలో గెలుపొందింది. ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఈ ఉప ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఉధృతంగా ప్రచారం చేసినా ఎస్పీ అభ్యర్థులు రెండు చోట్ల మాత్రమే విజయం సాధించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఉన్న సానుకూల వాతావరణం ఇప్పటికీ కొనసాగుతుందనుకున్న ఎస్పీ నేతలకు తాజా ఫలితాలు మింగుడు పడటం లేదు. రాజస్థాన్‌లోని 7 నియోజకవర్గాలకు గాను 5 చోట్ల బీజేపీ గెలుపొందింది. కాంగ్రెస్, భారత్ ఆదివాసి పార్టీలు చెరొక స్థానం గెలుచుకున్నాయి. అస్సాంలోని 5 స్థానాల్లోనూ, బీహార్‌లోని 4 నియోజకవర్గాల్లోనూ ఎన్డీయే విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్, గుజరాత్‌లో ఒక్కొక్క నియోజకవర్గంలో ఉప ఎన్నికలు జరగ్గా అధికార బీజేపీ నెగ్గింది. మధ్యప్రదేశ్‌లో 2 నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరగ్గా బీజేపీ,కాంగ్రెస్ చెరో స్థానం గెలుచుకున్నాయి.

కర్ణాటకలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్

కర్ణాటకలోని మొత్తం 3 నియోజకవర్గాలనూ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. చన్నపట్న నియోజకవర్గంలో కేంద్ర మంత్రి కుమారస్వామి తనయుడు నిఖిల్‌ను కాంగ్రెస్ అభ్యర్థి యోగీశ్వర ఓడించారు. షిగ్గాన్ నియోజకవర్గంలో మాజీ సీఎం బొమ్మై తనయుడు భరత్ బొమ్మైని కాంగ్రెస్ అభ్యర్థి యాసిర్ అహ్మద్ ఖాన్ ఓడించారు. ముడా భూముల కుంభకోణంతో సీఎం సిద్ధరామయ్యపై వ్యతిరేకత వచ్చినా మూడు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. కేరళలో 2 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగ్గా పాలక్కాడ్‌ను కాంగ్రెస్ గెలుచుకుంది. మరో నియోజకవర్గం చెలక్కరలో అధికార సీపీఐ(ఎం) అభ్యర్థి గెలుపొందారు.

పశ్చిమబెంగాల్‌లో ఎదురులేని టీఎంసీ

పశ్చిమబెంగాల్‌లో ఉప ఎన్నికలు జరిగిన మొత్తం ఆరు నియోజకవర్గాలనూ టీఎంసీ కైవసం చేసుకుంది. పంజాబ్‌లో 4 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగ్గా మూడింటిని ఆప్ గెలుచుకుంది. ఒక నియోజకవర్గాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మేఘాలయలో ఒక స్థానానికి ఉప ఎన్నికలు జరగ్గా నేషనల్ పీపుల్స్ పార్టీ అభ్యర్థి విజయం సాధించారు. సిక్కింలో రెండు నియోజకవర్గాలనూ సిక్కిం క్రాంతి కారి మోర్చా గెలుచుకుంది. మహారాష్ట్ర నాందేడ్ లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నెగ్గింది.

ముస్లిం మెజార్టీ నియోజకవర్గంలో బీజేపీ విజయం

యూపీలో ముస్లిం మెజార్టీ ఉన్న కుందర్కీలో సమాజ్‌వాదీ అభ్యర్థి మహ్మద్ రిజ్వాన్ డిపాజిట్ కోల్పోయారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి రామ్‌వీర్ సింగ్ 1,44,791 ఓట్ల తేడాతో గెలిచారు. రామ్‌వీర్ సింగ్‌కు మొత్తం 1,70,371 ఓట్లు వచ్చాయి. మొత్తం 11 మంది ముస్లిం అభ్యర్థులు పోటీ పడినా ఇక్కడ బీజేపీ నెగ్గింది. 30 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ నియోజకవర్గాన్ని గెలుచుకుంది.



మహాయుతి మహా విజయం



మహారాష్ట్ర ఫలితాలపై చంద్రబాబు హర్షం

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై తెలుగుదేశం పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన దీనిపై 'ఎక్స్‌'లో స్పందించారు. 'మహారాష్ట్ర ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించినందుకు మహాయుతి కూటమికి అభినందనలు. మోదీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఈ విజయం ప్రతిఫలించింది' అని ఆయన ప్రశంసించారు. కాగా, గయానా దేశ పర్యటన నుంచి తిరిగి వచ్చిన ప్రధానికి శనివారం మధ్యాహ్నం చంద్రబాబు ఫోన్ చేశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు. జేపీ నడ్డా, అమిత్ షా, ఏక్‌నాథ్ షిండే, ఫడణవీస్‌లకూ ఆయన ఫోన్లు చేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, మహారాష్ట్ర ప్రజలు ప్రగతి పథాన్ని ఎన్నుకున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ అన్నారు. శింధే, ఫడణవీస్, అజిత్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

మోదీ సమర్థ నాయకత్వంతో గెలుపు

మోదీ సమర్థ నాయకత్వంలోని డబుల్ ఇంజన్ సర్కారు సంక్షేమ విధానాలు, సుపరిపాలనపై ప్రజలకున్న అచంచల విశ్వాసానికి మహాయుతి కూటమి ఘన విజయమే అద్దం పడుతోంది.
- జేపీ నడ్డా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు

ఇది అఖండ విజయం..

ఎన్డీయేకు అఖండ విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు ధన్యవాదాలు. మహాయుతి భారీ మెజార్టీ సాధిస్తుందని గతంలోనే చెప్పా. మహిళలు, రైతులు, వృద్ధులు.. అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతలు.
- ఏక్‌నాథ్ శింధే, మహారాష్ట్ర సీఎం

నేను ఆధునిక అభిమన్యుడిని..

నేనొక ఆధునిక అభిమన్యుడినని ముందే చెప్పా. చక్రవ్యూహంలో ప్రవేశించడమే కాదు ఛేదించుకొని బయటికి రాగలనని నిరూపించుకున్నా. మోదీ ఉంటే అన్నీ సాధ్యమే.. 3 పార్టీల సమావేశం నిర్వహించి సీఎం ఎవరనే దానిపై అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటాం..
- ఫడణవీస్, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం

ఇది కుట్ర.. ప్రజల నిర్ణయం కాదు

ఈ ఫలితాలను అంగీకరించడానికి సిద్ధంగా లేము. మాకు అనుమానాలున్నాయి. ఇది ప్రజల నిర్ణయం కానే కాదు. ఎక్కడో ఏదో తప్పు జరిగింది. ఇందులో కుట్ర దాగి ఉంది. ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. అయినా మహాయుతి కూటమికి అన్ని సీట్లు ఎలా వస్తాయి? - సంజయ్ రౌత్, శివసేన (యూబీటీ)

ఇలాంటి ఫలితాలు ఊహించలేదు..

మహారాష్ట్రలో ఇలాంటి ఫలితాలను అస్సలు ఊహించలేదు. ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుంటాం. ఛత్రపతి శివాజీ, అంబేడ్కర్ భావజాలానికి మేమే నిజమైన వారసులం.. మా పోరాటం కొనసాగుతుంది. ఝార్ఖండ్ ప్రజలు తమ హక్కులు, నీరు, అటవీ, భూమి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. విభజన రాజకీయాలు, తప్పుడు హామీలను తిప్పికొట్టారు.
- ఖర్గే, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు

రాజ్యాంగ పరిరక్షణకు దక్కిన విజయం

ఇండియా కూటమికి భారీ విజయం అందించిన ఝార్ఖండ్ ప్రజలకు ధన్యవాదాలు. సీఎం హేమంత్ సొరేన్‌కు, కాంగ్రెస్, జేఎంఎం పార్టీల కార్యకర్తలకు శుభాకాంక్షలు. ఝార్ఖండ్‌లో కూటమి గెలుపు.. రాజ్యాంగంతో పాటు నీరు, అటవీ, భూమి పరిరక్షణకు దక్కిన విజయం. మహారాష్ట్ర ఫలితాలు అనూహ్యం.. సమగ్రంగా విశ్లేషించుకుంటాం. వయనాడ్‌లోని నా కుటుంబం ప్రియాంకను భారీ మెజార్టీతో గెలిపించినందుకు గర్విస్తున్నా. - రాహుల్, కాంగ్రెస్ అగ్ర నేత

మహా కమలం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కూటమి గత ఎన్నికల్లో 47 సీట్లను సాధిస్తే.. ఈసారి 56 సీట్లను సాధించడం విశేషం. నిజానికి, సీఎం హేమంత్ సొరెన్‌ను అవినీతి ఆరోపణలపై అరెస్టు చేసినా.. నాన్ లోకల్ వివాదాన్ని తెరపైకి తెచ్చినా.. కుటుంబంలో చీలిక తెచ్చి చంపయీ సొరెన్‌ను ఆకర్షించినా ఇక్కడి ప్రజలు హేమంత్ సొరెన్ వైపునకే మొగ్గు చూపారు. ఇక, ఉప ఎన్నికల్లో ఎప్పట్లాగే అధికార పార్టీలే పైచేయి సాధించినా.. అక్కడక్కడ ప్రతిపక్షాలూ మెరుపులు మెరిపించాయి!

వరాలూ.. కులాలూ!

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో బీజేపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది! అక్కడ ఏకంగా 48 లోక్‌సభ సీట్లు ఉంటే బీజేపీకి తొమ్మిదికే పరిమితమైంది. దాంతో, అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎంవీఏ పైచేయి సాధిస్తుందనే అంచనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో బీజేపీ-శింధే సర్కారు అప్రమత్తమైంది. అందరూ ఎన్నికల ప్రచారంలో హామీలు ఇస్తారు. కానీ, మహా యుతి సర్కారు మాత్రం ఎన్నికలకు ముందే తాయిలాలు పంచేసింది. లాడ్కీ బహిన్ యోజనను ప్రవేశపెట్టి.. రూ.2.5 లక్షల వార్షికాదాయం ఉండే మహిళలకు నెలకు రూ.1500 ఇస్తోంది. మళ్లీ అధికారంలోకి వస్తే దీనిని రూ.2100 చేస్తామని ప్రకటించింది! దాంతో, తాము అధికారంలోకి వస్తే ఈ పథకం కింద రూ.3000 ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించినా మహిళలు మహా యుతికే జైకొట్టారు! అలాగే, లడ్కా బౌ అనే మరో పథకం కింద నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడంతోపాటు శిక్షణ సమయంలో స్టైపెండ్‌నూ ఇస్తోంది. ముంబై నగరం చుట్టూ ఉన్న ఐదు టోల్ గేట్ల ద్వారా ప్రవేశాన్ని ఉచితం చేసేసింది. ఎగుమతులపై నిషేధంతో ఉల్లి రైతుల్లో ఆగ్రహాన్ని చల్లార్చడానికి ఆ నిషేధాన్ని తొలగించింది. ఎన్నికలకు ముందు తీసుకున్న ఈ నిర్ణయాలన్నీ మహా యుతికి ఓట్ల వర్షాన్ని కురిపించాయి. మహా యుతి అద్భుత విజయానికి ఒక కారణం వరాలు అయితే.. మరొకటి కుల సమీకరణాలు! లోక్‌సభ ఎన్నికలకు ముందు మరాఠాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం (ఆ తర్వాత సుప్రీం కోర్టు వాటిని నిలిపివేసింది)తో ఓబీసీలు మహా యుతి కూటమిపై ఆగ్రహంతో ఉన్నారు. వారంతా ఎంవీయే కూటమికి మొగ్గు చూపుతున్నారన్న విషయం తెలుసుకున్న బీజేపీ నేతలు గతంలో తమకు అండగా నిలిచిన ఓబీసీల్లోని మాలి, ధంగర్, వంజరి వంటి బీసీ కులాల నేతలతో విస్తృతంగా సంప్రదింపులు జరిపి వారిని తమ వైపు ఆకర్షించారు. ఏక్‌నాథ్ శింధే స్వయంగా మరాఠా నేత. దాంతో, మరాఠాలంతా మహా యుతికి జైకొట్టారు. ఓబీసీలనూ ఆకర్షించారు. దాంతో, కాంగ్రెస్ పార్టీ 'ముస్లిం-దళిత్-మరాఠా' వ్యూహం పని చేయలేదు. దీనికితోడు, ముస్లిములతో కాంగ్రెస్ పార్టీ ఒప్పందం కుదుర్చుకుందని ప్రచారం చేసిన బీజేపీ.. విడిపోతే పడిపోతాం, ఐక్యంగా ఉంటే క్షేమంగా ఉంటామనే నినాదాలతో హిందూ ఓటును ఏకీకృతం చేయడానికి పావులు కదిపింది. మరాఠా నేతగా శింధే ఆవిర్భవిస్తే.. శరద్ పవార్ స్థానం భవిష్యత్తులో అజిత్‌దేనన్న సంకేతాలూ వెళ్లాయి. ఉద్ధవ్ ఠాక్రే రెండున్నరేళ్ల పాలనకు భిన్నంగా శింధే సైలెంట్‌గానే అభివృద్ధి, సంక్షేమ పాలనతో ప్రజలను ఆకర్షించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీకి దూరంగా ఉన్న సంఘ్.. అసెంబ్లీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించింది. అదే సమయంలో, ఇవే తన చివరి ఎన్నికలని శరద్ పవార్ చెప్పడం.. బాల్ ఠాక్రే దూకుడును ఉద్ధవ్ ఠాక్రే కొనసాగించకపోవడంతోపాటు కాంగ్రెస్ పార్టీ కూడా క్షేత్రస్థాయిలోని అనుకూలతను తనకు అనుకూలంగా మలచుకోలేకపోయింది. ఫలితమే.. మహా యుతి ఘన విజయం!

వయనాడ్‌లో ప్రియాంకం

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భారీ ఊరట ఏదైనా ఉందంటే అది వయనాడ్ ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ అద్భుత విజయమే. గత ఎన్నికల్లో రాహుల్ ఇక్కడ 3.64 లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తే.. ప్రియాంక అరంగేట్రంతోనే 4.10 లక్షల ఓట్ల ఆధిక్యాన్ని సాధించి లోక్‌సభలో అడుగు పెడుతున్నారు. గాంధీ కుటుంబం నుంచి పార్లమెంటుకు వెళుతున్న మరో వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఇక, అసెంబ్లీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీలే పైచేయి సాధించాయి. చివరిగా, మహారాష్ట్రలో మహా యుతి; జార్ఖండ్‌లో ఎంవీఏ విజయం సాధిస్తాయన్న ఎగ్జిట్ పోల్స్‌అంచనాకు మించి విజయం సాధించడం విశేషం!! ఇక, శకునం చెప్పే బల్లి కుడితిలో పడినట్టు.. వివిధ రాష్ట్రాల్లో తన వ్యూహాలతో పార్టీలను గెలిపిస్తున్నానని చెప్పుకొనే ప్రశాంత్ కిశోర్ పార్టీ బిహార్‌లో కనీసం డిపాజిట్లను కూడా దక్కించుకోలేదు!!



దేవేంద్రుడు మూడోసారి పీఠం చేపట్టేనా!?

ఇప్పుడు అందరి మదిలోనూ మెదులుతున్న ప్రశ్న.. మహారాష్ట్ర తదుపరి సీఎం ఎవరనే! అత్యధిక సీట్లు గెలిచిన బీజేపీకే ఈసారి ముఖ్యమంత్రి పీఠం దక్కుతుందనే అంచనాలున్నాయి. అందులోనూ ఆ పార్టీని విజయ తీరాలకు చేర్చిన ఫడణవీస్ మూడోసారి ఆ పదవిని చేపడతారనే ఊహాగానాలు చెలరేగుతున్నాయి. దీనికితోడు, శింధే సహాయం లేకపోయినా అధికారం చేపట్టే స్థితిలో ఇప్పుడు బీజేపీ ఉంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం ఫడణవీస్ సీఎం అవుతారని, సీఎం శింధే డిప్యూటీ అవుతారనే అంచనాలు రాజకీయ వర్గాల్లో వెలువడుతున్నాయి. ఇక, ఈ ఎన్నికలతో మరాఠా యోధుడు శరద్ పవార్ శకం ముగిసినట్లే! శివసేనతోపాటు ప్రజాబలాన్ని కూడా శింధే కూడగట్టుకోవడంతో ఉద్ధవ్ ఠాక్రే రాజకీయాలకూ కాలం చెల్లినట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక, చీలిక పార్టీలే అక్కడ ప్రధాన పార్టీలుగా చక్రం తిప్పనున్నాయి.

అభివృద్ధికే పట్టం

బీజేపీ విజయోత్సవ సభలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, నవంబరు 23: తాజా ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారని ప్రధాని మోదీ అన్నారు. అబద్ధాలు, వంచన రాజకీయాలకు పాల్పడిన కాంగ్రెస్, దాని మిత్రపక్షాలను ఓడించారని చెప్పారు. శనివారం రాత్రి ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో మోదీ ప్రసంగించారు. మహారాష్ట్ర అన్ని రికార్డులను బ్రేక్ చేసిందన్నారు. గడిచిన 50 ఏళ్లలో ఏ పార్టీగానీ, ఎన్నికల ముందు ఏర్పాటైన కూటమిగానీ ఇంతటి ఘన విజయం సాధించలేదని చెప్పారు. ఈ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి వచ్చిన అతిపెద్ద సందేశం ఐక్యతేనని పేర్కొన్నారు. 'ఐక్యంగా ఉంటేనే సురక్షితంగా ఉంటాం (ఏక్ హై తో సేఫ్ హై)' అనే నినాదమే ఇప్పుడు దేశానికి మహా మంత్రంగా మారిందని చెప్పారు. కులం, మతం ఆధారంగా దేశాన్ని విభజించాలని కోరుకున్న వారికి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి ఓటేశారని మోదీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం కులతత్వం అనే విషాన్ని వ్యాపింపజేస్తోందని మండిపడ్డారు. మహారాష్ట్రలో అస్థిరతను సృష్టించేందుకు యత్నించిన, ద్రోహానికి పాల్పడిన కొందరిని ఓటర్లే శిక్షించారని ప్రధాని మోదీ చెప్పారు. 'దేశమే ముందు' అనే వారితో తప్ప 'కుర్చీయే ముందు' అనే వారిని ఓటర్లు నమ్మరని తేలిపోయిందన్నారు. ప్రపంచంలోని ఏ శక్తీ ఆర్టికల్ 370ను పునరుద్ధరించలేదని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు వక్ఫ్‌బోర్డే ఉదాహరణ అన్నారు. "కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపుల కోసమే చట్టాలు చేసింది. వక్ఫ్ చట్టమే దానికి ఉదాహరణ. 2014లో ఢిల్లీ సమీపంలోని చాలా ఆస్తులను వక్ఫ్ బోర్డుకు కట్టబెట్టారు. రాజ్యాంగంలో వక్ఫ్ చట్టానికి చోటే లేదు. కానీ, ఇప్పటికీ ఈ సదుపాయాన్ని కాంగ్రెస్ పార్టీ తమ కుటుంబ ఓటు బ్యాంకుగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అసలైన లౌకికవాదాన్ని చంపేసే ప్రయత్నం చేస్తోంది" అని మోదీ ధ్వజమెత్తారు.



ఏం చేసిందని మహాయుతికి ఈ ఓట్ల సునామీ?

ముంబై: మహారాష్ట్రలో ఏం చేసిందని బీజేపీ సారథ్యంలోని మహాయుతి కూటమికి ఓట్ల సునామీ వచ్చిందో అర్థం కావడం లేదని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. బీజేపీకి సానుకూల పవనాలు వీచాయనడం కంటే దాని గెలుపునకు సునామీయే వచ్చినట్టు ఫలితాలు చెబుతున్నాయన్నారు. అయితే ఇంత భారీ విజయం ఆ కూటమికి ఎలా దక్కిందో తెలియడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)... అంచనాలను మించి ఫలితాలు సాధించడం, బీజేపీని కంగుతినిపించిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ నాలుగు నెలల్లో పరిస్థితులు ఇంతలా ఎలా మారిపోతాయని సందేహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతుల దుస్థితి, నిరుద్యోగిత వంటి సమస్యలను ఎన్‌డీఏ పరిష్కరించిందా అని ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో నాతో నిలబడి, నన్ను కుటుంబ పెద్దలా భావించి నా మాట విన్న ఇదే మహారాష్ట్ర ఇలాంటి తీర్పునిచ్చిందంటే నమ్మలేకపోతున్నానని చెప్పారు. విజయం సాధించిన మహాయుతిని అభినందిస్తూ.. ఆ కూటమి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పథకాలను అమలు చేయాలని సూచించారు.

ఆటోవాలా నుంచి 'మహా'నేతగా

తిరుగుబాటు నేత శింధే విజయబావుటా



ముంబై, నవంబరు 23: తన వర్గం ఎమ్మెల్యేలను కూడగట్టుకొని బీజేపీ మద్దతుతో సీఎం అయిన ఏక్‌నాథ్ శింధే నిన్నటిదాకా 'తిరుగుబాటు' నేతే! ఇప్పుడు మాత్రం జనామోదం పొందిన అగ్రనేత. రెండున్నరేళ్ల క్రితం బీజేపీ సాయంతో శివసేనను చీల్చి.. ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టి, కమలం పెద్దల ఆశీస్సులతోనే పదవిలో కొనసాగాడనిపించుకున్న శింధే.. తాజా ఎన్నికల ద్వారా ఒక్కసారిగా శిఖరస్థానానికి ఎదిగారు. ఇప్పుడో మహారాష్ట్రలో దిగ్గజనేత. ఉద్ధవ్ ఠాక్రే శివసేన మట్టికరవడంతో 'అసలైన శివసేన' అధిపతి తానేనని అనిపించుకున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో 15 స్థానాల్లో పోటీ చేసిన ఏడింట్లోనే గెలిచి పెద్దగా ప్రభావం చూపకపోయిన శింధే శివసేనను మహాయుతి కూటమి భాగస్వామిగా తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 57 స్థానాల్లో పార్టీని గెలిపించుకొని పడిలేచారనిపించుకున్నారు. రెండున్నరేళ్లు ఆయన ముఖ్యమంత్రిగా ఆయన ప్రవేశపెట్టిన వివిధ పథకాలకు లభించిన ఆదరణ ఆయనకు ఓట్లు రాల్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2022లో శివసేన పార్టీ అగ్రనేత ఉద్ధవ్‌ఠాక్రేపై 40 మంది ఎమ్మెల్యేలతో తిరుగుబాటు చేసి బీజేపీ మద్దతుతో 2022 జూలై 30న శింధే ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. శింధే మౌనముని. తక్కువగా మాట్లాడతారు. శింధే వయసు 58 ఏళ్లు. ఆయన స్వస్థలం సతారా తాలూకాలోని జవాలీ. నూనుగు మీసాల వయసులో షిండే కుటుంబ పోషణ కోసం ఠాణేలో ఆటో రిక్షా నడిపేవారు. బాల్‌ఠాక్రేకు వీరాభిమాని. అదే ఆయన్ను రాజకీయాల్లోకి ప్రవేశించేలా చేసింది. 1980లో అప్పటి ఠాణే శివసేన అధ్యక్షుడు ఆనంద్ దీఘే ఆశీస్సులతో శింధే రాజకీయాల్లోకి వచ్చారు. 1997లో ఠాణే మునిసిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికయ్యారు. 2001లో ఆనంద్ దీఘే స్థానంలో ఠాణేలో శివసేన పగ్గాలు చేపట్టారు షిండే. బాల్‌ఠాక్రే మేనల్లుడు రాజ్‌ఠాక్రే పార్టీ వీడి మహారాష్ట్ర నవనిర్మాణ సేన పేరుతో వేరు కుంపటి పెట్టిన తర్వాత శివసేనలో శింధే ప్రాధాన్యం పెరిగింది. తాజా ఎన్నికలతో కలుపుకొంటే కోప్రీ-పచ్ పఖాడీ అసెంబ్లీ స్థానం నుంచి షిండే వరుసగా ఐదుసార్లు.. అంటే 2004, 2009, 2014, 2019, 2024లో ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. షిండే కుమారుడు శ్రీకాంత్ శింధే వైద్యుడు. 2014లో శ్రీకాంత్ కల్యాణ్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

దేవేంద్రుడికే సింహాసనం!

మహారాష్ట్ర సీఎం పదవి ఫడణవీస్‌కే.. శింధేకు మరోసారి అవకాశం లేనట్లే

- కూటమిలో బీజేపీకి భారీ మెజారిటీ..
- డిప్యూటీలుగా శింధే, అజిత్ పవార్?

న్యూఢిల్లీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యంత కీలక రాష్ట్రమైన మహారాష్ట్రలో ఎన్నికల కీలక ఘట్టం ముగిసింది. ఇక తేలాల్సింది ముఖ్యమంత్రి ఎవరు? అనేదే..! అయితే, మహాయుతిలోని పార్టీలలో సీఎం పదవి పంచాయితీ తలెత్తకుండా.. ప్రజలు స్పష్టమైన తీర్పు చెప్పారు. బీజేపీ, శివసేన (శింధే), ఎన్సీపీ (అజిత్ పవార్)తో కూడిన ఈ కూటమిలో బీజేపీ అత్యధిక సంఖ్యలో 133 సీట్లు గెలిచింది. 288 స్థానాలున్న అసెంబ్లీలో సాధారణ మెజారిటీకి ఇది 12 సీట్లే తక్కువ. శివసేన 57, ఎన్సీపీ 40 సీట్లు సాధించాయి. బీజేపీ 80 శాతంపైగా స్ట్రయిక్ రేట్‌తో అత్యధిక స్థానాలు సాధించడంతో సీఎం ఏ పార్టీ నుంచో తేలిపోయింది. ప్రస్తుత డిప్యూటీ సీఎం, 2014-19 మధ్యన సీఎంగా పని చేసిన దేవేంద్ర ఫడణవీస్ పేరు గట్టిగా వినిపిస్తోంది. సీఎం ఏక్‌నాథ్ శింధే మరోసారి ఆశలు పెట్టుకున్నప్పటికీ నెరవేరే అవకాశం కనిపించడం లేదు. పార్టీకి వీర విధేయుడు, ఎన్నికల్లోనూ విజయపథాన నడిపించడంతో ఫడణవీస్ వైపే బీజేపీ అధిష్ఠానం మొగ్గుచూపుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇక కేంద్ర హోం మంత్రి, బీజేపీ కీలక నాయకుడు అమిత్ షా ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్న సమయంలోనే దేవేంద్రకు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. దీంతో ఫడణవీస్‌నే సీఎం చేస్తారనే ఊహాగానాలకు బలం చేకూరుతోంది. షా.. శింధేకు సైతం ఫోన్ చేసి అభినందించారు. కాగా, సోమవారం బీజేపీ శాసనసభా పక్ష సమావేశం జరగనుంది. అదే రోజు మహాయుతి కూటమి సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 26న కొత్త సీఎం ప్రమాణం చేయనున్నట్లు తెలుస్తోంది. శింధే శివసేనకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు తమ నాయకుడి ప్రజాదరణతోనే కూటమికి ఇంతటి విజయం దక్కిందని, ఆయనకే సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. శివసేన నాయకుడు నరేష్ మాస్కే మాట్లాడుతూ.. మహాయుతిపై ప్రజలు విశ్వాసం ఉంచారని, శింధేను బాల్ థాక్రే అసలైన వారసుడిగా తేల్చారని ప్రకటించారు. మరోవైపు, ఏడాదిన్నర కిందట నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ని చీల్చి, శింధే సారథ్యంలోని ప్రభుత్వంలో చేరిన అజిత్ పవార్ మరోసారి డిప్యూటీ సీఎం పదవితోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి కనిస్తోంది. 'ఎప్పుడూ ఉప ముఖ్యమంత్రిగానే ఉండిపోవాలా?' అంటూ గతంలో నిట్టూర్చిన అజిత్.. ఈ ఎన్నికల్లో 40 సీట్లు సాధించారు. బీజేపీ గణనీయ స్థానాలు నెగ్గడంతో ఆయనకు మారు మాట్లాడే అవకాశం లేకుండా పోయింది.



కూటమి నిర్ణయిస్తుంది: ఫడణవీస్

కాబోయే సీఎం ఎవరనేది మహాయుతి కూటమి నిర్ణయిస్తుందని, ఈ విషయంలో వివాదం ఏమీలేదని ఫడణవీస్ స్పష్టం చేశారు. ఒక్కటిగా ఉంటే భద్రంగా ఉంటాం' అనే తమ నినాదానికి మద్దతు లభించిందన్నారు. బీజేపీతో గతంలో విభేదించి వెళ్లిపోయిన ఉద్ధవ్ థాక్రే సారథ్యంలోని శివసేనను ఉద్దేశిస్తూ.. అసలైన శివసేన ఏదో ప్రజలు తేల్చారని అన్నారు.

నాడు శివసేన పరిస్థితే నేడు శింధే సేనకు

ఐదేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి శివసేనకు ఎదురైన పరిస్థితే నేడు శింధే సారథ్యంలోని శివసేనకు ఎదురవడం గమనార్హం. 2019లో బీజేపీ 105, ఉమ్మడి శివసేన 56 సీట్లు నెగ్గాయి. వంతులవారీగా సీఎం పదవి చేపట్టడంపై బీజేపీ విముఖత వ్యక్తం చేయడంతో ఉద్ధవ్ థాక్రే కాంగ్రెస్‌తో జట్టు కట్టారు. ఈ ప్రభుత్వాన్ని కూల్చిన శింధే.. బీజేపీతో కలిసి సర్కారు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. తర్వాత ఎన్సీపీని చీల్చిన అజిత్ పవార్ కూడా వచ్చి చేరారు.

విద్యార్థి దశలోనే ఆర్ఎస్ఎస్‌లోకి..

విద్యార్థి దశలోనే ఆర్ఎస్ఎస్‌లోకి.. 27 ఏళ్లకే నాగపూర్ వంటి పెద్ద నగరానికి మేయర్.. 44 ఏళ్ల వయసుకే సీఎం.. ఇదీ ఫడణవీస్ ప్రస్థానం. ప్రస్తుతం 54 ఏళ్లున్న ఆయన.. మహారాష్ట్రకు మూడోసారి సీఎం కాబోతున్నారు. 1970లో పుట్టిన ఫడణవీస్.. 1997లో నాగపూర్ మేయర్‌గా పనిచేశారు. 1999 నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. 2014లో బీజేపీ తరఫున తొలిసారి మహారాష్ట్ర సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. 2019లో సీఎం పదవిని రెండోసారి చేపట్టినప్పటికీ మెజారిటీ లేకపోవడంతో ఐదు రోజుల్లోనే దిగిపోయారు.

వయనాడ్‌లో ప్రియాంకకు పట్టం

- అన్న రాహుల్ గాంధీ రికార్డును దాటి 4.1 లక్షల ఓట్ల మెజారిటీతో విజయం



న్యూఢిల్లీ, నవంబరు 23: అన్న రాహుల్ గాంధీని వరుసగా రెండుసార్లు గెలిపించిన వయనాడ్ ప్రజలు.. ఇప్పుడు ఉప ఎన్నికలో చెల్లెలు ప్రియాంకా గాంధీకి భారీ విజయం చేకూర్చారు. రాహుల్ రికార్డును దాటి 4.1 లక్షల ఓట్ల మెజారిటీతో ఆమెకు పట్టం కట్టారు. రెండు దశాబ్దాల క్రితం గాంధీ-నెహ్రూ కుటుంబం వారసురాలిగా రాజకీయాలకు పరిచయమైన ప్రియాంక.. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే తొలిసారి. తల్లి సోనియాగాంధీ రాజ్యసభ సభ్యురాలు. రాహుల్ వయనాడ్, రాయ్‌బరేలీ నుంచి గెలిచి.. వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు. అక్కడ నుంచి ప్రియాంక గెలుపుతో ఒకే కుటుంబం నుంచి ముగ్గురు ఎంపీలు ఎన్నికైనట్టు అయింది. ప్రేమాభిమానాలు కురిపించి.. తనకు విజయం అదించిన వయనాడ్ ప్రజలకు ప్రియాంక కృతజ్ఞతలు తెలిపారు. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం 2004లో ప్రియాంక తొలిసారి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2019 జనవరిలో ఆమె ఉత్తరప్రదేశ్ తూర్పు విభాగానికి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆ మరుసటి ఏడాది మొత్తం యూపీకి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2022లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రచార బాధ్యతలను తీసుకుని.. రాష్ట్రమంతటా పర్యటించి ప్రజల దృష్టిని ఆకర్షించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి చెందినా ప్రియాంక ప్రచారం మాత్రం మెప్పించింది. తర్వాత 2022 చివర్లో జరిగిన హిమాచల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె కీలక పాత్ర పోషించి.. గెలుపునందించారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు సోనియా ప్రత్యక్ష ఎన్నికల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. దీంతో రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. 'స్టార్ క్యాంపెయినర్'గా విస్తృత ప్రచారం చేసేందుకే అప్పట్లో ఆమె పోటీకి దూరంగా ఉండిపోయారు.




కాంగ్రెస్.. తుస్!

- మొన్న హరియాణాలో నేడు మహారాష్ట్రలో ఘోర ఓటమి

న్యూఢిల్లీ, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): హరియాణా ఎన్నికల్లో బీజేపీని ఓడించలేకపోయిన కాంగ్రెస్.. మహారాష్ట్రలో కూడా ఘోరపరాజయం చెందడంతో ఆ పార్టీ సామర్థ్యంపై పెద్ద ఎత్తున సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హరియాణా, మహారాష్ట్రల్లో ప్రభుత్వాలపై నెలకొన్న ప్రజా వ్యతిరేకతను కూడా కాంగ్రెస్ తమకు అనుకూలంగా ఉపయోగించుకోవడంలో విఫలమైంది. కులగణన, అదానీ, ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గం వంటి అంశాలను తరచూ ప్రస్తావిస్తున్న రాహుల్ గాంధీ ఈ అంశాలపై ప్రజాస్పందనను రేకెత్తించడంతో విఫలమయ్యారని పార్టీ వర్గాలే భావిస్తున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా ప్రజల్లో నాటుకునేలా ఏదైనా ఒక అంశాన్ని బలంగా తీసుకెళ్లలేకపోయారని పేర్కొంటున్నాయి. బీజేపీ అప్రతిహత విజయాలతో దూసుకెళ్తోంది. మతపరమైన భావోద్వేగాలను రేకెత్తిస్తూనే, అభివృద్ధిపై చర్చను జరుపుతూ ప్రజల్లోకి వెళ్తోంది. మహావికాస్ అగాడీ కూటమిలో అతి పెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ 102 సీట్లు తీసుకుని అందులో 90% సీట్లలో పరాజయం పాలు కాగా, బీజేపీ 142 సీట్లలో పోటీ చేసి 90% పైగా సీట్లలో విజయం సాధించింది. ఫలితాల్లో ఇంతటి వ్యత్యాసం ఆ రెండు పార్టీల ఎన్నికల వ్యూహరచన, ప్రణాళికల్లో ఉన్న తేడాలను తెలియజేస్తోంది. బీజేపీతో 76 సీట్లలో ముఖాముఖి తలపడిన కాంగ్రెస్ కేవలం 10 స్థానాల్లోనే గెలిచింది.

ఇండియా కూటమి మనుగడకు ప్రమాదం

మహారాష్ట్ర ఫలితాలతో పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ(ఎస్పీ), ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేన అస్తిత్వం కోల్పోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహా వికాస్ అగాడీ కూటమిలో అన్ని పార్టీల కంటే తక్కువ స్థానాలు గెలుచుకున్న పవార్ పార్టీ మనుగడ సమస్యను ఎదుర్కోవచ్చు. ఈ ఎన్నికలను తన చివరి ఎన్నికలుగా శరద్ పవార్ పేర్కొన్నారు. దీంతో ఆయన అనుయాయులంతా అజిత్ పవార్ శిబిరంలో చేరే అవకాశాలున్నాయి. ఇక షిండే నేతృత్వంలోని శివసేననే నిజమైన శివసేనగా ప్రజలు తీర్పు ఇవ్వటంతో ఉద్ధవ్ అనుయాయులు కూడా తమ దారి తాము చూసుకునే అవకాశాలు లేకపోలేదు.




హేమంత్‌కే పట్టం

ఝార్ఖండ్‌లో 'ఇండియా' కూటమి హవా

- మొత్తం 81 స్థానాల్లో 56 సీట్లు కైవసం
- 24 సీట్లకే ఎన్డీయే కూటమి పరిమితం

రాంచీ, నవంబరు 23: గనుల గడ్డ ఝార్ఖండ్ మరోసారి హేమంత్ సోరెన్ వశమైంది. ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) జయ కేతనం ఎగురవేసింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి నిరాశే ఎదురైంది. 2000లో ఝార్ఖండ్ ఏర్పాటైనప్పటి నుంచి ఏ పార్టీ కూడా వరుసగా రెండోసారి ప్రభుత్వా న్ని ఏర్పాటు చేయలేదు. ఈ సంప్రదాయానికి స్వస్తి పలుకుతూ ఓటర్లు సోరేన్‌కు మరో అవకాశం ఇచ్చారు. మొత్తం 81 అసెంబ్లీ స్థానాలున్న ఝార్ఖండ్‌లో మ్యాజిక్ ఫిగర్ 41 కాగా, 'ఇండియా' కూటమి ఏకంగా 56 స్థానాలను కైవసం చేసుకొని తిరుగులేని ఆధిక్యం సాధించింది. ఎన్డీయే కూటమి 24 సీట్లకే పరిమితమైంది. మరో స్థానంలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. సంక్షేమ పథకాలు, స్థానిక ప్రాధాన్యాలు, ఎన్నికల ముందు హేమంత్ సోరెన్ అరెస్టు తదితర అంశాలు బలంగా పని చేశాయి. జేఎంఎంకు విజయాన్ని కట్టబెట్టాయి. సోరెన్ అరెస్టు బీజేపీ చేసిన కుట్రగా ఓటర్లలోకి తీసుకెళ్లడంలో జేఎంఎం విజయం సాధించింది. అలాగే జేఎంఎం వాడిన 'ఆదివాసీ' కార్డు ముందు సంతాల్ పరగణాల ప్రాంతం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టాలన్న బీజేపీ ఎన్నికల అజెండా నిలబడలేకపోయింది. దీనికితోడు ఫిరాయింపుదారులకు నామినేషన్లు ఇవ్వడంపై బీజేపీలో నెలకొన్న అంతర్గత విభేదాలు పార్టీకి నష్టం చేకూర్చాయి. మరోవైపు మయ్యా యోజన కింద మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్న జేఎంఎం హామీ కూడా ఓటర్లపై బ్రహ్మాస్త్రంలా పనిచేసింది.



మహారాష్ట్రలో ఒక చోట మజ్లిస్ గెలుపు

ఔరంగాబాద్, నవంబరు 23: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మజ్లిస్ పార్టీ మహారాష్ట్ర ఎన్నికల్లో ఓ సిటింగ్ స్థానాన్ని కోల్పోయినా.. ఓట్ల శాతాన్ని మెరుగుపరుచుకుని, మరో సిటింగ్‌ను నిలబెట్టుకుంది. మరాఠ్వాడలో ముస్లిం ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రధాన పార్టీల గెలుపోటములపై మజ్లిస్ తీవ్ర ప్రభావమే చూపించింది. గత ఎన్నికల్లో మజ్లిస్.. మాలేగావ్ సెంట్రల్, ధూలే(సిటీ) నియోజకవర్గాల్లో పాగా వేసిన విషయం తెలిసిందే..! ఈ సారి నాలుగు ఎస్సీ రిజర్వ్ స్థానాలు సహా.. మొత్తం 16 చోట్ల బరిలోకి దిగి, మాలేగావ్ సెంట్రల్‌లో అబ్దుల్ ఖలీఖ్ విజయం(కేవలం 132 ఓట్ల తేడా)తో సరిపెట్టుకుంది. అయితే.. రాష్ట్రవ్యాప్తంగా పోలైన మొత్తం ఓట్లలో 0.85శాతాన్ని తన ఖాతాలో వేసుకుంది.

హేమంత్-కల్పన జయకేతన.. జంట!

భర్తకు బాసటగా భార్య.. బీజేపీ నుంచి అవమానాలు.. బంటీ-బబ్లీ అంటూ విమర్శలు

- అన్నీ భరించి మరీ ప్రచారం
- ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజల మధ్యే కల్పనా సోరెన్
- సెంటిమెంటు సహా పథకాలపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం
- అనేక ప్రతికూలతలు ఎదిరించి సక్సెస్ అయిన భార్యాభర్తలు


సతీమణి కల్పనా సోరెన్‌తో హేమంత్ సోరెన్

ప్రతి మగవాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందని అంటారు. ఝార్ఖండ్‌లో జేఎంఎం అప్రతిహత విజయం వెనుక, మరీ ముఖ్యంగా సీఎం హేమంత్ సోరెన్ గెలుపు వెనుక ఆయన సతీమణి కల్పనా సోరెన్ నిర్వహించిన పాత్ర ఎనలేనిదనడంలో సందేహం లేదు. గిరిజన మహిళలను తమవైపు తిప్పుకోవడంలో ఈ జంట పడిన కష్టం ఓట్ల రూపంలో ఫలితాన్నిచ్చింది. ప్రధాన ప్రతిపక్షం బీజేపీ నుంచి సూటి పోటి మాటలు తూటాల్లా తగిలినా, బంటీ-బబ్లీ అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించినా, 'హెలికాప్టర్ మేడమ్' అని కమలనాథులు ఎద్దేవా చేసినా కల్పనా సోరెన్.. తన భర్తను మరోసారి సీఎంగా చూడాలన్న పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ప్రచార బాట పట్టారు. ఉదయం 6నుంచి రాత్రి 10 గంటల దాకా ప్రజల మధ్యే ఉన్నారు. తన భర్తను ఈడీ అరెస్టు చేసిన విధానం, జైల్లో పెట్టిన తీరు గురించి ప్రజలకు వివరించి, సానుభూతిని ప్రోది చేశారు. గిరిజనులకు ప్రభు త్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను, మరోసారి హేమంత్ సీఎం అయితే.. ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. వారి ఓట్లను అనుకూలంగా మార్చుకోవడంలో సఫలీకృతులయ్యారు.

అరెస్టు తర్వాత..

మనీ లాండరింగ్ కేసులో సీఎం హేమంత్ సోరెన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఈ ఏడాది జనవరి 31న అరెస్టు చేసింది. అప్పటి వరకూ ఇంటి పట్టునే ఉన్న ఆయన సతీమణి కల్పనా సోరెన్.. బయటికొచ్చి రాజకీయాల బాట పట్టారు. తన భర్తను అన్యాయంగా అరెస్టు చేశారని, అక్రమ కేసులు బనాయించారని అప్పటి నుంచే ప్రజలకు వివరించడం ప్రారంభించారు. సీబీఐ, ఈడీ కేంద్రం చేతిలో కీలుబొమ్మలుగా మారాయని.. బీజేపీని వ్యతిరేకించే పార్టీలపై వాటిని ప్రయోగిస్తున్నారని.. నిప్పులు చెరిగారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ఆమె కూడా రంగంలోకి దిగి.. మొత్తం 200కు పైగా ప్రచార సభల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా గిరిజనుల ఆత్మగౌరవ నినాదాన్ని ఎక్కువగా వినిపించారు. హేమంత్, కల్పనలు ఇరువురూ అలుపెరుగని ప్రచారం చేశారు. ప్రస్తుతం అమలు చేస్తున్న మెయ్యా సమ్మాన్ యోజన, ఆదివాసీ అస్మిత పథకాలను దంపతులు ఎక్కువగా ప్రచారం చేశారు. ఈ పథకం కింద 18-50 ఏళ్ల వయసున్న మహిళలకు ప్రతి నెలా రూ.1000 ఇస్తున్నారు. తాము తిరిగి అధికారంలోకి వస్తే ఈ మొత్తాన్ని రూ.2500కు పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ ప్రచారం గిరిజన మహిళలను, యువతులను భారీ ఎత్తున ఆకర్షించింది.

ఒకరు పథకాలు-మరొకరు సెంటిమెంటు

హేమంత్-కల్పన సోరెన్ జంట తమ ప్రచార పర్వంలో వినూత్న పంథాను ఎంచుకున్నారు. హేమంత్ సోరెన్ బీజేపీని టార్గెట్ చేయగా, కల్పన తన భర్తను అన్యాయంగా జైలుకు పంపించారని, గిరిజనులపై కేంద్రం కక్షసాధింపు చర్యలు చేపడుతోందని సెంటిమెంటును రగిలించారు. ఇక, హేమంత్ సోరెన్ బీజేపీపై ఘాటు విమర్శలతో విరుచుకుపడ్డారు. అక్రమంగా తనను జైల్లో పెట్టారని, అసత్య ప్రచారాలు చేసేందుకు, కేసులు కట్టేందుకు బీజేపీ రూ.500 కోట్లు ఖర్చు పెట్టిందని చెప్పుకొచ్చారు. వీరివురి వాగ్ధాటి, సెంటిమెంటు ముందు బీజేపీ నిలబడలేక పోయింది. వెరసి హేమంత్-కల్పనలు ఝార్ఖండ్ విజయంలో శక్తిమంతమైన జంటగా నిలిచారు.

ఎన్నో ప్రతికూలతలు!

భర్తకు బాసటగా నిలిచిన కల్పనా సోరెన్‌కు ప్రచార పర్వంలో ఎన్నో ప్రతికూలతలు ఎదురయ్యాయి. ప్రతిపక్షం బీజేపీ సంధించిన ప్రశ్నలు, చేసిన విమర్శలు అగ్నిపరీక్షగా మారాయి. హేమంత్ జైలుకు వెళ్లిన తర్వాత పార్టీ విధేయుడిగా ఉన్న చంపయి సోరెన్‌ను సీఎంను చేశారు. హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో జూన్ 28న హేమంత్ జైలునుంచి బయటకొచ్చారు. అనంతరం చంపయితో రాజీనామా చేయించి తిరిగి సీఎం పీఠం ఎక్కారు. ఈ విషయాన్ని బీజేపీ హైలెట్ చేస్తూ గిరిజనుడైన చంపయిని హేమంత్ అవమానించారంటూ విస్తృతంగా ప్రచారం చేసింది. అదేసమయంలో చొరబాటు దారుల పట్ల హేమంత్ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందనీ ఆరోపించింది. మరోవైపు హేమంత్ సోదరుడి భార్య సీతా సోరెన్ బీజేపీకి అనుకూలంగా మారిపోయారు. చంపయి సోరెన్ కూడా కమలం గూటికి చేరిపోయారు. ఇక, సోరెన్‌ల కుటుంబానికి అత్యంత విధేయుడిగా పేరున్న లోబిన్ హెమ్‌బ్రామ్ కూడా బీజేపీకి అనుకూలంగా మారారు. వీరు కూడా హేమంత్, కల్పన దంపతులను టార్గెట్ చేసుకున్నారు. అయినా.. కల్పన, హేమంత్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు.

గెలిపించిన 'సోరెన్ సంక్షేమం'

రాంచీ: ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంలో సంక్షేమ పథకాలు ప్రధాన భూమిక పోషించాయి. ఎన్నికల ప్రచారంలో భారీగా సంక్షేమ పథకాలను ప్రకటించడంతో జేఎంఎం(ఝార్ఖండ్ ముక్తి మోర్చా) నేతృత్వంలోని ఇండియా కూటమికి ఓటర్లు పట్టం కట్టారు. ప్రధానంగా ముఖ్యమంత్రి మయ్యా సమ్మాన్ యోజన కింద మహిళలకు ప్రస్తుతం ఇస్తున్న నెలకు రూ.వెయ్యిని రూ.2,500కు పెంచుతామని, ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, విద్యార్థులకు పీహెచ్‌డీ వరకు ఉచితవిద్య అందిస్తామని, వ్యవసాయానికి వడ్డీ రహిత రుణాలిస్తామని, అటవీ సంరక్షణ చట్టానికి చేసిన సవరణలను ఉపసంహరించడం ద్వారా గ్రామసభ అధికారాలను పునరుద్ధరిస్తామని హేమంత్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారు. దీంతోపాటు అలాగే, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లుల మాఫీ, సహారా బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సోరెన్ కుటుంబంలో సీత తప్ప ముగ్గురికి పట్టం కట్టిన ఓటర్లు

ఝార్ఖండ్ ప్రజలు జేఎంఎం చీఫ్ హేమంత్ సోరెన్ కుటుంబాన్ని అక్కున చేర్చుకున్నారు. ఈ కుటుంబం నుంచి మొత్తం నలుగురు నాయకులు తాజా ఎన్నికల్లో పోటీ చేశారు. బర్‌హైత్ నియోజకవర్గం నుంచి హేమంత్ సోరెన్ వరుసగా మూడోసారి కూడా విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి గమ్లియేల్ హెమ్‌బ్రామ్‌పై 39,791 ఓట్ల మెజారిటీతో గెలుపు గుర్రం ఎక్కారు. హేమంత్‌కు 95,612 ఓట్లు రాగా, హెమ్‌బ్రామ్‌కు 55,821 ఓట్లు వచ్చాయి. హేమంత్ సతీమణి కల్పనా సోరెన్ గాండే నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి మున్నియా దేవిపై 17,142 ఓట్ల మెజారిటీతో విజయంసాధించారు. సీఎం హేమంత్ తమ్ముడు బసంత్ సోరెన్ దుమ్కా నియోజకవర్గంలో విజయం దక్కించుకున్నారు. కుటుంబంతో విభేదించి బీజేపీతో చేతులు కలిపిన సీఎం హేమంత్ వదిన సీతా సోరెన్ కమలం గుర్తుపై జంతారా నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఘోర పరాజయం పొందారు. కాంగ్రెస్ అభ్యర్థి ఇర్ఫాన్ అన్సారీ 43,676 ఓట్ల భారీ మెజారిటీతో సీతాపై విజయం దక్కించుకున్నారు. ఇక, ఝార్ఖండ్ ఎన్నికల్లో గెలిచిన ప్రముఖుల్లో మాజీ సీఎం చంపాయీ సోరెన్, ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ ఉన్నారు. సరాయ్‌కెలా నుంచి చంపాయీ సోరెన్ (బీజేపీ) నెగ్గారు. ధన్వార్ నుంచి బాబూలాల్ మరాండీ 35,068 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాగా చందన్‌కియారి నుంచి బరిలో దిగిన ప్రతిపక్ష నేత అమర్ కుమార్ బౌరి (బీజేపీ) మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు.

గిరిజన యోధుడు



ఆటుపోట్లు తట్టుకుని నిలబడ్డ హేమంత్

- 38వ ఏట తొలిసారి సీఎంగా బాధ్యతలు
- ఏడాది కాలానికే ముగిసిన పదవి
- 2019లో రెండోసారి ముఖ్యమంత్రి పీఠం
- 5 నెలలు జైలు.. ఆపై బెయిలు

రాంచి, నవంబరు 23: గిరిజన పోరాటాల వీరుడిగా ఝార్ఖండ్ గడ్డపై హేమంత్ సోరెన్ చెరగని ముద్ర వేశారు. రాష్ట్రంలో సీఎం పీఠాన్ని అధిరోహించిన చిన్న వయస్కుడిగా గుర్తింపు పొందిన ఈ జేఎంఎం నేత.. రాజకీయ కెరీర్‌లో పలు ఆటుపోట్లు ఎదుర్కొని నిలబడ్డారు. కేంద్ర ప్రభుత్వంతో ఓ పక్క యుద్ధం చేస్తూనే.. మరో పక్క పార్టీలో అంతర్గత పోరును కూడా తట్టుకుని మూడోసారి విజేతగా నిలిచారు. నిరంతర పోరాటాలే ఆయన్ని మరోసారి సీఎం పీఠంపై కూర్చోబెట్టాయి. 1975 ఆగస్టు 10న హజారీబాగ్ సమీపంలోని నేమ్రా గ్రామంలో హేమంత్ జన్మించారు. తండ్రి, ఝార్ఖండ్ ముక్తి మోర్చా అధినేత శిబు సోరెన్ ప్రభావం ఆయనపై ఉండేది. పాట్నా హైస్కూల్‌లో ఇంటర్మీడియెట్ చదివిన హేమంత్.. రాంచీలోని బిట్స్‌లో చేరి మధ్యలోనే చదువుకు స్వస్తి పలికారు. శిబు సోరెన్ రాజకీయ వారసుడిగా హేమంత్ అన్న దుర్గ రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు. 2009లో దుర్గ అకాల మరణంతో హేమంత్ రాజకీయ అరంగేట్రం చేశారు.

2013లో తొలిసారి సీఎం పదవి

నిజానికి హేమంత్ కెరీర్ అంత సాఫీగా సాగలేదు. 2009లో రాజ్యసభ సభ్యుడిగా తొలిసారి పదవి చేపట్టారు. ఆ పదవికి 2010లో రాజీనామా చేసి బీజేపీ నేతృత్వంలోని అర్జున్ ముండా ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కూటమి విచ్ఛిన్నంతో 2012లో ప్రభుత్వం కూలిపోయి వెంటనే రాష్ట్రపతి పాలన వచ్చింది. ఆ తర్వాత 2013లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి 38 ఏళ్లకే తొలిసారి సీఎం పీఠాన్ని అధిరోహించారు. ఆ సమయంలో ఆయనకు కాంగ్రెస్, ఆర్జేడీ మద్దతునిచ్చాయి. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడంతో హేమంత్ తొలి విడత సీఎం పదవి కొద్ది కాలానికే ముగిసిపోయింది. ప్రతిపక్ష నేతగా ఆయన అసెంబ్లీలో కూర్చోవలసి వచ్చింది. అయితే బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం 2016లో తీసుకొచ్చిన చట్టసవరణలు ఆయనకు రాజకీయంగా కలసి వచ్చేలా చేశాయి. గిరిజన భూములు రక్షించే ఉద్దేశంతో చోటానాగ్‌పూర్ టెనన్సీ యాక్ట్, సంతాల్ పరగణా టెనన్సీ యాక్ట్‌లను సవరించడానికి ప్రభుత్వం ప్రయత్నించడంతో గిరిజనుల హక్కులు కాపాడటానికి హేమంత్ పెద్దఎత్తున ఉద్యమం చేశారు. ఇది ఆయనకు తిరుగులేని పొలిటికల్ మైలేజీ తీసుకొచ్చింది. మళ్లీ రాష్ట్రంలో అధికారం చేపట్టడానికి ఉపయోగపడింది.

కాంగ్రెస్, ఆర్జేడీ సహకారంతో..

జేఎంఎం మిత్ర పక్షాలు కాంగ్రెస్, ఆర్జేడీ సహకారంతో 2019లో హేమంత్ మరోసారి సీఎం పీఠాన్ని అధిరోహించారు. 81 స్థానాలున్న అసెంబ్లీలో ఆయన నేతృత్వంలో జేఎంఎం 30 సీట్లు గెలుచుకుంది. దీంతో ఆయన స్థానం సుస్థిరమైంది. అయితే మైనింగ్ లీజు విషయంలో 2022లో ఎమ్మెల్యే పదవిపై అనర్హత వేటు పడుతుందనగా త్రుటిలో తప్పించుకున్నారు. 2023లో వచ్చిన ఆరోపణలతో ఆయన కెరీర్ మరోసారి ఒడుదుడుకులకు లోనైంది. మనీ లాండరింగ్‌కు సంబంధించిన ఓ కేసులో ఈడాది జనవరి 31న ఆయన అరెస్టు అయ్యారు. అంతకుముందే సీఎం పదవికి కూడా రాజీనామా చేశారు. ఐదు నెలల కారాగారవాసం తర్వాత ఝార్ఖండ్ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఇన్ని సవాళ్లను ఎదుర్కొన్నా కూడా హేమంత్‌కు రాష్ట్రంలోని గిరిజన జనాభా మద్దతుగా నిలిచారు.

సైక్లింగ్, క్రికెట్ అంటే ఇష్టం..

ఇంజనీర్ కావాలనుకున్న హేమంత్.. అనుకోని పరిస్థితుల్లో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 19వ శతాబ్దానికి చెందిన గిరిజన యోధుడు బిర్సా ముండా అంటే ఆయనకు ఎనలేని భక్తి, అభిమానం. ఇక క్రీడలంటే హేమంత్‌కు ప్రత్యేకమైన ఇష్టం. సైక్లింగ్‌పై మక్కువ చూపే ఆయన అప్పుడప్పుడు క్రికెట్ ఆడటానికి కూడా ఇష్టపడతారు. పంజాబ్‌కు చెందిన కల్పనను హేమంత్ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. దుమ్కా, బర్హయిత్ నియోజకవర్గాల్లో చేసిన అభివృద్ధి పనులకుగాను హేమంత్‌కు 2019లో చాంపియన్ ఆఫ్ చేంజ్ అవార్డు దక్కింది.

జైలుకెళ్లొస్తే జై!

కారాగారం టూ అధికారం

ఇరుగు పొరుగున ఉండే ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారని తెలిస్తే చాలు.. ఆ వ్యక్తి కుటుంబంతో మాట్లాడానికి కూడా కొద్ది రోజులు జనం సంశయిస్తారు. నేరం చేశాడా లేదా అనే సంగతి పక్కనెపెడితే.. అరెస్టయిన వ్యక్తి పొరపాటున ఎదురైతే చూసీచూడనట్టుగా తప్పుకుని వెళ్లిపోతారు. ఇదంతా సామాన్యుల వరకే... అదే ఓ రాజకీయ నాయకుడు జైలుకెళ్తే ఆ లెక్క వేరే ఉంటోంది. ఆ నాయకుడి గతం, ఏ నేరారోపణపై జైలుకు వెళ్లాడు వంటి విషయాలన్నీ గాల్లో కలిసిపోతాయి. సదరు నేతను ప్రత్యర్థి పార్టీ అక్రమంగా జైలుకు పంపింది.. అనే వాదం తెరపైకి వస్తుంది. కటకటాల వెనుక ఉన్న నాయకుడు తన ప్రత్యర్థి అయిన అధికార పార్టీ కుట్రను ఎదుర్కొని నిలబడ్డ హీరోగా అవతరిస్తాడు. చివరికి జనమంతా కలిసి ఆ నాయకుడు, అతని పార్టీని అందలం ఎక్కిస్తారు. వెరసి జైలుకెళ్లి వస్తే అధికారం గ్యారంటీ అనేలా దేశ రాజకీయాల పరిస్థితి మారింది. ఇందుకు నిదర్శనంగా నిలిచిన ఇటీవల జరిగిన కొన్ని ఘటనలివి.



హేమంత్ సోరెన్ : ఝార్ఖండ్ ముఖ్యమంత్రి, జేఎంఎం నేత హేమంత్ సోరెన్‌ను ఓ భూకుంభకోణం కేసులో ఈడీ 2024 జనవరి 31న అరెస్టు చేసింది. అప్పటికే ముఖ్యమంత్రి అయిన హేమంత్ అరెస్టు అయిన కాసేపటికే తన పదవికి రాజీనామా చేశారు. 149 రోజులు జైలు జీవితం గడిపిన తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. జూలై 4న తిరిగి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో జేఎంఎం ఆధ్వర్యంలోని ఇండియా కూటమి విజయం సాధించడంతో మరోమారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతోపాటు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు.



నారా చంద్రబాబు నాయుడు : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో 2023లో అప్పటి ఏపీ ప్రభుత్వం అరెస్టు చేసింది. 53 రోజులు జైలు జీవితం గడిపిన చంద్రబాబు బెయిల్‌పై విడుదలయ్యారు. చంద్రబాబును జైలుపాలు చెయ్యడం అధికార పార్టీ వైసీపీని కోలుకోలేని దెబ్బతీసింది. 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమి కనీవినీ ఎరుగని మెజారిటీతో విజయం సాధించింది. చంద్రబాబు తిరిగి సీఎం అయ్యారు.



వైఎస్ జగన్ : వైఎస్ జగన్‌ను అక్రమాస్తుల కేసులో 2012 మే 27న సీబీఐ అరెస్టు చేయగా దాదాపు 16 నెలల జైలు జీవితం గడిపారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పార్టీ వైసీపీ 67 స్థానాల్లో గెలవడంతో ఏపీలో ప్రతిపక్ష పార్టీగా నిలిచింది. ఇక, 2019 ఎన్నికల్లో ఆయన పార్టీ గెలవడంతో ముఖ్యమంత్రి అయ్యారు.



రేవంత్ రెడ్డి : బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు చెందిన ఫామ్ హౌస్‌పై అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారనే ఆరోపణలతో 2020 మార్చి 5న రేవంత్ రెడ్డి(అప్పట్లో ఎంపీ)ని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. 14 రోజుల రిమాండ్ అనంతరం బెయిల్‌పై విడుదలయ్యారు. జైలు నుంచి విడుదలయ్యాక రేవంత్ 2021 జూలైలో టీపీసీసీ అధ్యక్షుడు అయ్యారు. అనంతరం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని గెలిపించుకుని ముఖ్యమంత్రి అయ్యారు.



డీకే శివకుమార్ : డీకే శివకుమార్‌ను మనీ లాండరింగ్ కేసులో 2019 సెప్టెంబరు 3న ఈడీ అరెస్టు చేసింది. ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో 2019 అక్టోబరు 23న విడుదలయ్యారు. అనంతరం కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన డీకే.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఉప ముఖ్యమంత్రి అయ్యారు.



ఒమర్ అబ్దుల్లా : జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసిన నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ చీఫ్ ఫరూఖ్ అబ్దుల్లాను కేంద్ర ప్రభుత్వం 232 రోజులు గృహ నిర్బంధంలో ఉంచింది. 2019 ఆగస్టు 5 నుంచి 2020 మార్చి 24 దాకా ఒమర్ నిర్బంధంలో ఉన్నారు. అనంతరం 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఒమర్ గెలుపొందగా ఆయన పార్టీ ఎన్సీ మొత్తం 42 స్థానాల్లో గెలిచి అధికారం చేపట్టింది. ఒమర్ ముఖ్యమంత్రి అయ్యారు.

- సెంట్రల్ డెస్క్

'స్థానికం' మరిచి చతికిల!

- జాతీయ అంశాలతో ఝార్ఖండ్‌లో బీజేపీకి ఆశాభంగం
- అవినీతి, అక్రమ చొరబాట్ల అంశాలకే ప్రచారంలో పెద్దపీట
- ఓట్లు కురిపించని మాటీ, బేటీ, రోటీ నినాదం

రాంచీ, నవంబరు 23: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా జాతీయ అంశాలకు ప్రచారంలో పెద్ద పీట వేయడం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి కలిసిరాలేదు. బంగ్లాదేశ్ నుంచి భారీగా చొరబాటుదార్లు ఝార్ఖండ్‌లోకి ప్రవేశించి ఆదివాసీ యువతులకు వల వేస్తున్నారని, వారి భూమిని కబ్జా చేస్తున్నారని, వారి ఆహారాన్నీ స్వాహా చేస్తున్నారని బీజేపీ చేసిన ప్రచారం పట్ల ఆ రాష్ట్ర ఓటర్లు పెద్దగా స్పందించలేదు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి కనీసం ముఖ్యమంత్రి అభ్యర్థిని సైతం ప్రకటించకుండా ఎన్నికల ప్రచారంలో అక్రమ చొరబాట్ల అంశానికి పెద్దపీట వేసింది. దీంతో తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి కనీసం మూడో వంతు కూడా సీట్లు రాలేదు. 'మాటీ(మట్టి), బేటీ, రోటీ' నినాదాన్ని బీజేపీ బాగా ప్రచారం చేసింది. అక్రమ చొరబాటుదారుల నుంచి గిరిజనుల భూములను, వారి కుమార్తెలను, వారి ఆహారాన్ని కాపాడతామని హామీ ఇచ్చింది. ఝార్ఖండ్‌లో తాము అధికారంలోకి వస్తే ఎన్ఆర్‌సీ(జాతీయ పౌర పట్టిక) అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తదితర మహామహులు ఝార్ఖండ్ ఎన్నికల్లో భారీగా ప్రచారం నిర్వహించినప్పటికీ కనీసం ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్డీయే కూటమి ప్రకటించలేదు. మోదీ సహా కూటమి అగ్రనేతలు సుమారు 200 బహిరంగసభల్లో చేసిన ప్రసంగాలలో అవినీతి, బంగ్లాదేశ్ నుంచి చొరబాట్ల అంశాలకే పెద్దపీట వేశారు. హేమంత్ సోరెన్ ప్రభుత్వం భారీగా అవినీతికి పాల్పడిందని బీజేపీ నేతలు ఆరోపించినప్పటికీ, అదే పార్టీకి చెందిన మాజీ ముఖ్యమంత్రి చంపయీ సోరెన్‌ను బీజేపీలోకి చేర్చుకున్నారు. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలను ప్రస్తావించడంలో బీజేపీ విఫలమైందని, కేవలం జాతీయ అంశాలు, అవినీతి, అక్రమ చొరబాట్లపైనే ఆధారపడటం వల్ల ఎన్నికల ఫలితాల్లో చతికిలబడిందని రాజకీయ విశ్లేషకుడు డాక్టర్ బగీశ్ చంద్ర వర్మ పేర్కొన్నారు.

అదానీలకు అమెరికా ఎస్ఈసీ సమన్లు

- 21 రోజుల్లో నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశం

న్యూయార్క్, నవంబరు 23: సౌర విద్యుత్తు కాంట్రాక్టులు పొందడం కోసం లంచాలు ఇచ్చారన్న ఆరోపణలపై సమాధానం ఇవ్వాలని అదానీ గ్రూపు వ్యవస్థాపకుడు, చైర్మన్ గౌతం అదానీ (62), ఆయన తమ్ముడి కుమారుడు సాగర్ అదానీలకు అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్(ఎస్ఈసీ) సమన్లు పంపించింది. కాంట్రాక్టులు సంపాదించడం కోసం భారత ప్రభుత్వ అధికారులకు 265 మిలియన్ డాలర్లు(రూ.2,200 కోట్లు) లంచంగా ఇచ్చినట్టు వచ్చిన ఆరోపణలపై 21 రోజుల్లోగా జవాబు ఇవ్వాలని పేర్కొంది. వీటిని గురువారం న్యూయార్క్‌లోని ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టు ద్వారా జారీ చేసింది. ఈమేరకు అహ్మదాబాద్‌లో గౌతం అదానీ నివాసమైన శాంతివన్ ఫాం, సాగర్ నివాసమైన బోదక్‌దేవ్ రెసిడెన్స్‌లకు నోటీసులు పంపించింది. "ఫెడరల్ రూల్స్ ఆఫ్ సివిల్ ప్రొసీజర్‌లోని నిబంధన నెంబరు 12 ప్రకారం సమన్లు అందిన 21 రోజుల్లోగా (అందుకున్న రోజును మినహాయించి) దీనితో జతపరిచిన ఫిర్యాదు/తీర్మానానికి సమాధానం ఇవ్వాలి. ఒకవేళ స్పందించకపోతే మీ పరోక్షంలో ఫిర్యాదిదారు చేసిన వినతిపై విచారణ జరిపి తీర్పు ఇస్తారు" అని పేర్కొంది. సాగర్ అదానీ ప్రస్తుతం అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎస్ఈసీ వీరితోపాటు అజ్యూర్ పవర్ గ్లోబల్ సంస్థ ఎగ్జిక్యూటివ్ సిరల్ కబనెస్‌కు కూడా సమన్లు ఇచ్చింది.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor:* ***N. Rahul Kumar****. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86.* ***Managing Director: Vemuri Radha Krishna,*** *Founder: K.L.N.Prasad.*